


# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు



గిరిజన రైతు కృషే 3
అరకు కాఫీ ఘుమఘుమ!




## వేసవిని జయిద్దాం!

- ఎక్కడా తాగునీటి ఎద్దడి కనిపించకూడదు
- ఎండ తీవ్రతపై మొబైల్ అలెర్ట్‌లివ్వండి
- ముందస్తు జాగ్రత్తలతో వడదెబ్బ మరణాలకు చెక్
- తీవ్ర వడగాలులు వీచే ప్రాంతాల్లో మజ్జిగ కేంద్రాలు
- పశువులకు రూ.35 కోట్లతో 12,138 నీటితొట్లు నిర్మాణం
- పాఠశాలల్లో వాటర్ బెల్ విధానం అమలు
- అడవుల్లో అగ్నిప్రమాదాలపై డ్రోన్ నేత్రాలు
- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలు
- వేసవి ప్రణాళికలపై వివిధ శాఖలతో సమీక్ష

2

# సాయంచేసే చేతులకు వేదిక పీ-4




- సంపన్నులు-పేదలను ఒకేచోట చేర్చడమే లక్ష్యం
- ఎన్నారైలు సహా స్వచ్ఛందంగా ఎవరైనా ముందుకురావొచ్చు
- అండగా నిలిచేవారు 'మార్గదర్శి'
- లబ్ధి పొందేది 'బంగారు కుటుంబం'
- మొదటిదశలో 20 లక్షల కుటుంబాలకు లబ్ధి
- 2029నాటికి పేదరిక నిర్మూలనే సంకల్పం
- ఉగాది రోజున అమరావతిలో పీ-4 ప్రారంభం
- ప్రణాళికకు తుదిరూపునిచ్చిన సీఎం చంద్రబాబు

2



## ఆపరేషన్ మోడల్‌లో పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు

3

- జూన్ 20నాటికి డీపీఆర్ సిద్ధం చేయాలి
- ఆర్థికభారం తగ్గేలా సరికొత్త ఆలోచన చేయండి
- అధికారులకు సీఎం చంద్రబాబు సూచన
- ప్రాజెక్టుపై జనవనరుల అధికారులతో సమీక్ష



## ఉత్తరాంధ్రకు ఇంటర్నేషనల్ యూనివర్సిటీ

- జార్జియా నేషనల్ యూనివర్సిటీతో ఒప్పందం
- రూ.1,300 కోట్లు పెట్టుబడి పెట్టనున్న జీఎన్‌యూ
- మంత్రి నారా లోకేష్ సమక్షంలో ఎంఓయూ
- రాష్ట్ర విద్యార్థులకు అందుబాటులో ప్రపంచస్థాయి ఉన్నత విద్య

4

## 2029 నాటికి 20 లక్షల ఉద్యోగాలు



- మంత్రి నారా లోకేష్ పునరుద్ఘాటన
- ఇన్వెస్ట్‌మెంట్ ట్రాకర్ పోర్టల్‌ను పకడ్బందీగా తీర్చిదిద్దాలి
- ఉద్యోగాల కల్పనకు ప్రతి పాలసీలో సంస్కరణలు
- ఎంఎస్ఎంఈలకు పెద్దఎత్తున ప్రోత్సాహం
- మంత్రుల ఉపసంఘం సమావేశంలో మంత్రి లోకేష్ దిశానిర్దేశం

4

## అకాల వర్షాలతో.. నష్టపోయిన ప్రతి రైతునూ ఆదుకుంటాం



- మంత్రి అచ్చెన్నాయుడు భరోసా
- అరటి రైతులకు హెక్టారుకు రూ.35 వేల ఇన్‌పుట్ సబ్సిడీ
- తిరిగి మొక్కలు వేసుకునేందుకు అదనంగా మరో రూ.75 వేలు
- జగన్‌కు అరటి రైతులు ఇప్పుడు గుర్తొచ్చారా
- గత ఐదేళ్లలో పట్టించుకున్న దాఖలాలు లేవు

5

వైసీపీ హయాంలో...

## ఏపీలో అతిభారీ మద్యం స్కాం

- జగన్‌రెడ్డి బంధువు సునీల్‌రెడ్డి ద్వారా రూ.2 వేల కోట్లు దుబాయ్ తరలించారు
- ఈడీ విచారణ జరపాలి - లోక్‌సభలో ఎంపీ లావు సంచలన ఆరోపణ

5

వయోవృద్ధులకు

## త్వరలో డిజిటల్ కార్డులు

- కేంద్ర సహకారంతో కొత్తగా 12 వృద్ధాశ్రమాలు
- ఇతర ప్రాంతాల్లో చదివే దివ్యాంగులకు నేరుగా పెన్షన్
- మంత్రి డోలా వెల్లడి

6

## పార్లమెంట్‌లో అరకు కాఫీ స్టాళ్లు

- ప్రారంభించిన కేంద్ర మంత్రులు 3

## రాష్ట్రంలో ఆయుష్ సేవల విస్తృతికి ప్రణాళికలు

8

- ఆయుష్ డిస్పెన్సరీల్లో ఖాళీలను సత్వరమే భర్తీ చేయాలి
- అధికారులకు మంత్రి సత్యకుమార్ ఆదేశాలు

## ఉద్యోగులకు అండగా కూటమి ప్రభుత్వం



- అక్కసుతో వైసీపీ దుష్ప్రచారం
- చరిత్రలో లేని విధంగా వైసీపీ హయాంలో ఉద్యోగులకు వేధింపులు
- నాటి బకాయిలు ఇప్పుడు చెల్లిస్తున్నాం
- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు స్పష్టీకరణ

5

# వేసవిని జయిద్దాం!

- ఎక్కడా తాగునీటి ఎద్దడి కనిపించకూడదు
- ఎండ తీవ్రతపై మొబైల్ అలెర్ట్‌లివ్వండి
- ముందస్తు జాగ్రత్తలతో వడదెబ్బ మరణాలకు చెక్
- తీవ్ర వడగాలులు వీచే ప్రాంతాల్లో మజ్జిగ కేంద్రాలు
- పశువులకు రూ.35 కోట్లతో 12,138 నీటితొట్లు నిర్మాణం
- పాఠశాలల్లో వాటర్ బెల్ విధానం అమలు
- అడవుల్లో అగ్నిప్రమాదాలపై డ్రోన్ నేత్రాలు
- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలు
- వేసవి ప్రణాళికలపై వివిధ శాఖలతో సమీక్ష



వేసవి ప్రణాళికపై సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష. పంచాయతీ రాజ్, మునిసిపల్, ఆరోగ్య శాఖలపై నిర్వహించిన సమీక్షకు హాజరైన అధికారులు.

అమరావతి(చైతన్య రథం): రాష్ట్రంలో ఏ ప్రాంతంలోనూ తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు సూచించారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సమస్య కనిపించకుండా చూడాలని... అందుకు అనుగుణంగా అధికారులు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. వేసవి ప్రణాళికపై ముఖ్యమంత్రి చంద్రబాబు సచివాలయంలో సోమవారం సమీక్ష నిర్వహించారు. సమ్మర్ యాక్షన్ ప్లాన్‌పై డిజాస్టర్ మేనేజ్‌మెంట్, పంచాయతీ రాజ్, మున్సిపల్, ఆరోగ్యశాఖల అధికారులతో సమీక్ష చేశారు. ఈ సందర్భంగా సీఎం నిర్దుష్టమైన ఆదేశాలు ఇచ్చారు.

### పసుగ్రాసం కొరత లేకుండా చర్యలు

ఎండల తీవ్రతపై ముందుగా వివిధ విభాగాల నుంచి సమాచారం తెప్పించి ప్రజలను అప్రమత్తం చేయాలని డిజాస్టర్ మేనేజ్మెంట్ అధికారులకు సీఎం సూచించారు. ఎండ వేడిమి సమాచారాన్ని మొబైల్ అలెర్ట్స్ ద్వారా ఆయా ప్రాంతాల ప్రజలకు తెలియజేసి... వారు ఎండలబారిన పడకుండా జాగ్రత్తలు తీసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ముందస్తు జాగ్రత్తల ద్వారా వడదెబ్బ మరణాలు నివారించవచ్చని ముఖ్యమంత్రి అన్నారు. మార్కెట్లు, బస్‌స్టాండ్లు, కూలీ అడ్డాలు, ఇతర జన సమూహం ఉండే ప్రాంతాల్లో ప్రభుత్వ పరంగా చలివేంద్రాలు, మజ్జిగ కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. స్వచ్ఛందంగా చలివేంద్రాలు ఏర్పాటు చేసే వారికి ప్రభుత్వ శాఖల పరంగా సహకారం అందించాలని సూచించారు. 2014-19 మధ్య కూడా ప్రజలకు ఉచితంగా ప్రభుత్వం తరుపున మజ్జిగ అందించామని... ఈసారి కూడా ఎండలు తీవ్రంగా ఉండే ప్రాంతాల్లో మజ్జిగ పంపిణీ కేంద్రాలు ఏర్పాట్లు చేయాలని అన్నారు. రాయలసీమతో పాటు ప్రకాశంజిల్లాలో పశుగ్రాసం కొరతతోపాటు పశువులకు తాగునీరూ లభించని పరిస్థితి ఉంటుందని, ఇలాంటి ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. పశువులకు నీరు అందించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా గ్రామాల్లో రూ.35కోట్లతో 12,138 నీటితొట్ల నిర్మాణం చేపట్టాలని అన్నారు. కూటమి ప్రభుత్వం మనసున్న ప్రభుత్వం అనేది గుర్తెరిగి అధికారులు తమ ఆలోచనలను అమలు చేయాలని సీఎం అన్నారు. వేసవిలో పశువులు, పక్షుల దాహాన్ని తీర్చుకోడానికి ఇబ్బందులు పడకుండా సాధ్య మైనంత వరకు నీటి సదుపాయం కల్పించాలన్నారు.

### పాఠశాలల్లో వాటర్ బెల్ విధానం అమలు

పాఠశాలల్లో వాటర్ బెల్ విధానం అమలు చేయాలని, తప్పనిసరిగా తాగునీరు అందుబాటులో ఉంచాలని సూచించారు. అడవుల్లో అగ్నిప్రమాదాలు, కార్చిచ్చులపై అప్రమత్తంగా ఉండాలని, డ్రోన్లతో పర్యవేక్షించాలని సూచించారు. ఎవరైనా బాధ్యతారాహిత్యంగా కార్చిచ్చుకు కారణమైనట్టు తెలిస్తే కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. అగ్నిప్రమాదాలు జరిగే అస్కారం ఉండేపరిశ్రమల్లో మరితం అప్రమత్తంగా ఉండాలని సీఎం సూచించారు. మున్సిపాలిటీల్లో నీటి సమస్య పరిష్కారానికి అవసరమైన రూ.39 కోట్లు విడుదలకు కూడా సీఎం గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. నీటి లభ్యత పెంచేందుకు గ్రామాల్లో నరేగా ద్వారా ఫాంపాండ్స్ నిర్మాణం, చెరువుల్లో పూడికతీత పనులు చేపట్టాలని సూచించారు. అదేవిధంగా వేసవిలో నరేగా కూలీలకు అదనపు పనిదినాలు మంజూరు చేయడంతో పాటు... వారికి పని ప్రాంతంలో నీళ్లు, ఇతర సౌకర్యాలు కల్పించాలన్నారు. ఉదయం 6 గంటల నుంచి 11 గంటల లోపు ఉపాధి హామీ కూలీలు పనులు ముగించుకుని ఇంటికి చేరుకునేలా చూడాలన్నారు. ప్రజలు, ఉపాధి కూలీలు, ప్రయాణికులు వడదెబ్బ బారిన పడకుండా ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. అదేవిధంగా మున్సిపల్ కార్మికులకు మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటలలోపు బయట ప్రాంతాల్లో పని అప్పగించకుండా చూడాలని సూచించారు. అన్ని ఆసుపత్రుల్లో బెడ్లు, వైద్యులు, వడదెబ్బకు ట్రీట్మెంట్ అందించే అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఇప్పటి నుంచే దోమల నివారణ చర్యలు చేపట్టాలని...తద్వారా మారుమూల ప్రాంతాల ప్రజలు వ్యాధుల భారినపడకుండా చూడాలన్నారు. ఈ సమీక్షలో సీఎస్ విజయానంద్‌తో పాటు ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సాయం చేసే చేతులకు వేదిక పీ-4



- సంపన్నులు-పేదలను ఒకేచోట చేర్చడమే లక్ష్యం
- ఎన్నారైలు సహా స్వచ్ఛందంగా ఎవరైనా ముందుకురావొచ్చు
- అండగా నిలిచేవారు 'మార్గదర్శి'
- లబ్ధి పొందేది 'బంగారు కుటుంబం'
- మొదటిదశలో 20 లక్షల కుటుంబాలకు లబ్ధి
- 2029నాటికి పేదరిక నిర్మూలనే సంకల్పం
- ఉగాది రోజున అమరావతిలో పీ-4 ప్రారంభం
- ప్రణాళికకు తుదిరూపునిచ్చిన సీఎం చంద్రబాబు

అమరావతి (చైతన్య రథం): రాష్ట్రంలో సంపన్నవర్గాలు నిరు పేదలకు సాయమందించేందుకు వీలుగా ప్రభుత్వం పీ-4 విధానం ద్వారా ఒక వేదిక నిర్మిస్తోందని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. ఉగాది రోజున ప్రారంభించే జీరో పావర్టీ -పీ4 విధానంపై సోమవారం సచివాలయంలో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. సాయం అందించేందుకు ఎవరైనా ముందుకు రావొచ్చని, ఎవరినీ ఇందుకోసం ఒత్తిడి చేయొద్దని అధికారులకు సూచించారు. ఎన్నారైలు కూడా పీ4లో భాగస్వాములు కావొచ్చని... గతంలో తన హయాంలో చేపట్టిన జన్మభూమి తరహాలోనే పీ4 కార్యక్రమానికీ ప్రజాదరణ వస్తుందనే నమ్మకం తనకుందన్నారు. పేదలకు మద్దతుగా నిలిచేందుగా స్వచ్ఛందంగా ముందుకొచ్చే ఎవరైనా ఈ వేదికను వినియోగించుకోవచ్చని స్పష్టం చేశారు. పీ4 విధానంలో ప్రభుత్వ పాత్ర కేవలం ఇరువర్గాలను ఒక వేదికపైకి తీసుకురావడమేనని, ప్రభుత్వం తరపున ఎవరికీ అదనపు సాయం ఉండదని చెప్పారు. ఉన్నతవర్గాల వాళ్లు సాయానికి ముందుకొచ్చేలా వారిలో స్ఫూర్తి నింపాలని ముఖ్యమంత్రి కోరారు. లబ్ధి పొందేవారిని 'బంగారు కుటుంబం'గా, సాయం చేసేవారిని 'మార్గదర్శి'గా పిలవాలని సూచించారు. బంగారు కుటుంబానికి ఎంపికలో ఎలాంటి పొరపాట్లు జరగడానికి వీల్లేదన్నారు. గ్రామసభ, వార్డు సభలు నిర్వహించడం ద్వారా తుది జాబితా రూపొందిస్తే వివాదరహితంగా ఉంటుందన్నారు. పీ4 కార్యక్రమానికి, రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం వివిధ వర్గాల ప్రజలకు అమలు చేస్తున్న పథకాలకు ఎటువంటి సంబంధం లేదని సీఎం అన్నారు. పీ4 కార్యక్రమం అనేది సమాజంలో అత్యంత వెనకబడిన వర్గాలకు చేయూతనిచ్చేందుకు చేపట్టిన కార్యక్రమంగా అభివర్ణించారు.

పీ4, ప్రభుత్వ పథకాల అమలుకు ఎటువంటి సంబంధం లేదన్నారు. ప్రజల్లో ఎలాంటి అనుమానాలకు అధికారులు తావివ్వకూడదని తెలిపారు. ఉగాది రోజున అమరావతిలో జరిగే పీ4 ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రతిగ్రామం నుంచి ఒకరైనా హాజరయ్యేలా, ప్రతి నియోజకవర్గం నుంచి ఒక బస్సు ఏర్పాటు చేస్తున్నట్టు అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. పేదరిక నిర్మూలన - జీవన ప్రమాణాలు పెంచడమే ప్రభుత్వ అంతిమ లక్ష్యమని ముఖ్యమంత్రి చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా మొదటి దశలో 20 లక్షల కుటుంబాలకు లబ్ధి కలగనుంది. రాష్ట్రంలో జీరో పావర్టీ లక్ష్యం చేరే వరకు పీ4 కార్యక్రమం నిరంతరం కొనసాగుతుంది.

చైతన్యరథం

- జూన్ 20నాటికి డీపీఆర్ సిద్ధం చేయాలి
- ఆర్థిక భారం తగ్గేలా సరికొత్త ఆలోచన చేయండి
- అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు సూచన
- ప్రాజెక్టుపై జలవనరుల అధికారులతో సమీక్ష

## ఆపరేషన్ మోడల్‌లో

# పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు



అమరావతి (చైతన్య రథం): పోలవరం- బనకచర్ల అనుసంధానం ప్రాజెక్టుకు ఆర్థికభారం పడకుండా ఆపరేషన్ మోడల్‌లో నిర్వహించేందుకు గల అవకాశాలను పరిశీలించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. గోదావరి జలాలను పోలవరంనుంచి లిఫ్టుల ద్వారా తరలించేందుకు అయ్యే విద్యుత్ వినియోగాన్ని ప్రాజెక్టు ప్రాంతంలోనే పంప్డ్ స్టోరేజ్, సోలార్ విద్యుత్ ప్లాంట్లు నెలకొల్పడం ద్వారా ఉత్పత్తి చేసి భారం తగ్గించవచ్చని చెప్పారు. దీనిపై సోమవారం సచివాలయంలో జలవనరుల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ అనుసంధానానికి సంబంధించి డిటెయిల్డ్ ప్రాజెక్టు రిపోర్టు ఈ ఏడాది జూన్ 20నాటికి పూర్తి చేయాలని, ఇదే ఏడాది అక్టోబర్ 20నాటికి ప్రాజెక్టుకు సీడబ్ల్యూసీ ఆమోదం పొందేలా చూడాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. పర్యావరణ అనుమతులు కూడా పొంది, త్వరగా పనులు ప్రారంభించాలని చెప్పారు.

### మొత్తం ప్రాజెక్టు స్వరూపం

పోలవరం- బనకచర్ల అనుసంధానానికి మొత్తం రూ.81,900 కోట్లు ఖర్చుకానుంది. ఈ అనుసంధానం ద్వారా రోజుకు 2 టీఎంసీ డిశ్చార్జ్ అవుతుంది. 368.60కి.మీ ఓపెన్ కెనాల్‌ద్వారా నీరు తరలిస్తారు. మెయిన్ టన్నెల్ 20.50కి.మీ ఉండగా, సిద్ధాపురం ట్విన్ టన్నెల్స్ 6.60కి.మీ.,పైపులైను 17కి.మీ. వరకు నిర్మిస్తారు. ఇందుకోసం మొత్తం 9 లిఫ్టులు వినియోగిస్తారు. 3,377 మెగావాట్ల విద్యుత్ అవసరం అవుతుంది. ఈప్రాజెక్టు కార్యరూపం దాల్చేందుకు 15,300 ఎకరాల అటవీ భూమితో కలిపి మొత్తం 54 వేల ఎకరాలు సేకరించాల్సి ఉంటుంది. అలాగే బొల్లాపల్లి రిజర్వాయర్ కోసం 5 గ్రామాల్లో 18నివాస ప్రాంతాల వారికి పునరావాసం కల్పించాల్సి ఉంది. ఈ అనుసంధాన ప్రక్రియను ప్రభుత్వం మొత్తం 3సెగ్మెంట్లుగా చేపట్టనుంది.

### సెగ్మెంట్ 1:

పోలవరం నుంచి ప్రకాశం బ్యారేజ్ దిగువనున్న పవిత్ర సంగమం వరకు తాడిపూడి వరద కాలువ ద్వారా 175కి.మీ వరకు 18,000క్యూసెక్కుల డిశ్చార్జ్‌తో నీటినితరలిస్తారు. దీనికి 1,401ఎకరాల భూమి అవసరం అవుతుంది. ఇందుకోసం రూ.13,800కోట్లు ఖర్చు కానుంది.

### సెగ్మెంట్ 2:

వైకుంఠపురం నుంచి బొల్లాపల్లి రిజర్వాయర్ వరకు 23,000 క్యూసెక్కుల డిశ్చార్జ్‌తో నీటిని తీసుకువెళ్తారు. ఇందుకు ఓపెన్‌కెనాల్ 83.40కి.మీ.,12.05 కి.మీ. పైపులైన్, 6లిఫ్టులు నిర్మిస్తారు. 2,493 మెగావాట్ల విద్యుత్ వినియోగిస్తారు. 230మెగావాట్ల విద్యుదుత్పత్తి సాధ్యమవుతుంది. ఈ సెగ్మెంట్‌లోని బొల్లాపల్లి రిజర్వాయర్‌కు 152టీఎంసీ లైవ్ స్టోరేజ్ సామర్థ్యం ఉంటుంది. ఇందుకు రూ.35,750కోట్ల ఖర్చవుతుంది.

### సెగ్మెంట్ 3:

బొల్లాపల్లి రిజర్వాయర్ నుంచి బనకచర్ల రెగ్యులేటర్‌కు 23,000క్యూసెక్కుల డిశ్చార్జ్‌తో నీటిని తరలిస్తారు. ఇందుకు ఓపెన్ కెనాల్ 109.80కి.మీ., పైపులైన్ 5.7కి.మీ., మెయిన్ టన్నెల్, సిద్ధాపురం ట్విన్ టన్నెల్స్ నిర్మిస్తారు. వ్యయం రూ.32,350 కోట్లు అవుతుంది.

### 12.4 లక్షల హెక్టార్లకు సాగునీరు:

పోలవరం- బనకచర్ల అనుసంధానం పూర్తయితే రాష్ట్రానికి ఎన్నో లాభాలు కలుగనున్నాయి. మొత్తం 12.4 లక్షల హెక్టార్లకు సాగునీరు అందుతుంది. కాలువ ప్రవహించే సుమారు 400 కి.మీ. పొడవునా ఉన్న గ్రామాలకు తాగునీటి సమస్య తీరడంతో పాటు భూగర్భ జలాలు పెరుగుతాయి.

అలాగే 430 మెగా వాట్ల విద్యుదుత్పత్తి అవుతుంది. బొల్లాపల్లి రిజర్వాయ ర్‌లో మత్స్య సంపద... ఇలా వివిధ మార్గాల్లో ఏడాదికి రూ.12,294 కోట్ల సంపద సృష్టి జరుగుతుందని అధికారులు అంచనా వేశారు.

## గిరిజన రైతు కృషే

# అరకు కాఫీ ఘుమఘుమ!

అమరావతి(చైతన్యరథం): పార్లమెంట్‌లోని సంగం క్యాంటీన్‌లో అరకు కాఫీ స్టాల్స్‌ని ప్రారంభించడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు సంతోషం వ్యక్తం చేశారు. ఈమేరకు ఎక్స్‌లో పోస్టు పెడుతూ.. 'పార్లమెంట్‌లో కాఫీ ప్రియులకు శుభవార్త! మీరు ఇప్పుడు ఆవరణలోనే తాజాగా తయారు చేసిన అరకు కాఫీని ఆస్వాదించవచ్చు. 'మన్ కీ బాత్'లో అరకు కాఫీని ప్రోత్సహించినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీజీకి, మరియు స్టాల్‌ను ఏర్పాటు చేయడానికి అనుమతినిచ్చినందుకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాజీకి నా హృదయపూర్వక ధన్యవాదాలు. ఈ మైలురాయిని నిజం చేసిన ప్రతిఒక్కరికీ నాహృదయపూర్వక కృతజ్ఞతలు. ఇది మనందరికీ, ముఖ్యంగా మన గిరిజన రైతులకు గర్వకారణం. వారి అంకి తభావం మరియు కృషి అరకుకాఫీని జాతీయ స్థాయిలో అత్యున్నతస్థాయికి తీసుకువచ్చాయి. మనం ప్రతి కప్పునూ ఆస్వాదిస్తున్నప్పుడు, వారి స్ఫూర్తిదాయకమైన ప్రయాణాన్ని కూడా గుర్తుంచుకుందాం'అని పేర్కొన్నారు.

## పార్లమెంట్‌లో అరకు కాఫీ స్టాళ్లు..

# రాష్ట్రానికి గర్వకారణం

- సహకరించిన లోక్‌సభ స్పీకర్, కేంద్ర మంత్రులకు కృతజ్ఞతలు
- సీఎం చంద్రబాబు దార్శనికత సాటిలేనిది
- ఎక్స్‌లో మంత్రి లోకేష్ స్పందన

అమరావతి (చైతన్యరథం): అరకు కాఫీ ఘుమఘుమలు పార్లమెంటు వరకు విస్తరించటం పట్ల విద్య. ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ సంతోషం వ్యక్తం చేశారు. పార్లమెంట్‌లో సోమవారం అరకు కాఫీ స్టాళ్లు ఏర్పాటు చేయటంపై మంత్రి లోకేష్ ఎక్స్ వేదికగా స్పందించారు. అరకు కాఫీ పార్లమెంటులో స్థానం సంపాదించుకోవడం చాలా ఆనందంగా ఉంది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన జీఐ ట్యాగ్ గ్రహీత అరకు సేంద్రియ కాఫీ 1.5లక్షల మంది గిరిజన రైతుల అంకితభావాన్ని, వారి గొప్ప వారసత్వాన్ని తెలియచెబుతోంది. ప్రపంచవ్యాప్తంగా అరకు కాఫీని ప్రోత్సహించడం, జీఐ ట్యాగ్‌ను పొందడం, గిరిజన రైతులకు మద్దతు ఇవ్వడం, ప్రపంచ వేదికలపై అరకు కాఫీని ప్రదర్శించడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చూపించిన దార్శనిక నాయకత్వానికి హృదయపూర్వక ధన్యవాదాలు. పార్లమెంట్‌లో అరకు కాఫీ స్టాళ్ల ఏర్పాటుకు సహకరించిన లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, కేంద్రమంత్రులు పీయూష్ గోయల్, జూలారాం, కిరణ్ రిజిజుకు ధన్యవాదాలు. ఇందుకోసం నిరంతరం ప్రయత్నించిన రాష్ట్రానికి చెందిన కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడికి ప్రత్యేక ధన్యవాదాలు. అరకు కాఫీ పట్ల మీరు చూపించచిన మద్దతు గిరిజన సమూహాల అభ్యున్నతికి, మన సేంద్రియ వారసత్వాన్ని ప్రపంచవ్యాప్తంగా చాటి చెప్పేందుకు ఎంతగానో దోహదపడుతుంది. ఇది ఆంధ్రప్రదేశ్‌కు, భారతదేశానికి గర్వించదగ్గ సందర్భమని మంత్రి లోకేష్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

# పార్లమెంట్‌లో అరకు కాఫీ స్టాళ్లు

## - ప్రారంభించిన కేంద్ర మంత్రులు





న్యూఢిల్లీ: అరకు కాఫీకి విస్తృత ప్రచారం కల్పించేందుకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అవకాశం కల్పించారు. ఈ నేపథ్యంలో పార్లమెంట్‌లో సోమవారం ఉదయం అరకు కాఫీ స్టాల్స్ ఏర్పాటు అయ్యాయి. సభాపతి ఆదేశంతో రెండు స్టాల్స్ ఏర్పాటుకు లోకసభ భవనాల డైరెక్టర్ కుల్‌మోహన్ సింగ్ అరోరా ఉత్తర్వులు ఇచ్చారు. దీంతో సంగం 1, 2 కోర్టియార్డ్ వద్ద స్టాల్స్ ఏర్పాటు చేశారు. సోమవారం నుంచి ఈనెల 28 వరకు స్టాల్స్ ఏర్పాటుకు అవకాశం కల్పించిం ది. ఎంపీలు అల్పాహారం తీసుకునే క్యాంటీన్లలో ఏపీ గిరిజన కోఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో రెండు స్టాళ్లు ఏర్పాటు చేశారు. లోక్‌సభ క్యాంటీన్‌లో పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ అరకు స్టాల్ ప్రారంభించారు. రాజ్యసభ క్యాంటీన్‌లో వాణిజ్య వ్యవహారాలశాఖ మంత్రి పీయూష్ గోయల్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి జోయల్ ఓరం, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, టీడీపీ, బీజేపీ ఎంపీలు హాజరయ్యారు.

### ఆనందంగా ఉంది: ఎంపీ అప్పలనాయుడు

పార్లమెంట్‌లో అరకు కాఫీ స్టాల్స్ సోమవారం ఏర్పాటు అయ్యాయని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. తూర్పు కనుమల నుండి భారత దేశ పార్లమెంట్ వరకు అరకు వ్యాలీ కాఫీ ప్రస్థానం దేశంలో ప్రతి ఒక్కరికీ తెలుస్తున్నందుకు చాలా ఆనందంగా ఉందన్నారు. ఏపీ రాష్ట్ర గిరిజనుల కష్టాన్ని ప్రపంచం గుర్తించబోతుందని, వారి స్వహస్తాలతో పండించిన కాఫీ ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యానికి నిలయమైన భారత పార్లమెంట్‌లో ఎంపీలు అందరినీ అమోఘమైన రుచితో మైమరపించబోతుందన్నారు. ఈ స్టాల్స్‌ను కేంద్ర మంత్రులు.. ప్రారంభం చేయడం సంతోషంగా సంతోషంగా ఉందని కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన శాఖ మంత్రి సంధ్యా రాణి, కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు,కమ్యునికేషన్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని, ఏపీ కూటమి ఎంపీలు తదితరులు పాల్గొన్నారు.




### స్పీకర్‌కు కృతజ్ఞతలు

పార్లమెంట్‌లో అరకు కాఫీ స్టాళ్ళ ప్రారంభోత్సవం సందర్భంగా లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కలిసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, ఎంపీలు భరత్, అప్పలనాయుడు, జీసీసీ చైర్మన్ శ్రావణ్ కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఏపీ గిరిజన ఉత్పత్తులు, అరకు కాఫీని స్పీకర్‌కు అందజేశారు.

# ఉత్తరాంధ్రకు ఇంటర్నేషనల్ యూనివర్సిటీ!

- జార్జియా నేషనల్ యూనివర్సిటీతో ఒప్పందం
- రూ.1,300 కోట్లు పెట్టుబడి పెట్టనున్న జీఎన్‌యూ
- మంత్రి నారా లోకేష్ సమక్షంలో ఎంఓయూ
- రాష్ట్ర విద్యార్థులకు అందుబాటులో ప్రపంచస్థాయి ఉన్నత విద్య



అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో విద్యార్థులకు నాణ్యతతో కూడిన ఉన్నత విద్యను అందించే లక్ష్యం తో ఉత్తరాంధ్రలో ప్రతిష్ఠాత్మక ఇంటర్నేషనల్ యూని వర్సిటీ ఏర్పాటుకు ఏపీ ప్రభుత్వంతో జార్జియా నేషనల్ యూనివర్సిటీ(జీఎన్‌యూ) ఒప్పందం కుదు ర్చుకుంది. రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ సమక్షంలో జార్జియన్ నేషనల్ యూనివర్సిటీ రాజుఖ (+చీఖ)తో అవగాహన ఒప్పం దం కుదిరింది. ఉండవల్లి నివాసంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో జీఎన్‌యూ, ఏపీ ప్రభుత్వ ప్రతినిధులు ఎంఓయూపై సంతకాలు చేశారు. ఒప్పందం ప్రకారం ఉత్తరాంధ్రలో ఇంటర్నేషనల్ యూనివర్సిటీ స్థాపించడానికి జీఎన్‌యూ సుమారు రూ.1,300 కోట్లు పెట్టుబడి పెడుతుంది. ఈ ఒప్పందంతో గ్లోబల్ ఎడ్యుకేషన్ ఎకో సిస్టమ్ అభివృద్ధి చెందడంతోపాటు 500మందికి ఉపాధి లభిస్తుంది. అంతర్జాతీయ విశ్వవిద్యాలయ స్థాపనకు మద్దతుగా పెట్టుబడి, సాంకేతికత, ప్రణాళిక రూప కల్పన, ఎక్విప్‌మెంట్‌ల్లో జీఎన్‌యూకు ఉన్న వనరు లను ఉపయోగించుకోవడం ఈ ఎంఓయూ లక్ష్యం.

ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... జార్జియన్ నేషనల్ యూనివర్సిటీతో ఈ ఒప్పందం మన విద్యార్థులకు ప్రపంచస్థాయి విద్యను అందించ డంతోపాటు ఏపీ విద్యారంగాన్ని ప్రపంచపటంలో నిలిపేందుకు దోహదపడుతుందన్నారు. ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో విద్యా ప్రమాణా లను పెంచడమే కాకుండా ప్రపంచ ఉద్యోగ మార్కెట్ లో విజయం సాధించడానికి అవసరమైన నైపుణ్యాలు అందుతాయని తెలిపారు. ఏపీ విద్యార్థులను గ్లోబల్ లీడర్లుగా తీర్చిదిద్దాలన్న మా ప్రభుత్వ చిత్తశుద్ధి, నిబద్ధతకు ఈ ఒప్పందం నిదర్శనమని చెప్పారు.

రాష్ట్రంలో ఉన్నతవిద్య ప్రమాణాలను మెరుగు పర్చడం, గ్లోబల్ ఎక్స్‌పోజర్, పాఠ్యాంశాలను మెరుగు పర్చడం, అధునాతన విద్య, సాంకేతికలను అందించ డం, పరిశోధన, నవీన ఆవిష్కరణలను ప్రోత్సహించ డం ఒప్పందం ప్రధాన లక్ష్యం. అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన ప్రోగ్రామ్‌ల్లో ముఖ్యంగా టెక్నాలజీ, బిజినెస్, ఆరోగ్య హెల్త్ కేర్‌ల్లో జీఎన్‌యూ నైపుణ్యాల ను అందిస్తుంది. అధ్యాపకులు, విద్యార్థుల నడుమ నాలెడ్జి షేరింగ్‌ను సులభతరం చేయడం, ఆంధ్ర ప్రదేశ్ విద్యార్థులకు ప్రపంచ విద్యా వ్యవస్థల అభ్యసన విధానాలపై అవగాహన కల్పిస్తుంది. అంతర్జాతీయం గా ప్రస్తుత ట్రెండ్‌కు అనుగుణంగా పాఠ్యాంశాలను ఆధునీకరించడం, మెరుగుపర్చడంతోపాటు ఏఐ వంటి రంగాల్లో ఉత్తమ పద్ధతులపై విద్యార్థులకు జీఎన్‌యూ శిక్షణ ఇస్తుంది. ఉమ్మడి పరిశోధన కార్యక్రమాలు, ఆవిష్కరణల ఆధారిత ప్రాజెక్టులకు అవకాశాలు కల్పిస్తుంది. రాష్ట్రంలో సాంకేతిక విద్య, పారిశ్రామిక పురోగతికి దోహదం పడుతుంది. ఎంఐటీ వంటి ప్రపంచస్థాయి సంస్థలతో జీఎన్‌యూకు ఉన్న సంబంధాలతో మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయి. పరిశ్రమ డిమాండ్లకు అనుగుణంగా నైపుణ్యాలు, అర్హతలతో కూడిన విద్యార్థులను సన్నద్ధం చేసి... జాతీయ, అంతర్జాతీయస్థాయి ఉపాధి అవకాశాలకు ఊతమిస్తుంది.



2002లో స్థాపితమైన జార్జియన్ నేషనల్ యూని వర్సిటీ SEU జార్జియాలో అతిపెద్ద యూనివర్సిటీగా అవతరించడమేగాక, అంతర్జాతీయంగా పేరెన్నికగన్న డైనమిక్ ప్రైవేట్ విశ్వవిద్యాలయాల్లో ఒకటిగా ఉంది. 1,100 మందికిపైగా నైపుణ్యం కలిగిన అధ్యాపక సిబ్బందిని ఉన్న ఈ యూనివర్సిటీలో విద్యనభ్యసిం చిన సుమారు 52,500మంది పూర్వవిద్యార్థులు ప్రపంచవ్యాప్తంగా వివిధరంగాల్లో స్థిరపడ్డారు. జీఎన్ యూ పపంచవ్యాప్తంగా పేరొందిన 4 ఇంటర్నేషనల్ అక్రిడిటేటెడ్ ఫ్యాకల్టీ ప్రోగ్రామ్స్‌తోపాటు పలు అగ్రశ్రేణి గ్లోబల్ కంపెనీలతో కొలాబరేషన్ కలిగి ఉంది. ఫండింగ్‌తో కూడిన ఇంటర్నేషనల్ ఎక్స్ఛేంజి ప్రోగ్రామ్‌లను కూడా నిర్వహిస్తుంది.

ఈ కార్యక్రమంలో జీఎన్‌యూ వ్యవస్థాపకుడు, రెక్టార్ డాక్టర్ గియా కావ్టెలిష్విలి, విద్యావ్యవహారాల వైస్ రెక్టార్ ప్రొఫెసర్ జార్జ్ గవ్రాడ్జే, అడ్మినిస్ట్రేటివ్ ఎఫైర్స్ వైస్ రెక్టార్ డాక్టర్ గొడెర్డ్జి బుచాష్విలి, ఫైనాన్స్ అండ్ రిసోర్సెస్ వైస్ రెక్టార్ లెవాన్ కలందరిష్విలి, ఇండియా ఆపరేషన్స్ అండ్ అడ్మిషన్స్ డైరెక్టర్ జొన్నలగడ్డ వివేకానంద మూర్తి, ఆత్మీయ ఎడ్యుకేషన్ ఫౌండర్, చైర్మన్ హష్మిక్ వాఘేలా, సీఈఓ చిరాగ్ వాఘేలా, ఎకనమిక్ డెవలప్‌మెంట్ బోర్డు సీఈవో సాయికాంత్ వర్మ, ఏపీ కాలేజ్ ఎడ్యుకేషన్ కమిషనర్ భరత్ గుప్త, విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్, తదితరులు పాల్గొన్నారు.

# 2029 నాటికి 20లక్షల ఉద్యోగాలు

- మంత్రి నారా లోకేష్ పునరుద్ఘాటన
- ఇన్వెస్ట్‌మెంట్ ట్రాకర్ పోర్టల్‌ను పకడ్బందీగా తీర్చిదిద్దాలి
- ఉద్యోగాల కల్పనకు ప్రతి పాలసీలో సంస్కరణలు
- ఎంఎస్ఎంఈలకు పెద్దఎత్తున ప్రోత్సాహం
- మంత్రుల ఉపసంఘం సమావేశంలో మంత్రి లోకేష్ దిశానిర్దేశం



అమరావతి(చైతన్యరథం): రాష్ట్రంలో 2029నాటికి 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పునరుద్ఘాటించారు. 20 లక్షల ఉద్యోగాల కల్పనపై ఏర్పాటుచేసిన మంత్రుల ఉప సంఘం రెండో సమావేశం సోమవారం ఉండవల్లి నివాసంలో జరిగింది. ఇప్పటివరకు వచ్చిన పెట్టుబడు లు, ఉద్యోగాల కల్పనతో పాటు వివిధ ఎంవోయూల స్థితిగతులపై అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటే షన్ ద్వారా వివరించారు. ఇప్పటివరకు కుదుర్చుకున్న ఒప్పందాల ద్వారా రూ.8,73,220కోట్ల పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందని, తద్వారా 5,27,824 మంది కి ఉద్యోగాలు వచ్చే అవకాశాలు ఉన్నాయని వివ రించారు. మంత్రుల ఉపసంఘం ఛైర్మన్ హోదాలో అధికారులకు మంత్రి లోకేష్ దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఇన్వెస్ట్‌మెంట్ ట్రాకర్ పోర్టల్‌ను సమర్థవంతంగా తీర్చిదిద్దాలని ఆదే శించారు. భూకేటాయింపులు, అనుమతులకు సంబం ధించిన అన్ని వివరాలు ట్రాకర్‌లో ఉంచాలన్నారు.

**ప్రతిబంధకాలు తొలగించేలా సంస్కరణలు**

పెట్టుబడులు పెట్టాలనుకునేవారికి ప్రతిబంధకంగా మారిన విధానాల్ని సంస్కరిస్తామని చెప్పారు. ఉద్యోగాల కల్పనకు ప్రతి పాలసీలో సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. అంతర్జాతీయంగానూ, దేశంలోనూ ఉన్న అన్ని పెద్ద కంపెనీలను రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ఆహ్వానించాలన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే పెట్టుబడులు పెట్టిన కంపెనీలు మరింతగా విస్తరించేలా వారిలో నమ్మకం కల్పించాలని, వారికి ఇవ్వాల్సిన రాయితీలు, ప్రోత్సాహకాలు ఇవ్వాలన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పలువురు పారి శ్రామికవేత్తలు ఆసక్తి చూపిస్తున్నారు. వారికి అవసర మైన భూకేటాయింపులతో పాటు అనుమతులు, రాయితీలు త్వరితగతిన మంజూరు చేయాలి. ఎంఎస్ఎంఈ రంగంలో భారీగా ఉపాధి, ఉద్యోగాల కల్పన జరుగుతుంది. ఎంఎస్ఎంఈలను పెద్దఎత్తున ప్రోత్సహిస్తాం. ఐటీఐ, పాలిటెక్నిక్ల ద్వారా పరిశ్రమ లకు అవసరమైన మానవ వనరులను అందించాలి. పోర్టుల అభివృద్ధిపైనా దృష్టి కేంద్రీకరించాలి. టూరిజం రంగంలో పెట్టుబడుల ఆకర్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి లోకేష్ సూచించారు. మైనింగ్ రంగంలోనూ విస్తృత అవకాశాలు ఉన్నాయని, ఈ రంగంపైనా దృష్టిసారించాలని దిశానిర్దేశం చేశారు.

ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పీ నారాయణ, ఎంఎస్ఎంఈ, సెర్ప్ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్, గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ఉన్నతాధికారులు అజయ్ జైన్, ఎన్.యువరాజ్, కాటమనేని భాస్కర్, ప్రవీణ్ కుమార్, సాయికాంత్ వర్మ, ఎమ్.అభిషిక్త్ కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

# హోంమంత్రి అనితకు శుభాకాంక్షల వెల్లువ

- పాయకరావుపేట, అనకాపల్లిలో జన్మదిన వేడుకలు
- కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన నాయకులు
- యువత ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు
- మెగా రక్తదాన శిబిరంలో 300 మంది రక్తదానం
- పేదలకు దుస్తులు, క్రికెట్ విజేతలకు బహుమతులు
- నక్కపల్లి క్యాంపు కార్యాలయంలో పండగ వాతావరణం
- ఎస్.రాయవరం రేవుపోలవరం తీరంలో సైకత శిల్పం



నక్కపల్లి/అనకాపల్లి(చైతన్యరథం): హోంమంత్రి వంగలపూడి అనిత జన్మదిన వేడుకలు నక్కపల్లిలోని ఆమె క్యాంప్ కార్యాలయంలో సోమవారం ఘనంగా జరిగాయి. ఎస్.రాయవరం రేవుపోలవరం తీరంలో ఆకర్షణగా తీర్చిదిద్దిన సైకత శిల్పం వద్ద ఆమె జన్మదిన వేడుకలు ప్రారంభమయ్యాయి. నియోజకవర్గంలో సోదరుడు అడివిరాజు నేతృత్వంలో మత్స్యకార కుటుంబ సభ్యుల మధ్య హోంమంత్రి అనిత కేక్ కట్ చేశారు. ఉదయాన్నే ఇంట్లో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆమె వేదపండితుల ఆశీర్వచనం పొందారు. జిల్లా వ్యాప్తంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కేక్ కట్‌చేసి వేడుకలు నిర్వహించారు. కూటమి నాయకులు, నియోజకవర్గ, జిల్లాస్థాయి అధికారులు, కార్యకర్తలు, ప్రజలు స్వచ్ఛందంగా జన్మదిన వేడుకల్లో పాల్గొని మంత్రికి పుట్టినరోజు శుభా కాంక్షలు తెలిపారు.

### నక్కపల్లి క్యాంప్ కార్యాలయంలో సందండి

టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలిరావడంతో నక్కపల్లి మంత్రి క్యాంప్ కార్యాలయం వద్ద పండుగ వాతావరణం నెలకొంది. రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ సహా కేబినెట్ సహచర మంత్రులు శుభాకాంక్షలు తెలిపారు. విజయనగరం ఎమ్మెల్యే అతిథి గజపతి స్వయంగాకలిసి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. విజయ నగరం జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ నేతృత్వంలోని పోలీసుల బృందం స్వయంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు,మాజీ ఎమ్మెల్యేలు, టీడీపీ నాయకులు,ఎమ్మెల్సీలు శుభాకాంక్షలు తెలిపారు.

### సేవా కార్యక్రమాలు

మరోవైపు పాయకరావుపేట నియోజకవర్గంలోని యువకులు పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఐటీడీపీ, టీఎన్ఎస్ఎఫ్, తెలుగు యువత ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. అపోలో ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించగా 300 మంది రక్తదానం చేశారు. పేదలకు మంత్రి అనిత దుస్తులు పంపిణీ చేశారు. ఇటీవల వారం రోజుల పాటు నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో గెలుపొందిన విజేతలకు అనిత నగదు బహుమతులు అందజేసి క్రీడాకారులను అభినందించారు.

---

అకాల వర్షాలతో..

## నష్టపోయిన ప్రతి రైతునూ ఆదుకుంటాం

- మంత్రి అచ్చెన్నాయుడు భరోసా
- అరటి రైతులకు హెక్టారుకు రూ.35 వేల ఇన్‌పుట్ సబ్సిడీ
- తిరిగి మొక్కలు వేసుకునేందుకు అదనంగా మరో రూ.75 వేలు
- జగన్‌కు అరటి రైతులు ఇప్పుడు గుర్తొచ్చారా
- గత ఐదేళ్లలో పట్టించుకున్న దాఖలాలు లేవు



అమరావతి (చైతన్యరథం): అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను అన్నివిధాలా ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వ్యవసాయ శాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు భరోసా ఇచ్చారు. అరటి, మొక్కజొన్న, బొప్పాయి, వరి పంటలకు కొన్నిచోట్ల అకాల వర్షాలతో పంట నష్టం జరిగింది. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఒక్క ఏడాది కూడా ఆదుకోలేదు. నాటి వైసీపీ ప్రభుత్వ హయాంలో రైతులు అకాల వర్షాలతో నష్టపోయి రోడ్డున పడ్డా పరిహారం అందించకుండా జగన్ రెడ్డి విలాసాల కోసం వేలకోట్లు వృథా చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పరిహారం అందించి రైతులకు అండగా నిలబడేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ఇప్పటికే అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి అకాల వర్షాలతో జరిగిన పంట నష్టం వివరాలను సేకరిస్తున్నారు.

అరటి రైతులకు హెక్టారుకు రూ.35,000 మేర ఇన్‌పుట్ సబ్సిడీ అందజేయడంతోపాటు మొక్కలు తిరిగి వేసుకునేందుకు అదనంగా హెక్టారుకు రూ.75 వేలు అందజేస్తాం. మొత్తం రూ.1,10,000 వరకు సాయం అందుతుంది. ఇన్సూరెన్స్ ఉంటే వారికి అదనంగా చెల్లింపులు ఉంటాయి. అనంతపురం, సత్యసాయి, కడప, ప్రకాశం జిల్లాల్లో ఇప్పటికే అధికారులు పర్యటించి వివరాలు సేకరిస్తున్నారు. మిగిలిన ప్రాంతాల్లో కూడా త్వరలో నష్టం అంచనా ప్రక్రియ మొదలవుతుంది. రైతులు ఎవరూ అధైర్యపడవద్దు, ఆందోళన చెందవద్దు. ప్రభుత్వం ప్రతి ఒక్క రైతుకూ అండగా నిలబడుతుందని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

### అరటి రైతులు ఇప్పుడు గుర్తొచ్చారా జగన్?

పులివెందులలో అరటి రైతులు ఉన్నారని జగన్ రెడ్డికి ఇప్పుడు గుర్తొచ్చారా? గిట్టుబాటు ధర లేక గత ఐదేళ్లలో అరటి రైతులు నష్టపోయినా జగన్ రెడ్డి పట్టించుకున్న పాపాన పోలేదు. అరటి రైతులకు గిట్టుబాటు ధర లభించక పండించిన పంటను పులివెందులలో పశువుల దాణా కోసం ఉపయోగించిన ఘటనలు జగన్ మరిచిపోయినా రైతులు మరిచిపోలేదు. జగన్ హయాంలో అరటి రైతులను ఆదుకోవడానికి ఒక్క రూపాయి కూడా సాయం చేయలేదు. ప్రభుత్వ కార్యాలయాలకు రూ.3 వేల కోట్లతో వైసీపీ రంగులు వేయడంపై చూపించిన శ్రద్ధలో ఒక వంతు కూడా నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో చూపలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే హెక్టారుకు ఇన్ పుట్ సబ్సిడీని రూ.25 వేల నుంచి రూ.35 వేలకు అందించిన విషయం జగన్ రెడ్డికి కనిపించలేదా అని మంత్రి అచ్చెన్నాయుడు ప్రశ్నించారు.

## ఉద్యోగులకు అండగా కూటమి ప్రభుత్వం

- అక్కసుతో వైసీపీ దుష్ప్రచారం
- చరిత్రలో లేని విధంగా వైసీపీ హయాంలో ఉద్యోగులకు వేధింపులు
- నాటి బకాయిలు ఇప్పుడు చెల్లిస్తున్నాం
- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు స్పష్టీకరణ

అమరావతి (చైతన్యరథం): రాష్ట్రం అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటు న్నప్పటికీ ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమా న్ని దృష్టిలో పెట్టుకుని కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై వైసీపీ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మండి పడ్డారు. వైసీపీ హయాంలో ఆ పార్టీ నేతల అవినీతి, అక్రమాలకు ప్రభుత్వ ఉద్యోగులు సహకరించలేదన్న ఉద్దేశ్యంతో న్యాయబద్ధంగా చెల్లించాల్సిన నిధులు కూడా ఇవ్వకుండా వేధింపులకు గురిచేశారని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వైసీపీ ప్రభుత్వం పెట్టిన బకాయిల్లో ఈ ఏడాది జనవరిలో రూ.1000కోట్లకు పైగా చెల్లించింది. ప్రస్తుతం రూ.6,200 కోట్లు వివిధ బకాయిల కింద ఉద్యోగులకు చెల్లించి అండగా నిలబడుతున్నా రన్న అక్కసుతో వైసీపీ నేతలు తప్పుడు ప్రచారానికి పాల్పడుతున్నారు. రూ.6,200 కోట్లలో గత ప్రభుత్వ హయాంలో సీపీఎస్ కింద పెట్టిన 6 నెలల బకాయిలు రూ.2,800కోట్లు, జీపీఎఫ్ బకాయిలు రూ.2,500 కోట్లు, ఏపీజీఎల్ఐ బకాయిలు రూ.900 కోట్లు కూటమి ప్రభుత్వం చెల్లిస్తుంది. ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఉద్యోగులను వైసీపీ ప్రభుత్వం వేధింపులకు గురిచేసి అవమానించింది. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఒక్క ఏడాదైనా ఒకటో తారీఖున వేతనాలువచ్చాయా? ఉద్యోగులకు రావలసిన సరెండర్ లీవ్స్,మెడికల్ లీవ్స్,జీపీఎఫ్ వంటివాటిని సైతంబకాయి పెట్టి వైసీపీ ప్రభుత్వం తీవ్ర ఇబ్బందులకు గురిచేసిందని పల్లా విమర్శించారు.



## వైసీపీ హయాంలో... ఏపీలో అతిభారీ మద్యం స్కాం

- 'ఢిల్లీ'తో పోలిస్తే ఎన్నోరెట్లు పెద్దది
- జగన్‌రెడ్డి బంధువు సునీల్‌రెడ్డి ద్వారా రూ.2 వేల కోట్లు దుబాయ్ తరలించారు
- ఈడీ విచారణ జరపాలి
- లోక్‌సభలో టీడీపీ ఎంపీ లావు సంచలన ఆరోపణ

న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం కుంభకోణం కన్నా జగన్ రెడ్డి హయాంలో ఏపీలో జరిగిన మద్యం కుంభకోణం ఎన్నో రెట్లు పెద్దదని టీడీపీ నేత, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు లోక్‌సభలో సోమవారం సంచలన ఆరోపణ చేశారు. మద్యం కుంభకోణంలో జగన్ రెడ్డి వేలకోట్లు సంపాదించారని ఆరోపించారు. నాసిరకం బ్రాండ్లతో ప్రజల ఆరోగ్యాన్ని పాడు చేశారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. లిక్కర్ ఉత్పత్తికి ముందే స్కాం చేసిన ఘనుడు జగన్. బంధువు సునీల్ రెడ్డి ద్వారా దుబాయ్‌కి జగన్ రెడ్డి రూ. 2వేల కోట్ల మద్యం డబ్బు తరలించారని ఆరోపించారు. ఇప్పటికే వీటన్నిటిపై రాష్ట్ర ప్రభుత్వం సీఐడీ ఎంక్వయిరీకి ఆదేశించింది. విదేశీ లావాదేవీలు కూడా ఉన్నాయి కాబట్టి, ఈడీ కూడా రంగంలోకి దిగి విచారణ చేయాలని కేంద్రాన్ని లావు కోరారు. రూ. 2,000 కోట్లు ఒక ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీ పేరుతో సునీల్ రెడ్డి ద్వారా దుబాయ్‌కు జగన్ మళ్లించారని లావు ఆరోపించారు. వైసీపీ హయాంలో ఆదాన్, గ్రేసన్స్, లీలా, జేఆర్ అసోసియేట్స్, పీవీ స్పిరిట్స్ లాంటి 26 కొత్త కంపెనీలు భారీగా మద్యం సరఫరా ఆర్డర్లు పొంది అదే స్థాయిలో లాభాలు పొందాయని లావు తెలిపారు.

### నాసిరకం బ్రాండ్లతో స్కాం..

రూ.20,356 కోట్ల విలువైన మద్యం అమ్మకాలను గోప్యంగా నిర్వహించారని ఎంపీ లావు తెలిపారు. జగన్ తన ఆధీనంలోని సంస్థల ద్వారా మద్యం వ్యాపారాన్ని పూర్తిగా నియంత్రించి ప్రజలను మోసం చేశారన్నారు. ప్రముఖ మద్యం బ్రాండ్లను పూర్తిగా తొలగించి, నాసిరకంగా ఉన్న కొత్త బ్రాండ్లను ప్రవేశపెట్టారని చెప్పారు. నంద్యాలలోని ఎస్‌పీవై ఆగ్రో ఇండస్ట్రీస్ లాంటి ప్రముఖ డిస్టిలరీలను బలవంతంగా స్వాధీనం చేసుకుని, కొత్త బినామీ డిస్టిలరీలను ఏర్పాటు చేశారన్నారు. తక్కువ నాణ్యత కలిగిన మద్యాన్ని ఉత్పత్తి చేయించి, వేల కోట్ల రూపాయలు అధికార పార్టీ అనుబంధ వ్యాపారస్తుల చేతికి వెళ్లేలా చేశారని ఎంపీ లావు ఆరోపించారు.



చైతన్యరథం

# వినియోగదారుల హక్కులను పరిరక్షిస్తాం




- పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్
- విజయవాడలో అదనపు ఫోరం బెంచ్ ప్రారంభం

విజయవాడ(చైతన్యరథం): వినియోగదారుల హక్కులను కాపాడేందుకు కృషి చేస్తామని పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. విజయవాడ సిటీ సివిల్ కోర్టు సెంటర్‌లో వినియోగదారుల కమిషన్ రెండో అదనపు బెంచ్‌ను సోమవారం బెజవాడ బార్ అసోసియేషన్ భవనం రెండోఅంతస్థులో పౌరసరఫరాల కమిషనర్ సౌరవ్‌గౌర్, ఫోరం చైర్మన్, బెజవాడ బార్ అసోషియేషన్ సభ్యులతో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాణ్యతలేని సరుకులు,కాలం చెల్లిన వస్తువులు అమ్ముతూ వినియోగదారులను మోసం చేసే వారిపై చట్టపరంగా తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విజయవాడలో వినియోగదారుల హక్కులకు వేదికగా ఈ అదనపు బెంచ్ పని చేస్తుం దన్నారు. అంతేకాకుండా వినియోగదారులకు తగిన సమాచారం అందించడంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా వినియోగదారుల హక్కులపై అవగాహన కల్పిస్తామన్నారు. దేశంలో రాష్ట్రం వినియోగదారుల ఫోరం కేసుల పరిష్కారం, వినియోగదారులకు పరిహారం అందించడంలో చాలా ముందుందన్నారు. రాష్ట్రంలో 1,33,736 కేసులు వినియోగదారుల ఫోరంలో నమోదు చేస్తే చాలావరకు వాటిని పరష్కరించడం జరిగిందని వెల్లడించారు. వినియోగదారుల జిల్లా ఫోరంలో రూ.50 లక్షల విలువ వరకు, రాష్ట్ర ఫోరంలో రూ.2 కోట్ల విలువ వరకు కేసులు నమోదు చేయవచ్చన్నారు. దేశంలో మొదటిసారి రాష్ట్రంలో డిజిటల్ క్యాంపెయిన్‌ను స్కూల్స్, కాలేజీల్లో ప్రచారం చేస్తామని తెలిపారు. మచిలీపట్నం వెళ్లాలంటే వినియోగదారులకు గతంలో చాలా ఇబ్బందిగా ఉండేదని, ఇప్పుడు విజయవాడలో వినియోగదారుల హక్కుల కోసం అదనపు బెంచ్‌ను ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్ర మంలో పౌరసరఫరాల శాఖ కమిషనర్ సౌరవ్ గౌర్, విజయవాడ వినియోగదారుల అదనపు బెంచ్ ఫోరం చైర్మన్ సీహెచ్.కిషోర్, సభ్యులు కె.శశికళ, బెజవాడ బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ అరిగల శివ రామప్రసాద్, అధ్యక్షుడు కె.చంద్రమౌళి, ఏపీ బార్ కౌన్సిల్ సభ్యులు సీహెచ్.అజయ్‌కుమార్, బెజవాడ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు సోము కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధులు, దివ్యాంగుల సంక్షేమమే చంద్రబాబు లక్ష్యం

- ఏపీని దేశానికే ఆదర్శంగా నిలపడమే ఆశయం
- ఇతర ప్రాంతాల్లో విద్యార్థులకు నేరుగా పెన్షన్
- అర్హత కలిగిన ఏ ఒక్కరి పెన్షన్‌ను తొలగించం
- కేంద్ర సహకారంతో కొత్తగా 12 వృద్ధాశ్రమాలు
- వయోవృద్ధులకు త్వరలో డిజిటల్ కార్డులు ఇస్తాం
- వారిపై వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు
- మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి వెల్లడి




అమరావతి(చైతన్యరథం): వయోవృద్ధులు, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమంలో రాష్ట్రం దేశానికే ఆదర్శంగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని సాం ఘిక సంక్షేమ, వయోవృద్ధులు, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి పేర్కొన్నారు. సోమవారం వెలగపూడి సచివాలయంలో మంత్రి అధ్యక్షతన సీనియర్ సిటిజన్స్ స్టేట్ కౌన్సిల్ 2వ సమావేశం, స్టేట్ అడ్వైజరీ బోర్డ్ అన్‌డిజేబులిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వయోవృద్ధుల ఆరోగ్య సంరక్షణ, వృద్ధాశ్రమాల ఏర్పాటు, సామాజిక భద్రత పింఛన్లు, గ్రామ వార్డు సచివాలయాల ద్వారా డిజిటల్ కార్డుల పంపిణీ, విభిన్న ప్రతిభావంతులకు వైకల్యం ధృవపత్రాల జారీ, ప్రధాన మంత్రి దివ్యాస కేంద్రాల (పీఎండీకేలు) స్థాపన, ఉపకర ణాల సరఫరా. వివిధ అభివృద్ధి పథకాలు/కార్యక్రమాలలో 5 శాతం రిజర్వేషన్ల అమ లు, వసతిగృహాలు, కళాశాలల్లో విద్య నభ్యసిస్తున్న విభిన్న ప్రతిభా వంతుల విద్యార్థు లకు డీబీటీ మోడ్‌లో పెన్షన్ల పంపిణీ తదితర అంశాలపై సమీక్షించారు వయో వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులకు సంక్షేమంతో పాటు మెరుగైన సౌకర్యాలు కల్పిం చేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ఇంటికి దూరంగా ఉంటూ వివిధ ప్రాంతాల్లో వసతిగృహాలు, కళాశాలల్లో చదువుతున్న ఆ కేటగిరీ విద్యార్థులకు నేరుగా వారి ఖాతాల్లోనే పెన్షన్ జమచేస్తామని చెప్పారు. నిజమైన లబ్ధిదారులకు పెన్షన్ అందించడమే లక్ష్యంగా వెరిఫికేషన్ జరుగుతుందని, అర్హులైన ఏఒక్కరి పెన్షన్‌ను తొలగించేది లేదని స్పష్టం చేశారు. దివ్యాంగులకు 5 శాతం రిజర్వేషన్లు తప్పనిసరిగా అమలయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాష్ట్రంలో 5 ప్రధాన మంత్రి దివ్యాస కేంద్రాల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని, వీటిని విజయవాడ, విశాఖ, ఒంగోలు, తిరుపతి, కర్నూలులో ఏర్పాటు చేయనున్నట్టు మంత్రి తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల్లో దివ్యాంగులకు వీల్ చైర్లు ఏర్పాటు చేయా లని ఇప్పటికే ఆదేశాలిచ్చినట్లు చెప్పారు. ప్రతిఒక్కరికి ఆధార్ కార్డు అందేలా అధికా రులు చర్యలు తీసుకోవాలన్నారు. అంధ విద్యార్థులకు వచ్చే విద్యా సంవత్సరం మొదట్లోనే బ్రెయిలీ లిపి పుస్తకాలు అందిస్తామని తెలిపారు. ఆటిజం విద్యార్థులు, తల్లి దండ్రులకు సైకాలజిస్టుల ద్వారా కౌన్సిలింగ్ ఇప్పిస్తామని తెలిపారు. కేంద్ర సహకారంతో రాష్ట్రంలో కొత్తగా 12 వృద్ధాశ్రమాలు నిర్మిస్తున్నామని, అన్ని జిల్లాల్లోనూ ఏర్పా టు చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. వయోవృద్ధుల హక్కులపై వారికి అవగాహన కల్పించటంతో పాటు చట్టాలను పటిష్టంగా అమలు చేయాలన్నారు. ఒం టరిగా నివాసం ఉంటున్న వయోవృద్ధుల వివరాలు పోలీసు శాఖ సేకరించి గ్రామ సచివాలయాల్లో ప్రదర్శించాలని సూచించారు. వయోవృద్ధులకు డిజిటల్ గుర్తింపు కార్డులు ఇవ్వనున్నట్టు వెల్లడించారు. వారిపై వేధింపులకు పాల్పడే వారిపై కఠిన చర్య లు తప్పవని, వృద్దుల ఆరోగ్య సంరక్షణతో పాటు ఆస్తుల సంకరక్షణకు ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

# రుషికొండ బీచ్‌కు మళ్లీ బ్లూ ఫ్లాగ్ సర్టిఫికేషన్

- జెండా ఎగురవేసిన మంత్రి కందుల దుర్గేష్
- బీచ్‌లో పరిశుభ్రతను కాపాడేలా కార్యక్రమాలు
- అంతర్జాతీయ పర్యాటకుల ఆకర్షణకు చర్యలు
- భూములు ఆక్రమిస్తే సహించేది లేదని హెచ్చరిక



విశాఖపట్నం(చైతన్యరథం): రుషికొండ బీచ్‌లో పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ సోమవారం బ్లూ ఫ్లాగ్ జెండా ఆవిష్కరించారు. ఉదయాన్నే విశాఖ చేరుకున్న ఆయనకు అధికారులు, నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రుషికొండ బీచ్ వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లా డారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా బ్లూఫ్లాగ్ సర్టిఫికేషన్ తాత్కాలికంగా రద్దు అయిందని,తమ దృష్టికి రాగానే వెంటనే దాన్ని పునరుద్ధరించేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. అంత ర్జాతీయ పర్యాటకుల ఆకర్షణకు బ్లూఫ్లాగ్ సర్టిఫికేషన్ తోడ్పడుతుందని, బీచ్ పరిశుభ్రత, అభివృద్ధికి ప్రజలు సహకరించాలని సూచించారు. బీచ్ ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచే లా పర్యాటకులు, ప్రజలకు చెప్పాల్సిన బాధ్యతస్థానిక ప్రజాప్రతినిధులపై ఉందన్నారు. బీచ్‌కు అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించేందుకు ఈ బ్లూఫ్లాగ్ తోడ్పడుతుందన్నారు. బీచ్‌లోని పరిశుభ్రత, ఇతర సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యతపర్యాటకశాఖపై ఉందనిచెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం పర్యాటకశాఖపై ప్రత్యేక శ్రద్ధ వహించిందని తెలుపుతూ విశాఖను అందంగా నిర్మించేందుకు అందరం మరింత కష్టపడదామన్నారు. ఈ క్రమంలో బాంబూ పాసింగ్ పేస్ లాంటివి ఏర్పాటు చేద్దామన్నారు. బీర్, వైన్ తదితర బీచ్ శాక్స్‌ను ప్రవేశపెట్టి అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షిస్తామన్నారు. తద్వారా పర్యాటకాభివృద్ధితోపాటు ఆర్థికంగా కూడా బలోపేతం అయ్యేందుకు అవకాశముం టుంద న్నారు. ఈ అంశాన్ని సీఎం దృష్టిలో ఉంచామన్నారు. త్వరలోనే నిర్ణయం వెలు వడుతుందని భావిస్తున్నామన్నారు.

### స్థానికులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు

రాష్ట్రంలోని 974 కి.మీల సుదీర్ఘ సముద్రతీరంలో ఉన్న ఎన్నో బీచ్‌లలో విశాఖలోని రుషికొండ బీచ్‌కు ఒక ప్రత్యేకత ఉందనితెలిపారు. సహజ సిద్ధ అందాలు, చుట్టూ ఉన్న ప్రకృతి సంపద, భవిష్యత్ తరాల వారికి పర్యావరణ జ్ఞానాన్ని అందించేలా బ్లూఫ్లాగ్ బీచ్ తయారుకావాలని ఆకాంక్షించారు. రుషికొండ సాధారణ బీచ్ కాదని.. కష్టపడి బ్లూఫ్లాగ్ సర్టిఫికెట్ తెచ్చుకున్నామని వివరించారు.బీచ్‌లో సౌందర్యానికి, స్వచ్ఛతకు పెద్దపీట వేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. బీచ్‌లో అంతర్జాతీయ ఫుడ్ స్టాల్స్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. తద్వారా స్థానికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. స్థానికంగా ఉపాధి పొందుతున్న మత్స్యకారుల జీవితాలు ఇబ్బంది పడకుండా చూసే బాధ్యత తీసుకుంటామని తెలిపారు. ఇక్కడ భూములు అన్యాక్రాంతం అయితే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. అనంతరం మంత్రి దుర్గేష్ పలువురికి లైఫ్ జాకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఏపీటీడీసీ చైర్మన్ నూకసాని బాలాజీ, ఏపీటీడీసీ ఎండీ ఆమ్రపాలి కాట, విశాఖ జిల్లా కలెక్టర్ హరేందిర ప్రసాద్, పర్యాటక శాఖ అధికారులు, ఇతర అధి కారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### చందనోత్సవం నాటికి సింహాచలం ఆలయ అభివృద్ధి పనులు

రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన నవ నారసింహ క్షేత్రాల్లో ఒకటైన సింహాచల వరాహ స్వామి ఆధ్యాత్మిక క్షేత్రాన్ని కూటమి ప్రభుత్వం మరింత అభివృద్ధి చేస్తుందని మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. సోమవారం విశాఖ పర్యటనలో భాగంగా ఆయన సింహాచలం క్షేత్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ ప్రసాద్ స్కీం ద్వారా చేపడుతున్న ఆలయ అభివృద్ధి కార్యక్రమాలను స్వయంగా పరిశీలించి ఏప్రిల్ 30న చందనోత్సవం నాటికిఅభివృద్ధి పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. మే నాటికి పనులు పూర్తి చేసి భక్తులకు పూర్తిగా వినియోగంలోకి తీసుకురావాలని తెలిపారు. గతం లో సింహాచలం దర్శనానికి వచ్చే భక్తులు కేవలం దర్శనం మాత్రమే చూసుకుని వెళ్లే వారని, ప్రస్తుతం చుట్టుప్రక్కల ప్రదేశాలను చూసే విధంగా టూరిజం సర్క్యూట్ ఏర్పాటుచేసి హోటల్స్, ఇతర మౌలిక వసతులు కల్పిస్తున్నామని చెప్పారు. విశాఖలో బీచ్, అడ్వెంచర్, ఎకో, క్రూయిజ్ టూరిజంలను పర్యాటకులకు అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

### ప్రసాద్ స్కీంతో అన్నవరంలో అభివృద్ధి కార్యక్రమాలు

ప్రసాద్ స్కీం కింద అన్నవరం పుణ్యక్షేత్రంలో కూడా పనులు జరుగుతున్నాయని మంత్రి దుర్గేష్ వివరించారు. రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేప ట్టేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధి, అంకితభావాన్ని చూసి కేంద్ర ప్రభుత్వం పెద్దఎత్తున సపోర్ట్ చేసేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. ఏప్రిల్ నుంచి నాలుగైదు ప్రధాన కార్యక్రమాలు కేంద్ర ప్రభుత్వం సహకారంతో చేపట్టనున్నామని వివరించారు.ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ సహకారంతో రూ.99కోట్లతో అఖండ గోదావరి, రూ.77కోట్లతో గండికోట ప్రాజెక్టులను చేపట్టామన్నారు. అఖండ గోదావరి ప్రాజెక్టులకు టెండర్లు పూర్తయ్యాయన్నారు. గండికోటకు టెండర్ల ప్రక్రియ ప్రారంభమైన విషయం వెల్లడించారు. త్వరితగతిన ఆయా ప్రాజెక్టుల పూర్తికి చర్యలు తీసుకుంటామన్నారు.రాబోయే రోజుల్లో మరిన్ని బీచ్‌లకు బ్లూఫ్లాగ్ సర్టిఫికేషన్ వచ్చేం దుకు కృషి చేస్తున్నామని వివరించారు.

# బలభద్రపురంలో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు

## గ్రామంలో 31 వైద్య బృందాలతో విస్తృత సర్వే ◆ అదుపులోనే ఉంది.. ఎటువంటి ఆందోళన వద్దు

## అనుమానిత కేసులకు చికిత్స అందేలా చర్యలు ◆ వైద్య ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్

అమరావతి(చైతన్యరథం): తూర్పుగోదావరి జిల్లా బలభద్రపురం గ్రామంలో 31 వైద్య బృందాలతో సార్వత్రిక క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహించడం జరుగుతోందని వైద్య ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. ఇటీవల అసెంబ్లీ సమావేశాల్లో అనపర్తి ఎమ్మెల్యే బలభద్రపురంలో క్యాన్సర్ కేసులను సభ దృష్టికి తెచ్చారని పేర్కొన్నారు. అందుకనుగుణంగా వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గ్రామం లో సమగ్ర క్యాన్సర్ సర్వేను ప్రారంభించడం జరిగిందని వివరించారు. ఈ అంశంపై సోమవారం సచివాలయంలో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఆరోగ్య శాఖ ఇప్పటికే 2024 నవంబర్ నుంచి నోటి, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ నిర్ధారణ చేసే సార్వత్రిక క్యాన్సర్ స్క్రీనింగ్‌ను నిర్వహిస్తుందని చెప్పారు. ఇప్పటికే 47 శాతం జనాభాను కవర్ చేయడం జరిగిందని తెలిపారు. బలభద్రపురం గ్రామంపై ప్రత్యేక దృష్టి సారించి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలకు 31 వైద్య బృందాలను నియమించినట్లు చెప్పారు. వీరికి ఏడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు, కాకినాడ వైద్యకళాశాల, జీఎస్ఎల్ వైద్య కళాశాల నిపుణులు సహకారం అందిస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం క్యాన్సర్ ఆందోళనకర స్థాయి లో లేదని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. పింక్ రిబ్బన్ కార్యక్రమం ద్వారా క్యాన్సర్‌పై ప్రజల్లో పెద్దఎత్తున అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని వివరించారు. బలభద్రపురం గ్రామంలో 3,500 గృహాలుం డగా 10,800 మంది జనాభా ఉండగా వైద్యబృందాలు 2025 మార్చి 22, 23 తేదీలలో 8,830 మంది వ్యక్తులను కవర్ చేస్తూ 2,803 గృహాలను సర్వే చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఈ సర్వే ద్వారా అనుమానిత క్యాన్సర్ కేసులను గుర్తించడం, గత మూడేళ్లుగా క్యాన్సర్ వల్ల సంభవించిన మరణాలను నమోదు చేయడం వంటివి చేస్తున్నారన్నారు. సర్వే అనుమానిత క్యాన్సర్ కేసులతో 38 మంది వ్యక్తులను గుర్తించగా అనుమానిత కేసు లలో సుమారు 10% నుంచి 15% వరకు క్యాన్సర్‌కు పాజిటివ్‌గా ఉంటుందని గమ నించడమైందని తెలిపారు. నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్ ఒక్కొక్కటి 6 కేసులు ఉండ గా, 7 మందిలో గర్భాశయ క్యాన్సర్ అనుమానిత కేసులుగా, 2 కేసుల్లో మెదడు క్యాన్స ర్, 3 కేసుల్లో ఊపిరితిత్తుల అనుమానిత క్యాన్సర్ కేసులు ఉన్నాయని చెప్పారు. అలాగే 14 మంది వ్యక్తులకు బహుళ రకాల అనుమానిత క్యాన్సర్ లక్షణాలు ఉన్నట్లు తెలిపారు. సర్వే బృందాలు 17 మంది క్యాన్సర్ రోగులు చికిత్సలు పొందుతున్నట్టు గుర్తించగా వారి లో రొమ్ము క్యాన్సర్ (ఐదుగురు), బహుళ క్యాన్సర్ రకాలు (9 మంది), మెదడు క్యాన్స ర్, రక్త క్యాన్సర్‌కు సంబంధించి మరో ముగ్గురు ఉన్నట్టు పేర్కొన్నారు.




గతంలో నిర్ధారిం చబడిన కేసుల్లో 15 మంది తమ క్యాన్సర్ చికిత్సను విజయవంతంగా పొందారని, ఈ కేసుల్లో ఎక్కువ మంది ఊపిరితిత్తుల క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్‌కు చికిత్సలు పొందినట్టు చెప్పారు. గత మూడేళ్లలో 19 క్యాన్సర్ సంబంధిత మరణాలు సంభవించినట్టు ఈసర్వే బృందాలు గుర్తించాయని తెలిపారు. రాష్ట్రంలో నోటి, రొమ్ము క్యాన్సర్లకు 18 ఏళ్ల వయసు గల మొత్తం జనాభాకు, గర్భాశయ క్యాన్సర్‌లకు 30 ఏళ్ల వయసు ఉన్న మహిళలకు సమగ్ర క్యాన్సర్ స్క్రీనింగ్‌ను చేపట్టిడం జరిగిందని వివరించా రు. మొత్తం 4.09 కోట్ల మందికి స్కీనింగ్ చేయాలని లక్ష్యం కాగా ఇప్పటికే 1.93 కోట్ల జనాభా స్క్రీనింగ్ పూర్తి చేసి 1,45,649 అనుమానిత కేసుల్లో 95,263 మందిని పీహె చ్‌సీల వైద్య బృందాలు పరీక్షించాయని తెలిపారు. కాగా రాష్ట్రంలో 2022 నుంచి 2025 వరకు 1,13,363 క్యాన్సర్ కేసులు చికిత్సలు అందించగా వాటిలో అత్యధిక కేసులు కాకినాడ జిల్లాలో 5,931 (5.23%) కాగా మిగతావి విజయనగరం, శ్రీకాకుళం, గుంటూరు, విశాఖపట్నం జిల్లాలు ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు. వైద్య ఆరోగ్య ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు మాట్లాడుతూ క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించగలిగితే మెరుగైన ఫలితాలు వస్తాయని, సకాలంలో తగిన నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని విజ్ఞప్తి చేశారు. క్యాన్సర్ అనుమానిత కేసులుగా గుర్తించిన వారికి మెరుగైన చికిత్స కోసం విశాఖపట్నం హెూమీ బాబా క్యాన్సర్ కేంద్రం ద్వారా లేదా ఎన్టీఆర్ వైద్య సేవలో ఎంప్యానల్ ఆసుపత్రుల్లో చికిత్స పొందేలా వారికే ఆప్షన్ ఇవ్వడం జరిగిందని చెప్పారు. అంతే గాక క్యాన్సర్‌కు సంబంధించి ఎన్టీఆర్ వైద్యసేవలో 256 ప్రొసీజర్లను పొందుపర్చడం జరిగిందని తెలిపారు. ఈ సమావేశంలో డీఎంఈ నర్సింహ పాల్గొన్నారు.

## డేటా అనుసంధాన ప్రక్రియ వేగవంతం

- మరింత చేరువగా వాట్సాప్ గవర్నెన్స్ సేవలు
- ఆర్టీజీఎస్‌పై సమీక్షలో సీఎస్ విజయానంద్ ఆదేశం



అమరావతి(చైతన్యరథం): ఆర్టీజీఎస్‌లో డేటా అనుసంధాన ప్రక్రియ మరింత వేగవంతం చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయా నంద్ ఆదేశించారు. సోమవారం ఆర్టీజీఎస్ కార్యకలాపాలపై సచివాలయంలో అధికారులతో ఆయన సమీక్ష నిర్వహిం చారు. డేటా అనుసంధానంతో ఏర్పాటు చేస్తున్న డేటా లేక్ పనుల ప్రగతి గురించి తెలుసుకున్నారు. డేటా అను సంధాన ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఇంకా డేటా అందించని శాఖల ఉన్నతాధికారులతో మాట్లాడి వారి నుంచి కూడా సాధ్యమైనంత త్వరగా డేటా తెప్పించి డేటా లేక్ పనులు వేగవంతం చేయాలని సూచిం చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశ యాలకనుగుణంగా ప్రజలకు మెరుగైన సేవలందించేలా డేటా లేక్ ఏర్పాటు పనులు చేపట్టాలని సూచించారు. వాట్సాప్ గవర్నెన్స్ అమలు ప్రగతిపైన కూడా సీఎస్ సమీక్షించారు. వాట్సాప్ ద్వారా 200కు పైగా సేవలందించడం శుభపరిణామన్నారు. ప్రజలకు మరింత చేరువగా వాట్సాప్ గవర్నెన్స్‌ను తీసుకె ళ్లాలని సూచించారు. ప్రభుత్వ శాఖల్లో అధికారులు, సిబ్బంది యంత్రాంగం పనితీరు మరింత పెంపొందించేలా ఈ-ఫైళ్ల క్లియరెన్స్‌ను మదింపు వేయా లన్నారు. ఐటీ, రియల్ టైం గవర్నెన్స్ శాఖ కార్యదర్శి భాస్కర్ కాటంనేని మాట్లాడుతూ వాట్సాప్ గవర్నెన్స్ ప్రగతి గురించి సీఎస్‌కు వివరించారు. పౌరు లు వాట్సాప్ ద్వారా కేవలం టెక్ట్స్ మెసేజ్ ద్వారానేకాకుండా తమ వాయిస్ మెసేజ్ ద్వారా ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ సౌలభ్యంతో సులభంగా అన్ని సేవలు పొందేలా వాట్సాప్ గవర్నెన్స్‌ను అభివృద్ధి చేస్తున్నామని, ప్రస్తుతం ఇది పరీక్ష దశలో ఉందని తెలిపారు. త్వరలోనే దీనిని పౌరులకు అందుబాటులోకి తెస్తామని చెప్పారు. డేటా అను సంధాన ప్రక్రియ కూడా వేగవంతం చేస్తున్నామన్నారు. ఇప్పటికే ప్రతి ప్రభుత్వశాఖలో ఒక చీఫ్ డేటాటెక్నికల్ ఆఫీసర్ (సీడీటీఓ)ను నియమించడం జరిగిందన్నారు. దాదాపుగా అన్నిశాఖ లు డేటా లేక్‌తో అనుసంధానం అవుతున్నాయని, కొన్ని శాఖల నుంచి ఇంకా డేటా రావాల్సి ఉందని వాటిపైన ప్రత్యేక దృష్టి సారిం చామని తెలిపారు. గ్రామస్థాయి నుంచి ప్రజలకు, రైతులకు వాతావరణం గురించి క్షుణ్ణంగా వివరాలు ఎప్పటిక ప్పుడు అందించేలా ఆర్టీజీఎస్‌లో ఆవేర్ (ఆంధ్రప్రదేశ్ వెదర్ ఫోర్‌కాస్టింగ్ అండ్ ఎర్లీ వార్నింగ్ రీసెర్చి సెంటర్) హబ్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.త్వరలోనే ఇది కార్య రూపం దాల్చబోతుందని తెలిపారు. ఈ సమావేశంలో జీఏడీ పొలిటికల్ ముఖ్య కార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనా, సమాచార పౌరసం బంధాలశాఖ సంచాలకులు హిమాంషు శుక్లా, ఎక్సైజ్‌శాఖ సంచాలకులు నిషాం త్‌కుమార్,ఏపీ మారిటైమ్‌బోర్డు సీఈవో ప్రవీణ్ ఆదిత్య, ఆర్టీజీఎస్ ఇన్‌చార్జి సీఈవో ఎం. మాధురి తదితరులు పాల్గొన్నారు.

## ఎయిర్ కార్గోలో విదేశాలకు మామిడి ఎగుమతులు

- నూజివీడు మామిడికి పూర్వవైభవం తీసుకొస్తాం
- రూ.30 కోట్లతో మార్కెట్ యార్డు అభివృద్ధికి చర్యలు
- వారికి డ్రిప్ ఇరిగేషన్, బీమా, సబ్సిడీ రుణాలు
- నాణ్యత పెంచుకుంటేనే అధిక లాభాలు సాధ్యం
- పరిశోధనలు రైతులకు లాభసాటిగా ఉండాలి
- గృహనిర్మాణ మంత్రి కొలుసు పార్థసారథి



నూజివీడు(చైతన్యరథం): నూజివీడు మామిడికి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. పట్టణంలోని నాగేంద్ర వరలక్ష్మి కల్యాణ మండపంలో సోమవారం మామిడి పరిశోధన కిసాన్ మేళా వర్క్‌షాప్ జరిగింది. ముఖ్యఅతిథిగా మంత్రి పాల్గొన్నారు. మామిడి పరిశోధన, మార్కెటింగ్ సౌకర్యాలు, ఏర్పాటు చేసిన స్టాల్స్ సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ నూజివీడు మామిడికి మరింత ప్రాధాన్యం చేకూర్చి రవాణా సౌకర్యాలు మెరుగుపరిచేందుకు రూ.30 కోట్లతో నూజివీడు మార్కెట్ యార్డ్ అభివృద్ధి చేస్తామని తెలిపారు. రైతులు మామిడి నాణ్యత పెంచితే ఎయిర్ కార్గో సేవలు కూడా అందుబాటులోకి తెస్తామని వెల్లడించారు. మామిడి రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెట్టిందని తెలిపారు. నూజివీడు మామిడికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఒక ప్రత్యేక గుర్తింపు ఉందని, కానీ ఇటీవల కాలంలో నాణ్యమైన దిగుబడులు రాకపోవడంతో రైతులు ఆర్థికంగా ఎంతగానో నష్టపోతున్నారన్నారు. వ్యవసాయం, అనుబంధ రంగాల అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని, రైతాంగ సంక్షేమానికి సబ్సిడీతో కూడిన పథకాలను అందిస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వం విస్మరించిన మామిడి పంటకు భీమా పథకాన్ని త్వరలో అమలు చేస్తామని మంత్రి చెప్పారు. నూజివీడు మామిడి ఇమేజ్ మరింత పెంచేందుకు నాణ్యమైన మామిడి పంటకు రైతులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. మంత్రి లోకేష్ పాదయాత్రలో నూజివీడు ప్రాంతంలోని మామిడి రైతులు తమ సమస్యలు తెలపగా వాటిని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని, హామీని నిలబెట్టుకుంటూ మార్కెట్ యార్డులో రూ.30 కోట్లతో సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. నాణ్యమైన మామిడి దిగుబడికి ఉద్యానవన, మార్కెటింగ్, మామిడి పరిశోధన శాస్త్రవేత్తలు, రైతులతో కలిసి కమిటీ నియమించి నూజివీడు మామిడికి పూర్వవైభవం వచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మామిడి రైతుల ఆర్థికాభివృద్ధికి మెరుగైన రవాణా సౌకర్యాలు, నాణ్యమైన మామిడిని విదేశాలకు ఎగుమతి చేసేందుకు ఎయిర్ కార్గో సేవలు కూడా రైతులకు అందుబాటులోకి తెస్తామన్నారు. మామిడి రైతులకు లాభాలు పెంచడానికి ఉపయోగ పడేలా పరిశోధ నలు ఉండాలని మంత్రి ఆకాంక్షించారు. మామిడి రైతుల కష్టాలు తీర్చడానికి కూట మి ప్రభుత్వం బీమా ప్రవేశపెట్టిందని తెలిపారు, మామిడి రైతులకు సబ్సిడీ రుణాలు కూడా అంద జేస్తుందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మామిడి పరిశోధన కేంద్రంలో అవసరమైన సిబ్బందిని ప్రభుత్వంతో చర్చించి తాత్కాలిక పద్ధతిలో నియమించాలని సూచించారు. మామిడి పంటతో పాటు అంతర పంటను వేస్తే లాభసాటిగా ఉంటుందని దానిపై దృష్టి పెట్టాలని సూచించారు. విదేశాలకు మామిడి ఎగుమతి చేసే ప్రైవేట్ ఎక్స్‌పోర్ట్ సంస్థలకు ప్రభుత్వం అనేక మౌలిక సదుపాయాలు కల్పిస్తుందని చెప్పారు. డ్రిప్ ఇరిగేషన్‌కు ప్రభుత్వం సబ్సిడీ అందజేస్తుందని, దానిని మామిడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు, మామిడి కాయలకు కవర్లు 60శాతం సబ్సిడీ అందిస్తుందని వాటిని వినియోగించుకుంటే అధిక రాబడి పొంద వచ్చని తెలిపారు. ప్రభుత్వంతో మాట్లాడి ఎయిర్‌కార్గో త్వరలో ఏర్పాటు చేస్తానని, వచ్చే ఏడాది కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటు చేస్తామని తెలిపారు.

చైతన్యరథం

రేపటి పౌరులను రూపొందించడంలో..

## వ్యక్తిత్వ వికాసానిదే కీలక పాత్ర

- గంజాయి, మాదకద్రవ్యాలకు యువత, విద్యార్థులు దూరంగా ఉండాలి
- శాప్ చైర్మన్ రవినాయుడు ఉద్బోధ



తిరుపతి (చైతన్యరథం): వ్యక్తిత్వ వికాసం అనేది నిరంతర ప్రక్రియని, పాఠశాల స్థాయి నుంచి కళాశాల స్థాయి వరకు విద్యార్థులు వ్యక్తిత్వ వికాసంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) చైర్మన్ అనిమిని రవి నాయుడు ఉద్బోధించారు. సోమవారం తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా కళాశాల, వర్సిటీలో రెండు వేదికల్లో వేరువేరుగా నిర్వహించిన వ్యక్తిత్వ వికాస తరగతులను వర్సిటీ ఉపకులపతి ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు, పద్మావతి కళాశాల ప్రిన్సిపాల్ నారాయణమ్మలతో కలిసి రవినాయుడు జ్యోతి ప్రజ్వలన చేసి లంచనంగా ప్రారంభించారు. ఎస్వీయూ కల్చరల్ అఫైర్స్ స్టూడెంట్ వెల్ఫేర్ కోఆర్డినేటర్ డా. పత్తిపాటి వివేక్, సెట్విన్ డైరెక్టర్ మోహన్ కుమార్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ తరగతులను నిర్వహించారు.

ఈ సందర్భంగా రవి నాయుడు మాట్లాడుతూ వ్యక్తిత్వ వికాసంలో ప్రధానమైనది నాయకత్వ లక్షణం అన్నారు. దానిని ప్రదర్శించడంలో అప్పటి మహాత్మా గాంధీ, స్వామి వివేకానందుడు, ప్రస్తుతం చంద్రబాబు నాయుడు వంటి వారిని ఆదర్శంగా తీసుకోవాన్నారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం ఉమ్మడి రాష్ట్రంలో విజన్-2020 కోసం చంద్రబాబు చేసిన కృషిని, ప్రస్తుతం ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు విజన్-2047 కోసం పనిచేస్తున్న విధానాన్ని మనం ఆదర్శంగా తీసుకోవాలన్నారు. వ్యక్తిత్వ వికాసం పై ప్రస్తుత రాష్ట్ర విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారన్నారు.

వర్సిటీలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆచార్య అప్పారావు మాట్లాడుతూ అధ్యాపకులు విద్యార్థుల వ్యక్తిత్వ వికాసంలో, అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. మరో అతిథి వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు మాట్లాడుతూ విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి.. మేధో మథన కార్యకలాపాలు, స్వీయ వ్యక్తీకరణాభివృద్ధికి కళాత్మక కార్యక్రమాల్లో వివిధ గొప్ప వ్యక్తుల పాత్రలు పోషించడం ప్రయోజనకరంగా ఉంటుందన్నారు.

పద్మావతి కళాశాల ప్రిన్సిపాల్ నారాయణమ్మ మాట్లాడుతూ ఆరోగ్యకరమైన వ్యక్తిత్వం.. విద్యపై, పనితీరుపై సానుకూల ప్రభావాన్ని చూపుతుందనీ, శ్రేయస్సును ప్రోత్సహిస్తుందని, సమగ్ర అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. రెండు వేదికల్లో జరిగిన ఈ కార్యక్రమాల్లో సైకాలజిస్ట్ శ్రీనివాస్ వ్యక్తిత్వ వికాసంపై విద్యార్థినీ విద్యార్థులకు శిక్షణను ఇచ్చారు. ఇందులో ఎస్వీయూ ప్రిన్సిపాళ్లు నరసయ్య, సుబ్బారావు, కల్చరల్ అఫైర్స్ డైరెక్టర్ ఆచార్య మురళీధర్, ఊతని శరత్ బాబు, డా. చంద్ర ప్రకాష్, రంజిత్ కుమార్, ఎస్వీయూ ఫార్మసీ కళాశాల, పద్మావతీ కళాశాల విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## శ్రీశ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ అభివృద్ధికి టీటీడీ ఆర్థికసాయం

- రూ.కోటి మంజూరు చేసిన టీటీడీ పాలకమండలి
- కృతజ్ఞతలు తెలిపిన శాప్ ఛైర్మన్ రవినాయుడు

తిరుమల (చైతన్యరథం): తిరుపతిలోని శ్రీ శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ అభివృద్ధికి రూ.కోటి మంజూరు చేస్తూ టీటీడీ పాలకమండలి తీసుకున్న నిర్ణయం పట్ల ఏపీ స్పోర్ట్స్ అథారిటీ (శాప్) ఛైర్మన్ అనిమిని రవినాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో జె.శ్యామల రావు, ఏఈవో, బోర్డు సభ్యులను సోమవారం కలిసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా శాప్ ఛైర్మన్ రవినాయుడు మాట్లాడుతూ గతంలో శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్సుకు టీటీడీ నిధులు కేటాయించేదని, తద్వారా టీటీడీ అను బంధ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు, క్రీడాకారులు, స్థానికులు కాంప్లెక్సులోని క్రీడావసతులను వినియోగించుకునేవారన్నారు.

శాప్ ఛైర్మన్గా తాను బాధ్యతలు చేపట్టాక టీటీడీ ఛైర్మన్ బీఆర్.నాయుడుని కలిసి స్పోర్ట్స్ కాంప్లెక్స్ అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశానన్నారు. ఇదే విషయాన్ని సీఎం చంద్రబాబు దృష్టిలో పెట్టామని, సీఎం ఆలోచనలు, ఆశయాలకు అనుగుణంగా రాష్ట్ర క్రీడాభివృద్ధికి టీటీడీ పాలకమండలి సహకరించడం సంతోషకరమన్నారు. తిరుపతి క్రీడాకారులకు మెరుగైన వసతులు కల్పించంతోపాటు క్రీడల్లో వారు మరింత రాణించేందుకు టీటీడీ కేటాయించిన నిధులు దోహదపడతాయన్నారు. తిరుపతి క్రీడాకారులు కూడా సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా నిధులు మంజూరు చేసిన టీటీడీ ఛైర్మన్ బీఆర్.నాయుడుకు శాప్ ఛైర్మన్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు..

# ఉగాది రోజున తాళాలు అందిస్తాం

- మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడి



మచిలీపట్నం (చైతన్యరథం): మచిలీపట్నం నగర పరిధిలోని 432 మంది టిడ్కో గృహాల లబ్ధిదారులకు ఉగాది రోజున ఇళ్ల తాళాలు అందిస్తామని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖల మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. సోమవారం మధ్యాహ్నం మచిలీపట్నం నగర పరిధిలోని గోసంఘంలోని టిడ్కో గృహ సముదాయాలను మంత్రి సందర్శించారు. టిడ్కో గృహ సముదాయాల వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ టీవీ కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇల్లు లేని ప్రతి పేదవాడికి సొంతింటి కల నెరవేర్చాలనే లక్ష్యంతో ఎంతో కృషిచేసి జిల్లాలో టిడ్కో గృహాలను నిర్మించామన్నారు. ఈ నిర్మాణంలో ఎక్కడా కూడా ఇటుకరాయి వాడకుండా నిర్మాణం మొత్తం కేవలం కాంక్రీట్ పోతతోనే అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో, పటిష్టమైన పునాదితో నిర్మించామని తెలిపారు. మచిలీపట్నం కార్పొరేషన్ పరిధిలో దాదాపు 6,400 గృహాల నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించి అనుమతులు పొందామని, అయితే ఆనాడు 4,176 గృహాలకు పునాదులు వేసినప్పటికీ కొన్ని సమస్యల వల్ల 2,304 గృహాలను మాత్రమే పూర్తి చేయగలిగామని, త్వరలో మిగిలిన వాటిని కూడా పూర్తిచేసి అర్హులైన వారికి అందిస్తామన్నారు. గోసంఘం టిడ్కో గృహ సముదాయాలలో భూగర్భ మురుగునీటి పారుదల వ్యవస్థ, ఇతర మౌలిక వసతులను కల్పించామని, త్వరలో ఇక్కడ అంగన్వాడీ కేంద్రం, పట్టణ ప్రాథమిక కేంద్రం, షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. అదేవిధంగా ఇంటి నిమిత్తం నగదు చెల్లించిన లబ్ధిదారుల్లో ఎవరైనా ఇల్లు పొందకపోయి ఉంటే, వారందరికీ తిరిగి డబ్బులు చెల్లించే విధంగా ప్రభుత్వంతో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా జిల్లాలోని క్రీడాకారులందరికీ ఉపయోగపడే విధంగా అథ్లెటిక్ ట్రాక్, స్విమ్మింగ్ పూల్, ఇతర క్రీడా కోర్టుల నిర్మాణానికి పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో సుమారు రూ.50 కోట్ల వ్యయంతో మల్టీ పర్పస్ స్టేడియం నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. గృహ సముదాయాల వద్ద మొక్కలను నాటి కాలనీలో పచ్చదనానికి చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్కు మంత్రి ఈ సందర్భంగా సూచించారు. అదే విధంగా కాలనీలోని ప్రజలు సైతం సొసైటీలుగా ఏర్పడి కాలనీ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిడ్కో గృహాల ప్రాజెక్ట్ ఆఫీసర్ బి చిన్నోడు, మాజీ మున్సిపల్ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు గొర్రెపాటి గోపిచంద్, కూటమి నాయకులు బండి రామకృష్ణ, రామారావు, సుబ్రహ్మణ్యం, నగర మున్సిపల్ కమిషనర్ బాపిరాజు, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో ఆయుష్ సేవల విస్తృతికి ప్రణాళికలు

- ఆయుష్ డిస్పెన్సరీల్లో 50 శాతం డాక్టర్ల కొరత
- ఖాళీలను సత్వరమే భర్తీ చేయాలి
- అధికారులకు మంత్రి సత్యకుమార్ ఆదేశాలు
- ఉన్నతాధికారులతో విస్తృత సమీక్ష



అమరావతి (చైతన్యరథం): దేశవిదేశాల్లో ఆయుష్ సేవల (ఆయుర్వేద, యోగ, యునాని, సిద్ధ, హోమియోపతి) పట్ల ఆదరణ పెరుగుతున్నా గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో రాష్ట్రంలో ఈ సేవలు కుదేలవడం పట్ల వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆందోళన వ్యక్తం చేశారు. పెరుగుతున్న డిమాండ్ దృష్ట్యా ఈ సేవల విస్తృతికి ప్రణాళికలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వెలగపూడిలోని ఏపీ సచివాలయంలో సోమవారం రాష్ట్రంలో ఆయుష్ సేవల పరిస్థితిపై సంబంధిత ఉన్నతాధికారులతో రెండు గంటల పాటు విస్తృతంగా చర్చించిన మంత్రి పలు ఆదేశాలిచ్చారు. ఆయుష్ డిస్పెన్సరీలు, ఆసుపత్రులు, కాలేజీల్లో నెలకొన్న సిబ్బంది కొరతపై ఆందోళన వ్యక్తం చేసిన మంత్రి.. ఖాళీల భర్తీకి నిర్దిష్ట కాల వ్యవధిలో ప్రణాళికలు చేపట్టాలని ఆదేశించారు. రాష్ట్రంలోని 1188 ఆయుష్ డిస్పెన్సరీల్లో డాక్టర్ల కొరత 50 శాతం మేర ఉన్నట్లు ఈ సమీక్షా సమావేశంలో వెల్లడయ్యింది. ఈ ఖాళీల సత్వర భర్తీకి ఆంధ్రప్రదేశ్ స్టేట్ మెడికల్ రిక్రూట్మెంట్ బోర్డు ద్వారా నియామకాలు చేపట్టాలని సూచించారు.

601 డిస్పెన్సరీలు ఆయుష్ విభాగం ఆధీనంలో నడుస్తుండగా మరో 587 జాతీయ ఆరోగ్య మిషన్లో భాగంగా నిర్వహిస్తున్నారు. వీటితో పాటు 8 ఆసుపత్రులతో కలిపి ప్రతి నెలా 1,63,405 మంది వివిధ ఆయుష్ ఓపీ సేవల్ని పొందుతున్నారు. నెలవారీగా దాదాపు 1500 మంది ఇన్పేషెంట్ సేవల్ని పొందుతున్నారు. కోవిడ్ అనంతరం ప్రజల్లో ఆయుష్ సేవల పట్ల ఆసక్తి బాగా పెరిగినందున ఈ సేవల్ని ప్రస్తుత స్థాయి నుంచి భారీగా పెంచాలని మంత్రి సత్యకుమార్ ఆదేశించారు.

***గత ప్రభుత్వ నిర్లక్ష్యం***

2021 నుండి అధికారం నుండి దిగిపోయేదాకా గత ప్రభుత్వం మూడేళ్ల పాటు జాతీయ ఆయుష్ మిషన్ కింద ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని, ఆ నిర్లక్ష్యం వల్ల రాష్ట్రంలో ఆయుష్ సేవలు దెబ్బతిన్నాయని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మిషన్ కింద ఖర్చులో రాష్ట్రంలోని గత ప్రభుత్వం తన వాటా కింద 40 శాతం నిధుల్ని ఇవ్వకపోవడమే ఈ దుస్థితికి కారణమని ఆయన తెలిపారు. దీనికి భిన్నంగా కూటమి ప్రభుత్వం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జాతీయ ఆయుష్ మిషన్ కింద రూ.41 కోట్లకు పైగా ఖర్చు చేసిందని మంత్రి వివరించారు.

పలు ఆయుష్ డిస్పెన్సరీలు నిర్వహిస్తున్న భవనాల పరిస్థితిపై మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆందోళన వ్యక్తం చేశారు. వీటి పునర్నిర్మాణం, మరమత్తుల కోసం దాతల సాయాన్ని కోరాలని అధికారులకు సూచించారు. ఆయుష్ డిస్పెన్సరీల్లో వైద్యులు, సహాయక సిబ్బంది నిర్ణీత సమయం మేరకు విధులకు హాజరయ్యేలా చూడాలని, హాజరు విషయంలో నెలవారీ నివేదికలు అందజేయాలని ఆదేశించారు. ఆంగ్ల వైద్యానికి లొంగని కొన్ని వ్యాధులకు సంబంధించి భారతీయ వైద్య విధానంలో పరిష్కారాలున్నందున అలాంటి వ్యాధుల బారిన పడిన వారిని గుర్తించి, ఆయుష్ సేవల్ని అందించి, వాటి ఫలితాల్ని ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేసే కార్యక్రమాన్ని ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని అధికారులకు మంత్రి సత్యకుమార్ సూచించారు.

***క్రియాన్ పూర్తికి రెండేళ్ల గడువు***

గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో వెలుగు చూడని ప్రతిష్టాత్మకమైన క్రియాన్ (సెంటర్ ఫర్ రీసెర్చ్ ఇన్ యోగా, ఆయుర్వేద అండ్ నేచురోపతి) నిర్మాణాన్ని రెండేళ్లలో పూర్తి చేసేలా తగు చర్యల్ని చేపట్టాలని అధికారులకు మంత్రి సూచించారు. రాష్ట్రంలో 2014-19 మధ్య అప్పటి ప్రభుత్వం రూ.100 కోట్లు ఖర్చయ్యే ఈ కేంద్రానికి గన్నవరం సమీపంలోని కొండపావులూరు వద్ద స్థలాన్ని కేటాయించగా, గత వైసీపీ ప్రభుత్వం ఆ స్థలాన్ని వేరే అవసరాలకు వినియోగించిందన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం గుంటూరు జిల్లాలో తాజాగా స్థలాన్ని కేటాయించిందని మంత్రి సత్యకుమార్ తెలిపారు. ఈ సమీక్షలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు, ఆయుష్ కమిషనర్ డాక్టర్ డి.మంజుల, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## టేబుల్ టెన్నిస్‌లో పతకాలు.. ఉద్యోగినులకు సీఎస్ అభినందలు

అమరావతి (చైతన్యరథం): ఇటీవల ఢిల్లీలో జరిగిన ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్లో ఆంధ్రప్రదేశ్ నుండి పాల్గొన్న రాష్ట్ర సచివాలయ ఉద్యోగులు కాంస్య పథకాలు సాధించడం పట్ల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) కె.విజయానంద్ అభినందనలు తెలిపారు. ఈ మేరకు కాంస్య పథకాలు సాధించిన మైనార్టీ సంక్షేమ శాఖలో సహాయ కార్యదర్శిగా పనిచేస్తున్న మద్దా బేబి సరోజిని, జీఏడీలో సెక్షన్ అధికారిగా పనిచేస్తున్న సహదేవ సత్యవతి.. సోమవారం రాష్ట్ర సచివాలయంలో సీఎస్‌ను కలిసి వారు సాధించిన కాంస్య పతకాలు, ప్రశంసా పత్రాలను చూపించారు. ఈ సందర్భంగా సీఎస్ విజయానంద్ వారిని ప్రత్యేకంగా అభినందిస్తూ రానున్న రోజుల్లో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

# వక్ఫ్‌బోర్డు భూమి కబ్జా



- బినామీ పేర్లతో వైసీపీ నేతల భూ దందాలు
- ఉద్యోగానికి రాజీనామా చేయాలంటూ బెదిరింపులు
- పలు సమస్యలపై టీడీపీ కేంద్ర కార్యాలయానికి పోటెత్తిన బాధితులు
- అర్జీలు స్వీకరించిన కురువ, కురుమ కార్పొరేషన్ చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప



అమరావతి (చైతన్యరథం): మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమంలో భూ కబ్జాలు, పలు సమస్యలపై ఫిర్యాదులు వచ్చాయి. బాధితుల నుంచి కురువ, కురుమ కార్పొరేషన్ చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప వినతులు స్వీకరించారు. భూ సమస్యలు, ఇతర సమస్యలపై సంబంధించిన అధికారులతో వెంటనే ఫోన్‌లో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేశారు.

కర్నూలు జిల్లా, ఆదోని మండలం, ఇస్వి గ్రామానికి చెందిన అంగన్ వాడీ టీచర్ బి.మమత విజ్ఞప్తి చేస్తూ..2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం టీడీపీ సానుభూతిపరురాలని సాక్షిలో తప్పుడు రాతలు రాయించి తన ఉద్యోగం తొలగించారని, తనకు ఆ ఉద్యోగం ఇప్పించాలని కోరారు.

బాపట్ల జిల్లా, చెరుకుపల్లి మండలం, పులిగడ్డ వారిపాలెం గ్రామానికి చెందిన పులిగడ్డ శ్రీనివాసు విజ్ఞప్తి చేస్తూ.. సర్వే నెం: 434/9లో ఉన్న తనకు చెందిన 0.45 సెంట్ల భూమిని పులిగడ్డ సాంబశివరావు అనే వ్యక్తి అక్రమించారని అతనిపై చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని విన్నవించుకున్నారు.

అనకాపల్లి జిల్లా, మునగపాక మండలం, గవరపాలెం గ్రామానికి చెందిన దాడి వెంకట ఆది నాగేశ్వరరావు విజ్ఞప్తి చేస్తూ.. ఉమ్మాలాడ గ్రామ రెవిన్యూ పరిధిలో ఉన్న సర్వేనెం.. 91/2ఏ లో ఉన్న 0.39 సెంట్ల భూమిని గత వైసీపీ ప్రభుత్వంలో రీసర్వే పేరుతో వెబ్ ల్యాండ్ లో 0.1290 సెంట్లుగా తప్పుగా నమోదు చేశారని ఫిర్యాదు చేశారు. బాధ్యులైన వారిపై చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

కాకినాడ జిల్లా, కరప మండలం, గురజనాపల్లి గ్రామానికి చెందిన దొడ్డ వీరమంజు సాయి అనే విద్యార్థి విజ్ఞప్తి చేస్తూ.. తన తల్లిదండ్రులు ఇంటి నిర్మాణం కోసం చేసిన అప్పును వెంటనే తీర్చాలని ఇంటి నుంచి బయటకు వెళ్లకుండా చేశారని ఫిర్యాదు చేశాడు. దీని వల్ల ఇంటర్ ఫస్ట్ ఇయర్ ఎగ్జామ్స్ రాయలేకపోయానని వాపోయాడు. కారకులపై కఠిన చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని కోరాడు.

అన్నమయ్య జిల్లా, కలికిరి మండలం,మర్రికుంటపల్లి గ్రామానికి చెందిన కూరిమి అబ్రహం అనే వ్యక్తి విజ్ఞప్తి చేస్తూ.. తను గ్రామంలో లేని సమయంలో తనకు పిత్రార్జితంగా వచ్చిన భూమిని అదే గ్రామానికి చెందిన నాగు, యర్రయ్య అనే వ్యక్తులు అక్రమంగా అక్రమించారని ఫిర్యాదు చేశారు. తనకు న్యాయం చేయాలని కోరారు.

ఎన్టీఆర్ జిల్లా, విజయవాడ రూరల్, అంబాపురానికి చెందిన బొడ్డు వినయ్ కుమార్ అనే వ్యక్తి విజ్ఞప్తి చేస్తూ.. గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అనుచరుడు పింద్రా పుల్లయ్య అనే వ్యక్తి అంబాపురంలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ కామన్ భూములపై తప్పుడు పత్రాలు సృష్టించి బినామీ పేర్లతో భూ దందాలు చేశారని. తగిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు.

కర్నూలు జిల్లాలో మండల కేంద్రం మంత్రాలయానికి చెందిన హండీ హనుమంతు విజ్ఞప్తి చేస్తూ.. గత 15 సంవత్సరాలుగా ఫీల్డ్ ఆసిస్టెంట్‌గా పని చేస్తున్న తనను రాజీనామా చేయాలని వైసీపీ నాయకులు బెదిరిస్తున్నారని ఫిర్యాదు చేశారు. తన ఉద్యోగానికి భద్రత కల్పించాని కోరారు.

కర్నూలు జిల్లా, ఆదోని మండలం, నాగనాధనవళ్ళి గ్రామానికి చెందిన పింజారి రాజాసాబ్ విజ్ఞప్తి చేస్తూ..అదే గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు ఎన్.పి. తిమ్మారెడ్డి వక్ఫ్ భూములను కబ్జా చేసి ఇతరులకు విక్రయించారని ఫిర్యాదు చేశారు. అతడిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

నెల్లూరు జిల్లా, జలదంకి మండలం, చామదల గ్రామానికి చెందిన దేవళ్ల చెంచు రామయ్య అనే వ్యక్తి విజ్ఞప్తి చేస్తూ.. తన తండ్రి దేవళ్ల నాగయ్యకు 1979లో ప్రభుత్వం సర్వే నెం.3980/88, 134/3లో ఇచ్చిన డి -పట్టా భూమిని వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిందని, తిరిగి ఆ భూమిని తమకు కేటాయించాలని కోరారు.







# టీటీడీ ఆస్తుల పరిరక్షణకు కమిటీ

- రూ.5,258.68 కోట్లతో 2025-26 బడ్జెట్‌కు ఆమోదం
- శ్రీవారి ఆలయాల నిర్మాణం కోసం ప్రత్యేక ట్రస్ట్
- వివిధ రాష్ట్రాల రాజధానుల్లో శ్రీవారి ఆలయాలు
- టీటీడీ బోర్డు సమావేశం నిర్ణయాలు



తిరుమల (చైతన్యరథం): తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆస్తుల పరిరక్షణకు ప్రత్యేకంగా కమిటీ ఏర్పాటు చేస్తామని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. టీటీడీలో శాశ్వత ఉద్యోగులకు మూడు నెలలకు ఒకసారి సుపథం టికెట్ ఇచ్చి శ్రీవారి దర్శనం కల్పిస్తామని చెప్పారు. తిరుమలలో లైసెన్స్ లేని దుకాణాలను ఖాళీ చేయిస్తామన్నారు. సోమవారం టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశం అనంతరం ఈవో శ్యామలరావుతో కలిసి బీఆర్ నాయుడు మీడియాతో మాట్లాడారు. బోర్డు తీర్మానాలను వివరించారు.

## బోర్డు చేసిన తీర్మానాలు ఇవీ..

రూ.5,258.68 కోట్లతో టీటీడీ 2025-26 బడ్జెట్‌కు ఆమోదం. రూ.772 కోట్లతో గదుల ఆధునికీకరణకు నిర్ణయం. ఇతర దేశాల్లో శ్రీవారి ఆలయాల నిర్మాణాల కోసం ప్రత్యేక ట్రస్ట్ ఏర్పాటు. టీడీపీ ఆస్తులు పరిరక్షించేందుకు కమిటీ ఏర్పాటు. టీటీడీకి చెందిన భూముల న్యాయపరమైన వివాదాలపై పరిష్కారం కోసం ప్రత్యేక చర్యలు. టీటీడీలో విధులు నిర్వహిస్తున్న హిందూయేతర ఉద్యోగుల తొలగింపుపై తీర్మానం. వచ్చే ఏడాది కాలంలో వివిధ రాష్ట్రాల రాజధానుల్లో శ్రీవారి ఆలయాల నిర్మాణానికి సంబంధించి ప్రత్యేక చర్యలు. గ్రామాల్లో అర్ధాంతరంగా ఆగిన ఆలయాల నిర్మాణాలకు ఆర్థిక సాయం. శ్రీనివాస సేవా సమితి పేరుతో స్వామి వారికి కైంకర్యాల సామగ్రి సరఫరాలో జరిగిన అక్రమాలపై విచారణకు ఆదేశం. టీటీడీ మూలాలున్న వివిధ ప్రాంతాల్లోని ఆలయాల పునరుద్ధరణకు తీర్మానం. తిరుమలలో అనధికార హాకర్ల తొలగింపునకు విజిలెన్స్, రెవెన్యూ అధికారులతో కమిటీ ఏర్పాటు. వృద్ధులు, దివ్యాంగులకు ఆఫ్‌లైన్‌లో దర్శన టికెట్లు కేటాయింపు. ప్రయోగాత్మకంగా పూర్వ విదానాన్ని అమలు చేయాలని నిర్ణయం.

# చర్మకారుల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం

- కూటమి ప్రభుత్వంలో లిడ్‌క్యాప్‌కి మంచిరోజులు
- రాష్ట్రంలో లెదర్ పరిశ్రమను అభివృద్ధి చేస్తాం
- లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు




అమరావతి (చైతన్యరథం): చర్మకారుల అభివృది, సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర లిడ్‌క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు స్పష్టం చేశారు. సోమవారం నాడు తాడేపల్లిలోని లిడ్ క్యాప్ కార్యాలయంలో చర్మకారుల కో ఆపరేటివ్ సొసైటీ సన్నాహక సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు హాజరయ్యారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత వైసీపీ ప్రభుత్వం చర్మకారుల్ని నిర్లక్ష్యం చేయటంతో పాటు లిడ్ క్యాప్ ఆస్తుల్ని నిర్వీర్యం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక లిడ్ క్యాప్‌కి మంచి రోజులొచ్చాయన్నారు. ప్రకాశం జిల్లా గిద్దలూరులో ఇప్పటికే లెదర్ పార్క్‌కి శంకుస్థాపన చేశామన్నారు. దీని ద్వారా వేలాది మంది చర్మకారులకు ప్రత్యక్ష్యంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తుందన్నారు. గత టీడీపీ హయాంలోనే డప్పు కళాకారులు, చర్మకారులకు పింఛన్ ఇచ్చామని ఆయన గుర్తు చేశారు. ఈ ఐదేళ్లలో రాష్ట్రంలో లెదర్ పరిశ్రమను అభివృద్ధి చేసి చర్మకారులకు మెరుగైన జీవన ప్రమాణాలు కల్పిస్తామన్నారు. ఈ సందర్భంగా పలువురు చర్మకారులు మాట్లాడుతూ..రాష్ట్రంలో చర్మ నిల్వ కర్మాగారాలు లేకపోవడం, చర్మం కొనుగోలుకు తగిన అవకాశాలు లేకపోవడం కారణంగా తక్కువ రేటుకి అమ్ముకోవాల్సి వస్తోందని చైర్మన్ దృష్టికి తీసుకొచ్చారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఆయన సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో లిడ్ క్యాప్ మేనేజింగ్ డైరెక్టర్ వి.ప్రసన్న వెంకటేష్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సిహెచ్ లక్ష్మి కుమారి, లిడ్ క్యాప్ మేనేజర్ ఎన్. అధికారి, తదితరులు పాల్గొన్నారు.

## పల్లపు కాలువలో సిల్ట్ తొలగింపు పనులు

●కొబ్బరికాయ కొట్టి ప్రారంభించిన ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి



ఎస్.కోట (చైతన్యరథం): తాటిపూడి రిజర్వాయర్ ప్రాజెక్ట్ పరిధిలోని పల్లపు కాలువ సిల్ట్ తొలగింపు పనులను నియోజకవర్గ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి ప్రారంభించారు. తాటిపూడి ప్రాజెక్ట్‌లో పల్లపు కాలువ ప్రధాన కాలువగా ఉందని, దాని నీడివి మొత్తం 8.00 కిలోమీటర్లు... ఇది మొత్తం జామి మండలం పరిధిలో 2,126 ఎకరాల ఆయకట్టును సాగునీటిని అందిస్తుందన్నారు. గత కొన్ని ఏళ్లుగా పల్లపు కాలువ చివరి భాగం, సోరంగం బ్రాంచ్‌లో డీ సిల్టింగ్ పనులు జరగలేదని, దీని కారణంగా కాలువలో పొదలు పెరిగి, సిల్ట్ పేరుకుపోయి, చివరి ఆయకట్టు రైతులకు నీరు సరఫరా జరగడం లేదన్నారు. ఇటీవల పలుపురు రైతులు డీ సేవింగ్ పనులు చేపట్టాలని వినతిపత్రాలు ఇచ్చారని, విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకురాగా పనులు ప్రారంభించేందుకు చర్యలు చేపట్టం జరిగిందన్నారు. సిల్ట్ తొలగింపుతో కాలువలో నీటి ప్రవాహం పెరిగి చివరి దశ ఆయకట్టుకు పూర్తిస్థాయిలో నీరు అందుతుందన్నారు. రైతులకు సాగునీరు తగినంతగా లభిస్తుందని, పంట దిగుబడి పెరుగుతోందని కోళ్ల లలితకుమారి తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు పాల్గొన్నారు.

# పార్లమెంట్‌లో అరకు కాఫీ స్టాల్స్ ప్రారంభం



అరకు / ఢిల్లీ (చైతన్యరథం): అరకు కాఫీకి విస్తృత ప్రచారం కల్పించేందుకు లోక్‌సభ స్పీకర్ అవకాశం కల్పించారు. ఈ నేపథ్యంలో పార్లమెంట్‌లో సోమవారం ఉదయం అరకు కాఫీ స్టాల్స్ ఏర్పాటు అయ్యాయి. సభాపతి ఆదేశంతో రెండు స్టాల్స్ ఏర్పాటుకు లోకసభ భవనాల డైరెక్టర్ కుల్ మోహన్ సింగ్ అరోరా ఉత్తర్వులు ఇచ్చారు. దీంతో సంగం 1, 2 కోర్ట్ యార్డ్ వద్ద స్టాల్స్ ఏర్పాటు చేశారు. సోమవారం నుంచి ఈనెల 28 వరకు స్టాల్స్ ఏర్పాటుకు అవకాశం కల్పించింది. ఎంపీలు అల్పాహారం తీసుకునే సంగం కాంటీన్‌లో గిరిజన కోఆపరేటివ్ సొసైటీ ఏర్పాటు చేసింది. లోకసభ కాంటీన్‌లో పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు అరకు స్టాల్ ప్రారంభించారు. రాజ్యసభ కాంటీన్‌లో వాణిజ్య వ్యవహారాల శాఖ మంత్రి పీయూష్ గోయల్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి జోయల్ ఓరం, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, టీడీపీ, బీజేపీ ఎంపీలు హాజరయ్యారు. ఎంపీ కలిశెట్టి మాట్లాడుతూ... పార్లమెంట్‌లో అరకు వ్యాలీ కాఫీ స్టాల్స్ సోమవారం ఏర్పాటు అయ్యాయని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. తూర్పు కనుమల నుండి భారత దేశ పార్లమెంట్ వరకు అరకు వ్యాలీ కాఫీ ప్రస్థానం దేశంలో ప్రతి ఒక్కరికీ తెలుస్తున్నందుకు చాలా ఆనందంగా ఉందన్నారు. ఏపీ రాష్ట్ర గిరిజనుల కష్టాన్ని ప్రపంచం గుర్తించబోతుందని, వారి స్వహస్తాలతో పండించిన కాఫీ ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యానికి నిలయమైన భారత పార్లమెంట్‌లో ఎంపీలు అందరిని అమోఘమైన రుచితో మైమరపించబోతుందన్నారు. ఈ స్టాల్స్‌ను కేంద్ర మంత్రులు.. ప్రారంభం చేయడం సంతోషంగా సంతోషంగా ఉందని కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన శాఖ మంత్రి సంధ్యా రాణి, కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు,కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని, ఏపీ కూటమి ఎంపీలు తదితరులు పాల్గొన్నారు.

# ఓవైపు ఎండలు.. మరోవైపు వర్షాలు...

## రాష్ట్రంలో చిత్రమైన వాతావరణం



అమరావతి (చైతన్యరథం): ఏపీలో విచిత్రమైన వాతావరణం నెలకొంది. ఎండల నుంచి ప్రజలకు కాస్త ఉపశమనం కలిగింది. వచ్చే 3 రోజులు రాయలసీమలోని కొన్ని ప్రాంతాల్లో చెదురుముదురు వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. సోమవారం(మార్చి 24న) అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు, కూనవరం మండలాల్లో తీవ్ర వడగాల్పులు, శ్రీకాకుళం జిల్లా-4, విజయనగరం-3, పార్వతీపురం మన్యం-7, అల్లూరి సీతారామరాజు-3, తూర్పుగోదావరి-3, ఏలూరు-3, ఎన్టీఆర్-1 మండలాల్లో(24) వడగాల్పులు ప్రభావం చూపే అవకాశం ఉన్నట్లు ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్ తెలిపారు. ఆదివారం నంద్యాల జిల్లా పగిడ్యాలలో 39.9 డిగ్రీలు, వైఎస్సార్ జిల్లా అట్లూరులో 39.5 డిగ్రీలు, ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలో 39.2 డిగ్రీల అధిక ఉష్ణోగ్రతలు నమోదైనట్లు రోణంకి కూర్మనాథ్ తెలిపారు. ఎండదెబ్బ తగలకుండా టోపీ, గొడుగు, టవల్, కాటన్ దుస్తులు ఉపయోగించాలి. వృద్ధులు, గర్భిణీలు, బాలింతలు తగిన జాగ్రత్తలు తీసుకుని అప్రమత్తంగా ఉండాలి. చెవుల్లోకి వేడిగాలి వెళ్లకుండా జాగ్రత్త పడాలి. ప్రజలు వీలైనంతవరకు ఇంట్లోనే ఉండాలి, డీహైడ్రేట్ కాకుండా ఉండటానికి ఓఆర్ఎస్ (ఓరల్ రీహైడ్రేషన్ సొల్యూషన్), ఇంట్లో తయారుచేసిన పానీయాలైన లస్సీ, నిమ్మకాయ నీరు, మజ్జిగ, కొబ్బరి నీరు మొదలైనవి తాగాలని సూచించారు. ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో చెదురుముదురుగా.. ఉరుములు, పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉంది. వర్షాలతో పాటు పిడుగులు పడే అవకాశం ఉన్నందున పొలాల్లో పనిచేసే రైతులు, వ్యవసాయ కూలీలు, పశు-గొర్రెల కాపరులు చెట్ల కింద, పోల్స్, టవర్స్ కింద, బహిరంగ ప్రదేశాల్లో ఉండరాదని సూచించారు.

## విశాఖలో 30 మంది అనాథ చిన్నారులకు ఐపీఎల్ మ్యాచ్ చూసే అవకాశం కల్పించిన ఏసిఏ



విశాఖపట్నం (చైతన్యరథం): ఐపీఎల్ లీగ్‌లో భాగంగా సోమవారం వైజాగ్ ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో జరిగిన ఢిల్లీ క్యాపిటల్స్ వర్సెస్ లక్నో సూపర్ జెయింట్స్ క్రికెట్ మ్యాచ్ ను గ్రౌండ్ లో వీక్షించే అవకాశం ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసిఏ) 30మంది అనాథ చిన్నారులకు కల్పించింది. వైజాగ్ లోని పాపా హోమ్ అనాథ శరణాలయానికి 30 టికెట్లు తన సొంత నిధులతో కొని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అందజేసింది. మ్యాచ్ ను వీక్షించేందుకు విచ్చేసిన చిన్నారులకు ఏసిఏ అధ్యక్షుడు ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని), ఏసిఏ కార్యదర్శి రాజ్యసభ ఎంపి సానా సతీష్, ఏసిఏ కోశాధికారి దండమూడి శ్రీనివాస్ చిన్నారులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా కావాల్సిన సదుపాయాలు దగ్గరుండి చూశారు. కాసేపు వారితో సరదాగా కబుర్లు చెప్పారు. తమకు మ్యాచ్ చూసే అవకాశం కల్పించిన ఏసిఏ అధ్యక్షుడు ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) ఆ చిన్నారులు కృతజ్ఞతలు తెలిపారు.

## సాఫ్ట్‌బాల్ క్రీడాభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే కూన

ఆముదాలవలస (చైతన్యరథం): రాష్ట్రంలో సాఫ్ట్‌బాల్ క్రీడాభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని అసోసియేషన్ అధ్యక్షుడు, ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కలిదిండి నరసింహరాజు అధ్యక్షతన ఓ ఫంక్షన్ హాల్‌లో 13 జిల్లాల సాఫ్ట్‌బాల్ సంఘం ప్రతి నిధులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ.. రాష్ట్రంలో ఇప్పటికే గణనీయమైన ఆదరణ కలిగి, అత్యద్భుతమైన ఫలితాలు, ప్రగతి సాధిస్తున్న సాఫ్ట్‌బాల్ గేమ్‌ను మున్ముందు మరింతగా అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. 13 జిల్లాలకు సాఫ్ట్‌బాల్ స్పోర్ట్స్ కిట్లు, క్రీడా దుస్తులు సమకూర్చేందుకు తగిన ఎస్టిమేట్లు సిద్ధం చేయాలన్నారు.

## ఎమ్మెల్యే విజయ్ చంద్ర సమక్షంలో టీడీపీ గూటికి మరో ఇద్దరు వైసీపీ కౌన్సిలర్లు



పార్వతీపురం (చైతన్యరథం): పురపాలక సంఘంలో వైసీపీ పార్టీకి బిగ్ షాక్ తగిలింది మరో ఇద్దరు కౌన్సిలర్లు ఎమ్మెల్యే విజయ్ చంద్ర సమక్షంలో తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. పురపాలక సంఘం 1వ వార్డు,30వార్డులకు చెందిన కౌన్సిలర్లు రణబేరి బంగారు నాయుడు, చిన్నం నాయుడు, వైసీపీ నాయకులు వెంకట్రావు ఎమ్మెల్యే సమక్షంలో తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు నచ్చి ఎమ్మెల్యే విజయ్ చంద్ర నియోజకవర్గ అభివృద్ధికి చేస్తున్న కృషి నచ్చి పార్టీలో చేరుతున్నట్లు పురాభివృద్ధికి తమవంతుగా ముందుకు వచ్చినట్లు కౌన్సిలర్ తెలిపారు ఎమ్మెల్యే విజయ్ చంద్ర పార్టీ కండువాలు వేసి వారిని పార్టీలోకి ఆహ్వానించారు.


## ప్రజా దర్బార్‌కి వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి



విశాఖపట్నం (చైతన్యరథం): వీఎంఆర్‌డీఏ ప్రజాదర్బార్‌కి వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని వీఎంఆర్‌డీఏ చైర్ పర్సన్ ఎం.వి ప్రణవ్ గోపాల్, మెట్రోపాలిటన్ కమిషనర్ విశ్వనాధన్‌లు అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం వి.ఎం.ఆర్.డి.ఎ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్‌కి విశేష స్పందన లభించింది. ఈ ప్రజా దర్బార్‌లో వి.ఎం.ఆర్.డి.ఎ చైర్ పర్సన్ ఎం.వి ప్రణవ్ గోపాల్, కమిషనర్ విశ్వనాధన్‌లు పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వారిద్దరూ మాట్లాడుతూ... ప్రజా దర్బార్‌కు వచ్చిన ఫిర్యాదులు, వినతులు గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. పలుమార్లు కార్యాలయం చుట్టూ తిరగకుండా బాధితులకు న్యాయం చేయాలని సూచించారు. బాధితుల సమస్యలు స్వయంగా విని ఆయా అంశాలపై సంబంధిత అధికారులకి పలు సూచనలు చేశారు. భూముల వ్యవహారాలను మరింత లోతుగా అధ్యయనం చేసి, బాధితులకు సరైన వివరణ ఇవ్వాలని సూచించారు. సోమవారం ప్రజా దర్బార్‌కి మొత్తం ఫిర్యాదులు- వచ్చాయి. వీటిలో - పరిపాలన -, ప్లానింగ్ -, ఎస్టేట్ - విభాగాలకు సంబంధించిన ఫిర్యాదులు అందాయి. సమావేశంలో కార్యదర్శి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## కుడుపూడి సత్తిబాబు ఆధ్వర్యంలో ఘనంగా
# దొమ్మేటి వెంకటరెడ్డి 172వ జయంతి కార్యక్రమం

- ముఖ్య అతిథులుగా పాల్గొని నివాళులర్పించిన టీడీపీ నేతలు
- కష్టకాలంలో పార్టీ కోసం పనిచేసిన నాయకులను సన్మానించిన కుడుపూడి సత్తిబాబు
- శెట్టిబలిజ గౌడ శ్రీశయన యాత ఈడిగ కులాలు సమైక్యతను చాటిన సమావేశం



రాజమహేంద్రవరం (చైతన్యరథం): శెట్టిబలిజ పితామహుడు దొమ్మేటి వెంకటరెడ్డి 172వ జయంతి కార్యక్రమం రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు ఆధ్వర్యంలో స్థానిక లాలాచెరువు జంక్షన్ వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాజమండ్రి నగర శాసనసభ్యులు ఆదిరెడ్డి వాసు, ఆచంట ఎమ్మెల్యే మాజీ మంత్రి పితాని సత్యనారాయణ, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి పాల్గొని దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో కుడుపూడి సత్తిబాబు మాట్లాడుతూ గీత కులాలను ఉపకలాలను ఏకతాటిపైకి తీసుకొచ్చి వారి అభివృద్ధికి కృషి చేసిన దొమ్మేటి వెంకటరెడ్డి జయంతి ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నామన్నారు. తెలుగుదేశం ప్రభుత్వంలో శెట్టిబలిజ గౌడ శ్రీశయన యాత ఈడిగ కులాన్నిటికీ ఒకే కార్పొరేషన్ ఉండేదని జగన్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే కులాలవారీగా కార్పొరేషన్లు విభజించినప్పటికీ మేమంతా కలిసికట్టుగా ఉన్నామనే సందేశాన్ని ఇవ్వడానికే రాష్ట్రమంతా కలిసి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతిపక్షంలో ఉండగా శెట్టిబలిజ మరియు గీత ఉపకలాల సంక్షేమం కోసం అనేక ఉద్యమాలు చేశామని, గీత కార్మికులకు 10 శాతం రిజర్వేషన్ తో ఆగిపోకుండా మద్యం షాపుల్లో 50 శాతం ఫీజు రాయితీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మరియు ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ సహకారంతో సాధించుకున్నామన్నారు. ఆది నుంచి తెలుగుదేశం పార్టీ బీసీలను గుర్తించి రాజకీయంగా ఆర్థికంగా సామాజికంగా ప్రోత్సహిస్తుందని, అందుకే తామంతా తెలుగుదేశం పార్టీతో కొనసాగుతున్నామన్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారిన శెట్టిబలిజల సంక్షేమం కోసం ఆరాటపడింది మాత్రం తెలుగుదేశం మరియు కూటమి ప్రభుత్వాలేనన్నారు. నాడు దొమ్మేటి వెంకటరెడ్డి చేసిన కృషి ఫలితంగానే నేడు శెట్టిబలిజలు అనేక రాజకీయ ఉన్నత పదంలో కొనసాగుతున్నారని తనకి కార్పొరేషన్ చైర్మన్ పదవి రాగానే ఆయన సేవలను స్మరించుకుంటూ రాజమహేంద్రనగరంలో లాలచేరువు సెంటర్ వద్ద విగ్రహం ఏర్పాటు చేసామన్నారు. రోడ్డు పక్కన కళ్ళు అమ్ముకునే స్థాయి నుండి త్వరలో రానున్న నిరా ప్రాజెక్టు ద్వారా షాపుల్లో విక్రయాలు చేసే స్థాయికి గీత కులాలను ప్రోత్సహిస్తున్న తెలుగుదేశం పార్టీకి, ఎన్డీఏ కూటమికి కృతజ్ఞతలు తెలియజేశారు. రాజమండ్రి నగర శాసనసభ్యులు ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ శెట్టిబలిజ మరియు గీత ఉపకలాలకు దిక్సూచిగా ఉన్నటువంటి సంఘసంస్కర్త దొమ్మేటి వెంకటరెడ్డి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఆయన కులానికి సమాజానికి చేసిన సేవలు నేటి తరానికి అందించడం కోసం యువతను ఇటువంటి కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయవలసిన అవసరాన్ని మనందరం గుర్తించాలని తెలిపారు. నేటి తరానికి అవగాహన ఉంటేనే భవిష్యత్తు తరాలు బాగుంటాయని వాస్తవాన్ని దృష్టిలో ఉంచుకొని కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. వైసీపీ ప్రభుత్వంలో శెట్టిబలిజ సామాజిక వర్గం నుండి అనేకమంది ప్రజాప్రతినిధులు ఉన్నప్పటికీ ఈ ప్రాంతంలో రేలంగి మరియు దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహాలను ఏర్పాటు చేసే ఆలోచన కూడా వారు చేయలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వారి ఇరువురి విగ్రహాలను ఏర్పాటు చేసి వేడుక లాగా ప్రారంభోత్సవాలు నిర్వహించామన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రావడానికి బీసీలే వెన్నెముకగా నిలిచారన్నారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు మాట్లాడుతూ శెట్టిబలిజ కులానికి నామకరణం చేసింది వారి అభివృద్ధి కోసం అహర్నిశలు పాటుపడింది, సంపాదించుకున్న ఆస్తులను కూడా దానం చేసి చరిత్రలో నిలిచిన ఘనత దొమ్మేటి వెంకటరెడ్డిదని కొనియాడారు. అటువంటి మహనీయుడి మొట్టమొదటి విగ్రహాన్ని రాజమహేంద్రవరంలో స్థాపించడం అదే స్థానంలో ఈరోజు ఘనంగా జయంతి కార్యక్రమం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఇంట గెలిచి రచ్చ గెలవాలనే మాదిరిగా కులంలో ఎదిగి అనంతరం కులానికి సమాజానికి సేవ చేయాలని అందుకు స్ఫూర్తిని దొమ్మేటి వెంకటరెడ్డి జీవితం మనకు అందిస్తుందని తెలిపారు. మాజీ మంత్రి ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ మాట్లాడుతూ కల్లుగీత కార్మికుల వ్యాపారాలు పోయి ఆర్థికంగా కుటుంబాలు చిదిగిపోతున్న సమయంలో అబ్కారి షాపుల్లో 50% పీజు రాయితీ ఇవ్వడం చిన్న విషయం కాదన్నారు. రానున్న రోజుల్లో అబ్కారి చట్టంలో కూడా మార్పులు తీసుకువచ్చి మరింత మేలు జరిగే విధంగా కూటమి ప్రభుత్వం మంచి కార్యక్రమాలు చేపడుతుందన్నారు. భవిష్యత్ తరాలు బాగుండాలని ఉద్దేశంతో దొమ్మేటి వెంకటరెడ్డి చేసిన కృషికి తగ్గట్టుగా ప్రాంతాలు వేరైనా పనులు వేరైనా గీత కులాలన్నీ ఐకమత్యంగా ఉంటూ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వేమగిరి శ్రీను,బుడ్డిగ రాధ,బుడ్డిగ రవి తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా కుడుపూడి సత్తిబాబు టీడీపీ కష్టకాలంలో అండగా నిలిచిన పలువురు శెట్టిబలిజ,గౌడ ప్రజాప్రతినిధులకు ఆత్మీయంగా సత్కరించారు. సుమారు 500 మంది పేదలకు వస్త్రదానం చేశారు.

# పీ4తో ప్రతి ఇంటికి అభివృద్ధి ప్రతి జీవితానికి ప్రగతి : వనమాడి



కాకినాడ (చైతన్యరథ): రాష్ట్రంలోని అత్యంత వెనుకబడ్డ 20% కుటుంబాలకు సహాయం చేయడానికి, ప్రోత్సహించడానికి, మరియు ప్రగతి వైపు నడిపించేందుకు పేదరిక నిర్మూలన పీ4 అమలు చేయడం జరుగుతుందని, ప్రభుత్వ - ప్రైవేట్ - ప్రజల - భాగస్వామ్యంతో సంఘాలకు సాధికారత కల్పించి, మెరుగైన భవిష్యత్తు నిర్మించడమే ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వ లక్ష్యమని శాసనసభ్యులు కొండబాబు పేర్కొన్నారు. సోమవారం సంజయనగర్ రెవెన్యూ కాలనీ నందు 4 నుండి 13 డివిజన్లు జగన్నాధపురం చర్చిస్కర్ గ్రౌండ్ నందు 14 నుండి 26 డివిజన్లు, సాయంత్రం మెక్లారిన్ స్కూల్ నందు 27 నుండి 37 డివిజన్లు, కొండయ్యపాలెం మున్సిపల్ స్కూల్ నందు 38 నుండి 46 డివిజన్లు గ్రామసభ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ రాష్ట్రంలోని అత్యంత వెనుకబడ్డ 20% కుటుంబాలకు సహాయం చేయడానికి, ప్రోత్సహించడానికి, మరియు ప్రగతి వైపు నడిపించేందుకు రూపొందించబడినదే పీ4 అని, వెనుకబడిన కుటుంబాలను ప్రత్యక్షంగా వారికి మార్గదర్శకత్వం, ఆర్థిక సహాయం, మరియు ఉద్యోగ అవకాశాలను కల్పించే మార్గాలను ఏర్పాటు చేసి వారిని పేదరికం నుండి బయటకు తీసుకురావడానికి కృషి చేస్తాయిని, పీ4 కేవలం దాతృత్వానికి పరిమితం కాకుండా, దీర్ఘకాలిక సాధికారత మరియు భాగస్వామ్య సంపన్నత అనే లక్ష్యాలను నెరవేర్చే విధంగా ప్రోత్సహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో ప్రభుత్వం సమన్వయకర్తగా వ్యవహరించి, సమాజంలోని కుటుంబాలు ఒకరికొకరు సహాయం చేసుకునే విధంగా ఒక స్వయం-నిర్వహణ సామర్థ్యం కలిగిన వ్యవస్థను నిర్మించడానికి సహకరిస్తుందని, ప్రజల అవసరాలను తీర్చడం, భాగస్వామ్యాలను బలోపేతం చేయడం మరియు స్పష్టమైన ఫలితాలను సాధించడం లక్ష్యంగా చేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

# పశు సంపద అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి

- రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలన్న ఎమ్మెల్యే గోరంట్ల



రాజమహేంద్రవరం (చైతన్యరథం): పశు సంపద అభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుందని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి పేర్కొన్నారు. మండల కేంద్రమైన కడియం ఏరియా వెటర్నరీ హాస్పిటల్ నందు ఆంధ్రప్రదేశ్ పశుగణాభివృద్ధి సౌజన్యంతో ఏర్పాటు చేసిన లేగ దూడల ప్రదర్శన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అసందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ... ప్రభుత్వ పశు సంపద అభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని, పశు వుకు పశు భీమా గొర్రెలకు ఏప్రియల్ నెలలో నట్టల నివారణ మందుల పంపిణీ కార్యక్రమం జరుతుందని, ఈ నెలలో గాలి కుంటు వ్యాధి వ్యాధి నివారణ టీకాలు చేయడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలో సెక్స్ సార్టెడ్ సెమన్ ద్వారా కేవలం పెయ్యి దూడలు జన్మించే వీర్యకణాలు నాళికలను రైతులకు అందుబాటులో ఉంచటం జరిగిందని, దీని వల్ల నాణ్యమైన పెయ్యి దూడలు ఉత్పత్తి అవుతాయని, దీనిని సధ్వినియోగం చేసుకోవాలని పాడి రైతులను కోరారు. లేగ దూడల ప్రదర్శనలో పాల్గొన్న దూడలలో బాగా పోషించిన రైతులకు మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులు ప్రధానం తోపాటుగా, పాడి రైతులకు పాల క్యాన్లు, మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎం.పి.పి వెలుగుబంటి వెంకట సత్య ప్రసాద్ , సర్పంచ్ మోసిగంటి సత్యవతి, ఉప సర్పంచ్ వెలుగుబంటి రఘురామ్, మాధవరాయుడుపాలెం సర్పంచ్ అన్నందేవుల వీర వెంకటసత్యన్నారాయణ (చంటి), మార్గాని సత్యనారాయణ, బొరుసు సుబ్రమణ్యం, చిక్కాల ఈశ్వరరావు, చిలుకూరి నాగేశ్వరరావు, పాతూరి రాజేష్, జల్లి కృపారావు, కాయల సత్యనారాయణ, గోరు నాగేశ్వరరావు, దొంతంశెట్టి శ్రీను, గ్రీన్ ల్యాండ్ బాబి, పశుసంవర్ధక శాఖ ఉపసంచాలకులు డా. ఎం.వెంకటేశ్వర్లు, సహాయ సంచాలకులు డా.జి.రవి వర్మ, ప్రాంతీయ పశువైద్యశాల, డా. జె.ఎస్.ఆర్.ఆర్. కిరణ్-వి.డి. జేగురుపాడు, డా.పి. వెంకట రావు-వి.డి కూటమి ప్రభుత్వ మండల నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ నూతన బస్సులను ప్రారంభించిన ఎమ్మెల్యే సత్యానందరావు



కొత్తపేట (చైతన్యరథం): రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో రావులపాలెం బస్ డిపో కు నూతనంగా సమకూర్చిన రెండు అల్ట్రా డీలక్స్ బస్సులను కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికుల సౌకర్యార్థం ఈ బస్సులను సాలూరు,భద్రాచలం రూటుకు కేటాయించారని తెలిపారు.అలాగే త్వరలో రెండు వెన్నెల ఏసీ స్లీపర్ బస్సులు కూడా అందుబాటులోకి రానున్నాయని చెప్పారు.ఈ కార్యక్రమంలో గుత్తుల రాంబాబు, జక్కంపూడి వెంకటస్వామి,మైగపుల గురవయ్య నాయుడు,నందం సత్యనారాయణ, ధరణాల రామకృష్ణ, కోట వెంకటేశ్వరరావు మరియు కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఈనెల 27న చంద్రబాబు పోలవరం పర్యటన



పోవలరం (చైతన్యరథం): ఏలూరు జిల్లా పోలవరం మండలం పోలవరం ప్రాజెక్టులో పనులు పరిశీలించేందుకు ఈనెల 27న ముఖ్యమంత్రి చంద్రబాబు రానున్నారు. ఈ మేరకు ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ విక్టరీ సెల్వి పరిశీలించారు. జలవనరు శాఖ అధికారులతో కలిసి ప్రాజెక్ట్ నిర్మాణ ప్రాంతాలలో సందర్శించారు. పలుచోట్ల పనులు జరుగుతున్న ప్రాంతాల్లో వివరాలతో ఉన్న ఫొటో, ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఎండల తీవ్రత దృష్టిలో ఉంచుకుని తాగునీటి సరఫరా చేయాలన్నారు. పనులు జరిగే ప్రాంతాల్లో జిల్లా అధికారులను నోడల్ అధికారులుగా నియమిస్తున్నామన్నారు. ముందుగా కలెక్టర్ ఎగువ కాపర్ డ్యామ్, డయాఫ్రమ్ వాల్, గ్యాప్ వన్, గ్యాప్ టూ పనులను పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటన ప్రదేశాలను ప్రాజెక్ట్ ఎస్సీ కే రామచంద్రరావు వివరించారు. కలెక్టర్ వెంట జేసీ ధాత్రి రెడ్డి, ఆర్డీవో యు.వి. రమణ, అడిషనల్ ఎస్పీ నక్క సూర్యచంద్రరావు, తదితరులు ఉన్నారు.

## బ్రాహ్మణ భవనానికి రూ.2 లక్షలు సాయం అందించిన చీఫ్ విప్ జీవీ



వినుకొండ (చైతన్యరథం): నియోజకవర్గంలో నిర్మాణంలో ఉన్న బ్రాహ్మణ భవనానికి ప్రకటించిన మేరకు రూ. 2 లక్షలు విరాళం అందజేసిన చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు వారికి వ్యక్తిగతంగా, ప్రభుత్వపరంగా కూడా అన్నివిధాల అండగా నిలుస్తామని కూడా హామీ ఇచ్చారు. వారి అపరకరమల సత్రానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ద్వారా రూ. 25 లక్షలు నిధులు తీసుకొచ్చి, పనులు పూర్తి చేసేందుకు కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. అలాగే వేద పాఠశాల, గాయత్రీనగర్ అభివృద్ధికి అండదండలుగా ఉంటామన్నారు. సోమవారం వినుకొండలోని చీఫ్ విప్ కార్యాలయంలో తనను కలిసిన బ్రాహ్మ ణ సంఘాలతో ఆప్యాయంగా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు జీవీ. అనంతరం ఆయన మాట్లా డుతూ రాష్ట్రంలో ఎప్పుడూ లేనివిధంగా కూటమి ప్రభుత్వంలో, ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవతో బ్రాహ్మణ సంక్షేమం కోసం చర్యలు తీసుకుంటున్నామన్నారు. 2014 ఎన్నికల్లో హామీ ఇచ్చిన మేరకు అధికారంలోకి రాగానే బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేశామని.. ఈ దఫా అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వారి సంక్షేమం, అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామ న్నా రు. ఆ క్రమంలోనే బ్రాహ్మణ సంఘ అభివృద్ధి కోసం జరుగుతున్న భవన నిర్మాణానికి కావాల్సిన అనుమతులు కూడా వేగంగా వచ్చేలా ఆర్డీవో, తహసీల్దార్‌లతో మాట్లాడతానని తెలిపారు. అలానే గాయత్రీనగర్‌లో ఇల్లు కట్టాలి అనుకున్న వాళ్లు హౌసింగ్ లోన్‌లు, ప్రభుత్వం తరఫున గృహ నిర్మాణ సాయం అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. గృహనిర్మాణ శాఖ అధికారులతో మాట్లాడటం కూడా జరిగిందన్నారు. స్థలం, ఇల్లు లేని పేద బ్రాహ్మణులకు టిడ్కో ఇళ్లు ఇచ్చేలా చూస్తామని కూడా ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. తమ వినతులపై సానుకూలంగా స్పందించిన చీఫ్ విప్ జీవీకి ఈ సందర్భంగా బ్రాహ్మణ సంఘ పెద్దలు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం తరఫున పీవీ సురేష్ బాబు, జీవీ రమణరావు, కేసనపల్లి సుబ్బారావు, గాలి శ్రీనివాసరావు, జి.మాధవరావు, బొగ్గరం బుచ్చిరాజు, సీహెచ్ భవాని శంకర్, బి.రవికుమార్, జనార్ధన చార్యులు, శ్రీనివాస్ శర్మ, వి.చంద్రశేఖర్, రఘు మాస్టర్, గాలి శ్రీ కృష్ణయ్య, మంత్రిరాజు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## పీ-4 విధానానికి శ్రీకారం చుట్టింది : మాజీమంత్రి ప్రత్తిపాటి



చిలకలూరిపేట (చైతన్యరథం): ప్రభుత్వం ఉగాదినాడు ప్రారంభించబోయే పీ-4 విధానంతో పేదల జీవితాలు ఆర్థికంగా బాగుపడతాయని, అట్టడుగు వర్గాల ఆర్థిక పరిపుష్టికోసమే చంద్రబాబు దేశంలో ఎక్కడా లేని నూతన విధానాన్ని రాష్ట్రంలో ప్రారంభించబోతున్నారని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. సోమవారం ఆయన పట్టణంలోని 36, 37 వార్డుల్లో అధికారులు, కౌన్సిలర్లు ఏర్పాటు చేసిన పీ-4 విధివిధానాలకు సంబంధించిన వార్డుసభల నిర్వహణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీమంత్రి అక్కడ జరుగుతున్న పీ-4 లబ్ధిదారుల కుటుంబాల ఎంపికను స్వయంగా పరిశీలించి, సభను ఉద్దేశించి మాట్లాడారు. పేదరికం లేని సమాజం కోసం చంద్రబాబు ఏవిధంగా తపనపడుతున్నారో ప్రతి ఒక్కరూ ఆలోచించాలని, మంచిమనసుంటే మార్గం ఉంటుందని ప్రత్తిపాటి సూచించారు. పూర్ టూ రిచ్ విధానం అంటే పేదల్ని ధనికుల్ని చేయడమేనని, దానికోసం ఆర్థికంగా స్థితిమంతులైన వారు పేదవర్గాలకు అవసరమైన విద్య, వైద్యం, ఉపాధి కల్పనకు తమవంతు సహాయ సహకారాలు అందించాలని పుల్లారావు కోరారు. ప్రతి కౌన్సిలర్ తమ తమ వార్డుల్లోని పేద కుటుంబాల పూర్తిసమాచారం సేకరించాలని, ఆ వివరాలను.. ఆయా కుటుంబాల స్థితిగతులను అదేవార్డుల్లో ఉండే ధనికులు, పారిశ్రామికవేత్తలు, సామాజిక బాధ్యత ఉన్నవారికి తెలియచేసి, వారి సహాయసహకారాలు పేద కుటుంబాలకు అందేలా చూడాలని పుల్లారావు సూచించారు. గ్రామ, వార్డు స్థాయి నుంచే ఈ చేయూత ప్రక్రియ ఒక పద్ధతి ప్రకారం జరగాలన్నారు. సంపాదనాపరులైన పారిశ్రామికవేత్తలు, విద్యావంతులు, ధనికులు సామాజిక సేవలో భాగస్వాములు కావాలని, కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్ బిలిటీని బాధ్యతగా భావించి, రాష్ట్ర అభివృద్ధిలో పాలుపంచుకోవాలని ప్రత్తిపాటి కోరారు. సమర్ధవంతమైన ప్రభుత్వం అధికారంలో ఉన్నందున రాష్ట్ర భవిష్యత్ గురించి ప్రతి ఒక్కరూ ఆలోచన చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పతి శ్రీహరి, జనసేన ఇన్చార్జి తోట రాజా రమేష్, వైస్ చైర్మన్ గోల్డ్ శ్రీను, టీడీపీ నాయకులు షేక్ టీడీపీ కరీముల్లా, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు పఠాన్ సమాధ్ ఖాన్, మద్దుమలా రవి, కౌన్సిలర్ లు, మున్సిపల్ అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ సభ్యత్వ కార్డుల పంపిణీ



సత్తెనపల్లి (చైతన్యరథం): కుటుంబ సాధికార సారదులను ఏర్పాటు చేసి పార్టీ బలోపేతం దిశగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. ప్రతి 60 మంది ఓటర్లకు ఒక సారథి ఉంటారని. వారికి ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను తెలియజేయడంతో పాటు పార్టీ బలోపేతానికి కుటుంబ సాధికార సారథులు కృషి చేయాలన్నారు. సోమవారం టీడీపీ సభ్యత్వకార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ హెూదాల్లో వున్న రాష్ట్ర జిల్లా నియోజకవర్గ పట్టణ మండల గ్రామ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు : డేగల ప్రభాకర్



గుంటూరు (చైతన్యరథం): పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉండే ముస్లిం సోదరుల కోసం ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందు ఆత్మీయత మత సామరస్యానికి ప్రతీక అని ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డేగల ప్రభాకర్ అన్నారు. సోమవారం సుద్దపల్లిడొంక నాగలక్ష్మి నాగర్‌లో బషీద్ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో డేగల ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డేగల ప్రభాకర్ మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో పాటించే ఉపవాస దీక్షలు ఎంతో భక్తి శ్రద్ధలతో పాటిస్తారని, అల్లా ఆశీస్సులు ఎల్లప్పుడూ అందరికీ ఉండాలని కోరారు. పవిత్రమైన రంజాన్ మాసంలో చిన్నపిల్లల నుంచి మొదలుకొని వృద్ధుల వరకు కఠోర నియమాలతో ఉపవాస దీక్షలు చేయడం గొప్ప విషయం అన్నారు. రంజాన్ మాసం మతసామారాస్యానికి ప్రతికగా నిలుస్తుందన్నారు. ఇఫ్తార్ విందులతో సోదరభావం పెంపొంది, ప్రజల మధ్య ఐక్యత పెరుగుతుందన్నారు. అల్లా ఆశీస్సులతో ప్రతి ఒక్కరూ సుఖశాంతులతో ఉండాలని ప్రభాకర్ ఆకాంక్షించారు. ముస్లిం సోదరులకు ముందస్తుగా రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

## తాగునీటి సమస్య లేకుండా ప్రత్యేక చర్యలు

● రూ.1.97 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



గుంటూరు (చైతన్యరథం): నియోజకవర్గంలో తాగునీటి సమస్య లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకోబోతున్నట్లు ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. సోమవారం గుంటూరు 21, 28వ డివిజన్‌లలో రూ. 1.97 కోట్ల అభివృద్ధి పనులకు మాధవి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఎండా, వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజలకు ఇబ్బందులు లేకుండా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. వైసీపీ పాలనలో నగరాభివృద్ధిని ఏమాత్రం పట్టించుకోలేదని, చుట్టుగుంటలో ఒక బైక్ షో రూం వద్ద కల్వర్టు ఏర్పాటు కోసం గుంతలను అష్ట వంకరులు తిప్పి పీకలవాగులో కలిపేశారని, దీంతో లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయని అన్నారు. గతలో ఈ సమస్యను గుర్తించి, పరిష్కార మార్గాలు అన్వేషించగా ఈ లైనును పొడిగించడమే పరిష్కారంగా భావించామని, నేడు 21వ డివిజన్‌లో దాదాపు రూ. 1.26 కోట్లతో రెండు కల్వర్టులను నిర్మిస్తామన్నారు. 28వ డివిజన్‌లో రూ. 71లక్షలతో సీసీ రోడ్లు నిర్మాణంతో పాటుగా... ఏటి అగ్రహారం వద్ద కూడా డ్రైనేజీ సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తున్నామని అన్నారు. రాబోయే వర్షాకాలంని దృష్టిలో ఉంచుకొని రోడ్లు డ్రైన్లు మరియు సిల్టేషన్ పనుల మీద దృష్టి సారించామని పేర్కొన్నారు.

రాజకీయ నిరుద్యోగిగా మారిన విడదల రజనీ

"వైసీపీ లేకుండా చేయాలని కూటమి ప్రభుత్వం చూస్తుందని వైసీపీ నేత విడదల రజనీ మాట్లాడటం అశ్చర్యంగా ఉందని, రజనీ వ్యాఖ్యలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఈ రాష్ట్రంలోనే వైసీపీ అనే పార్టీనే లేకుండా చేయాలనే ఉద్దేశంతోనే ప్రజలు ఏపక్షంగా 11 సీట్లకు పరిమితం చేశారనే విషయాన్ని రజనీ తెలుసుకుంటే మంచిదని గళ్ళా మాధవి వ్యాఖ్యానించారు. విడుదల రజనీకి అన్యాయం జరిగితే న్యాయస్థానానికి వెళ్లి తేల్చుకోవాలి తప్ప, కూటమి ప్రభుత్వం ఏదో అన్యాయం చేసిందని అసత్య ప్రచారం చేయడం మానుకోవాలన్నారు. అవినీతిపరులు, చట్టానికి వ్యతిరేకంగా వ్యవహరించిన వారు చట్టం ముందు దోషులుగా నిలబడాలని, రెడ్‌బుక్ తన పని తాను చేసుకొని పోతుందన్నారు. మేము కక్షపూరిత రాజకీయాలకు పాల్పడదలచుకుంటే వైసీపీ నేతలు ఎవరు రోడ్లమీద తిరిగేవారు కాదని ఎమ్మెల్యే గళ్ళా మాధవి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చిన్న మస్తాన్ వలి (నన్నే), అప్పారావు యాదవ్, యం.ధారు నాయక్, శ్రీకాంత్, మామిడి రామారావు, చెరుకూరి తిరుపతిరావు, కసుకుర్తి హనుమంతురావు తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే అరవింద బాబు



నరసరావుపేట పట్టణంలో 25వ వార్డు ఎన్జీవో కాలనీలోని కోడెల పార్క్ నందు స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్పెషల్ శానిటైజేషన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ కార్యక్రమనికి నరసరావుపేట శాసనసభ్యులు చదలవాడ అరవింద బాబు పాల్గొని పార్క్‌లోని చెత్తను ఊడ్చి, చెత్తను ఎత్తివేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి ముచ్చటించారు. చదువుతో పాటు ఆటలు కూడా ఆడాలని చిన్నారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు పాల్గొన్నారు.

## సభ్యత్వ కార్డులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే కాగిత



పెడన (చైతన్యరథం): తెలుదేశంపార్టీ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ కార్డులను నాయకులకు, యూనిట్ ఇన్‌ఛార్జ్‌లకు, బూత్ ఇన్‌ఛార్జ్‌లకు నియోజవర్గం ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... నియోజకవర్గంలో నా గెలుపు కోసం పోరాడిన నాయకులకు, కార్యకర్తలకు రుణపడి ఉంటాను. ప్రపంచంలోనే మొట్ట మొదటి సారిగా పార్టీ సభ్యత్వాన్ని ప్రవేశ పెట్టిన పార్టీ తెలుగుదేశం పార్టీ అని అన్నారు. నారా లోకేష్ ఆలోచనతో కార్యకర్తలకు భరోసా కల్పించాలని సభ్యత్వం పొందిన కార్యకర్తకు బీమా సౌకర్యం కల్పించామని అన్నారు. పేద కార్యకర్తలకు ఆర్థిక సాయం అందించి, కార్యకర్తల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ కార్యకర్త పార్టీ అధినాయకత్వం భావిస్తోందన్నారు. నియోజకవర్గంలో అన్ని బూత్‌లలో కుటుంబ సాధికార కమిటీలను ఏర్పాటు చేసుకుని ప్రజలకు పార్టీకి వారధిగా పని చేయాలని ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ కోరారు.

# యువత బలోపేతం కావాలి

**డీజీ ఎంపవర్ ఇండియా బ్రోచర్ ఆవిష్కరించిన మంత్రి ఆనం రామనారాయణరెడ్డి**

నెల్లూరు, (చైతన్యరథం): అన్ని రకాల వ్యాపారాలు స్టార్టప్ కంపెనీలకు అవసరమైన టెక్నాలజీని అందించడంతో పాటు, వారు ఎదుర్కొంటున్న సమస్యలు కు పరిష్కారం చూపాలనే ఉద్దేశంతో చంద్రకాంత్ రెడ్డి డీజీ ఎంపవర్ ఇండియా అనే సంస్థను నెల్లూరులో నెలకొల్పుతున్నారు. రాష్ట్ర దేవాదయ,ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి నివాసంలో జరిగిన కార్యక్రమములో ఆ కంపెనీకి సంబంధించిన బ్రోచర్‌ను విడుదల చేశారు. సందర్భంగా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ నూతనంగా ప్రారంభిస్తున్న ఈ సంస్థ ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈసంస్థ ఫౌండర్ చంద్రకాంతి రెడ్డిని ఆశీర్వదించారు.

ఈ కార్యక్రమములో తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి చేజర్ల వేంకటేశ్వర రెడ్డి, తెలుగుదేశం పార్టీ ముదిరాజ్ సాధికార సమితి రాష్ట్ర కన్వీనంపీఎల్ రావు తదితరులు పాల్గొన్నారు.




# సర్వమత శ్రేయోభిలాషి శ్రీకాళహస్తి ఎమ్మెల్యే

**- దగ్గరుండి నమాజ్‌కు సౌకర్యాలు కల్పించిన బొజ్జల**



శ్రీకాళహస్తి, (చైతన్యరథం): ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఎంతో పవిత్రమైన రంజాన్ మాసంలో ముస్లిం సోదరులు బొజ్జల కుటుంబం చల్లగా ఉండాలని "అల్లాని దువా" చేస్తాం శ్రీకాళహస్తిలో ఈదులగుంట ఈద్గా మైదానంలో. ముస్లింలకు పవిత్రమైన "నమాజ్ వాల్" కట్టించడం ముళ్లపదలతో నిండి ఉన్న స్థలాన్ని క్లీన్ చేసి ఇవ్వడం జరిగింది. అలాగే పాడు పడిపోయిన విధంగా ఉన్న షాదీ మహలను అందంగా రంగులతో. లైటింగ్‌తో సిమెంట్ మరమ్మతులు చేయించిఇవ్వడం జరిగింది. గతంలో మాజీ మంత్రివర్యులు బొజ్జల గోపాలకృష్ణారెడ్డి హయాంలో ముస్లిం సోదరులకు 2ఈద్గా స్థలాలు. 4షాదీ మహల్. బర్రెల గ్రౌండ్ కాంపౌండ్ వాల్స్. ఈద్గా కాంపౌండ్ వాల్స్. అనేక అభివృద్ధి జరిగింది. ఆ తర్వాత గతంలో రాజకీయ నాయకులు ముస్లిం సోదరులుకు పట్టించుకున్న దాఖలు లేవు. ఆయన తనయుడు ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ముస్లింల అభివృద్ధి కోసం అసెంబ్లీలో ముస్లిమ్స్ బాధల గురించి స్పీకర్ కు ముఖ్యమంత్రివర్యులు చంద్రబాబునాయుడుకి. నారా లోకేష్ గారికి. మైనారిటీ మంత్రి ఫరూక్‌కు ఈద్గా, షాదీ మహల్. గురించి అనేక ఇబ్బందుల గురించి వివరించడం జరిగింది. ముస్లిమ్స్ ఇబ్బందుల గుర్తించిన ఏకైక వ్యక్తి మా ఎమ్మెల్యే అని అభివృద్ధి పనులు జరిపించడం శ్రీకాళహస్తి ముస్లిం సోదరులకు ఆనందంగా ఉండాలని ఈ రంజాన్ నెలలో ఆయన పేరుతో ప్రతి ముస్లిం సోదరుడు అల్లాను దువా చేస్తామని ఆయన చల్లగా ఉండాలని కోరుకుంటామని ఆకాంక్షించారన్నారు. ఈ పర్యవేక్షణ కార్యక్రమంలో. రాష్ట్ర మైనార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి. షాకీర్ అలీ. జామియా మసీద్ అధ్యక్షులు.బీఎస్, అక్రం సాహెబ్, గవర్నమెంట్ ఖాజీ, మున్నా సాహెబ్, హఫీజ్,ంహనా, పట్టణ మైనార్టీ అధ్యక్షులు. షఫీ. మాజీ కోపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్. ఖాదర్ బాషా, ఖలీల్ భాషా16వ వార్డు అధ్యక్షుడు. మీర్జా. ఐ టిడిపి.ఖాదర్, 17వార్డు బూత్ ఇంచార్జ్ సాజిద్, ఆరిఫ్, అంజద్ భాష,తాజుద్దీన్, రషీద్, నయీమ్, జావిద్, తదితర మైనార్టీ నాయకులు ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

# పార్టీ బలోపేతానికి పాటు పడండి

**- టీడీపీ శ్రేణులకు ఎరిక్సన్ బాబు పిలుపు**



యర్రగొండపాలెం, (చైతన్యరథం): పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన త్రిపురాంతకం మండల పార్టీ శ్రేణుల సమావేశంలో యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్-చార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కుటుంబ సాధికార సారథులను ఏర్పాటు చేసి పార్టీ బలోపేతం దిశగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని కేడర్‌కు పిలుపునిచ్చారు. ప్రతి 60 మంది ఓటర్లకు ఒక సారధి ఉంటారని వారికి ప్రభుత్వ కార్యక్రమాలను తెలియజేయడంతో పాటు పార్టీ బలోపేతానికి సారథి కృషి చేస్తారని ఎరిక్సన్ బాబు తెలిపారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని కోరారు. ప్రతి కార్యకర్తకు తాను అందుబాటులో ఉంటానని, కార్యకర్తకు ఏ కష్టం వచ్చిన ముందుండి ఆదుకుంటానని ఎరిక్షన్ బాబు కేడర్‌కు ధైర్యం అందించారు. కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు న్యాయం చేకూర్చడమే లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో త్రిపురాంతకం మండల టీడీపీ అధ్యక్షులు మేకల వలరాజు యాదవ్, ముఖ్య నాయకులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇంచార్జ్‌లు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# విద్యామంత్రి ఆదేశాలతో ప్రతి తరగతికి ఓ ప్రత్యేక గది

**- మంత్రి నారాయణ వెల్లడి**



నెల్లూరు, (చైతన్యరథం): విద్యా శాఖ మంత్రి లోకేష్ సూచనలతో ప్రతి తరగతి కి ప్రత్యేక గది ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని పురపాలక శాఖామంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ వెల్లడించారు. రెండు రోజులుగా ఆయన నెల్లూరు నగరంలో సుడి గాలి పర్యటన జరుపుతున్నారు. నగరంలోని రామ్మూర్తినగర్, సూబేధార్‌పేట, సంతపేట లో సోమవారం పర్యటించారు. భానుడి తొలి కిరణాల స్పర్శకు ముందే మంత్రి నారాయణ ప్రజలను ఆత్మీయంగా పలకరిస్తున్నారు. మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలు సందర్శిస్తున్నారు. అదనపు వసతులు గురించి ఆరా తీస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ పాఠశాలలను మోడల్ స్కూల్స్‌గా తీర్చిదిద్దుతామన్నారు. తమది మాటల ప్రభుత్వం కాదన్నారు. చేతల ప్రభుత్వమని ఉద్ఘాటించారు. రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీలలో పార్కుల అభివృద్ధి, జిమ్ ఎక్విప్మెంట్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రెండవసారి మంత్రి అయినప్పటికీ, తనను తొలిసారిగా ఎమ్మెల్యేను చేసిన నెల్లూరు సిటీని అభివృద్ధికి మారుపేరుగా తీర్చిదిద్దుతానన్నారు. నగరంలోని నెల్లూరులోని మున్సిపల్ పాఠశాలలను ది బెస్ట్‌గా నిలబెడతానన్నారు. ప్రజల అవసరాలను నేరుగా వారి ద్వారానే తెలుసుకునే ప్రయత్నం చేస్తానని నారాయణ పేర్కొన్నారు.

# బీజేపీ నేతకు టీడీపీ ఎమ్మెల్యే పరామర్శ

**- నాయకులతో తరలివెళ్లిన పులివర్తి నానీ**

చంద్రగిరి, (చైతన్యరథం): పాకాల పంచాయతీ లోని మందలపు వెంకటాద్రి బాబు, మోహన్‌లను మండల నాయకులతో కలిసి చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానీ పరామర్శించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఆరోగ్య పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. మండల నాయకులు వెంకటాద్రి బాబు, మోహన్‌లను వారి ఇండ్లకు వెళ్లి పరమర్శించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఆరోగ్య పరిస్థితి పై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో కూటమి ప్రభుత్వం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# కొండెపి డ్రెయిన్‌కు త్వరలో మోక్షం

**- కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి**

- **రైతులకు పట్టాలు మంజూరు చేయిస్తాను**
- **సొంత నిధులతో వాటర్ ప్లాంట్**
- **త్వరలో ప్రతి గ్రామంలో త్రీ ఫేస్ కరెంట్**
- **తుమ్మల పెంట రోడ్డుకు నిత్యం అడ్డంకులు సృష్టిస్తున్నారు**
- **సూపర్ సిక్స్ పథకాలన్నీ అమలు**

కావలి, (చైతన్యరథం): కొత్తసత్రం గ్రామంలో పట్టాలు లేక ఇబ్బందులు పడుతున్న 500 మంది రైతులకు త్వరలో పట్టాలు మంజూరు చేయిస్తానని కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి తెలిపారు. సోమవారం కావలి రూరల్ మండలం కొత్తసత్రం గ్రామంలో ఎమ్మెల్యే పర్యటించారు. గ్రామ ప్రజలను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ గత పదేళ్లుగా 500 మంది రైతుల అనుభవంలో ఉన్న పొలాలకు పట్టాలు ఇవ్వలేదని, పొలాలు ఇచ్చి పట్టాలు ఇవ్వకపోవడంతో ఏ పథకానికి వారు అర్హులు కాలేకపోవడం చాలా బాధాకరమన్నారు. ఈ విషయమై తహసీల్దార్, జిల్లా కలెక్టర్ లతో మాట్లాడి తక్షణం పట్టాలు వచ్చేలా కృషి చేస్తానని తెలిపారు. గ్రామంలోని స్కూల్ విద్యార్థులకు అలాగే గ్రామ ప్రజలకు అనువుగా ఉండే స్థలంలో సొంత నిధులతో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తానని తెలిపారు.




నియోజకవర్గంలోని గ్రామాల్లో త్రీ ఫేస్ కరెంట్ ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని, పనులు జరుగుతున్నాయని తెలిపారు. గ్రామాల్లో నిరంతరం విద్యుత్ ఉండేలా చూస్తామని తెలిపారు. గ్రామంలో సిమెంట్ రోడ్ల కోసం రూ. 60 లక్షలు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. తుమ్మలపెంట రోడ్డు కు నిత్యం అడ్డంకులు సృష్టిస్తున్నారని, ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా రోడ్డు పూర్తి చేయడం తథ్యమని తెలిపారు. రూ. 52 కోట్లతో కొండేపి డ్రెయిన్ కు త్వరలో మోక్షం కలగనుందని తెలిపారు. నీటిని సరిగ్గా సద్వినియోగం చేసుకోవాలనే ఉద్దేశ్యంతో ఆయకట్టును స్థిరీకరించాలని ఇటీవల అసెంబ్లీ లో మాట్లాడటం జరిగిందని అన్నారు. రాష్ట్రం బాగుకోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రోజుకు 18 గంటలు పని చేస్తున్నాడని తెలిపారు. చంద్రబాబు సహకారంతో కావలి నియోజకవర్గంలో భారీగా పరిశ్రమలు రానున్నాయని, యువతకు భారీగా ఉద్యోగాలు లభించనున్నాయని తెలిపారు. ఇల్లు లేని ప్రతి ఒక్కరికీ ఇల్లు మంజూరు చేయిస్తానని, ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వం రూ. 3 లక్షలు ఇవ్వడం కూడా జరుగుతుందని తెలిపారు. సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా మే నెలలో తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలు ప్రారంభం కానున్నాయని తెలిపారు. ఉచిత బస్సు పై ఇతర రాష్ట్రాల్లో అధ్యయనం జరుగుతుందని, త్వరలోనే మహిళల కు ఉచిత బస్సు ప్రయాణం లభిస్తుందని తెలిపారు. ఎమ్మెల్యేగా కాకుండా, కావలిని కాపుకాసే సేవకుడిగా నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉన్నానని, ఎలాంటి సమస్యలు ఉన్నా తెలియజేస్తే పరిష్కరిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కావలి రూరల్ మండల అధ్యక్షులు ఆవుల రామకృష్ణ, జనసేన నాయకుడు సిద్దు, రాష్ట్ర బీసీ సాధికార సమితి సభ్యుడు సోమయ్య గారి రమణ, విక్రమ్ రెడ్డి, మస్తాన్, పులి రమేష్, కొండూరు తిరుపతి, ఉప్పాల దినేష్, రవీంద్ర, తాతయ్య, చిట్టిబాబు, శ్రీనివాసులు, గ్రామ కాపులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు..

# ధీర వనిత.. హోం మంత్రి అనిత

## అనంతపురంలో ఘనంగా జన్మదిన వేడుకలు తెలుగుమహిళ చరిత ఆధ్వర్యంలో సందడి

అనంతపురం, (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ హోం శాఖ మంత్రి, తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత జన్మదిన వేడుకలు అనంతపురం నగరంలో ఘనంగా నిర్వహించారు. అనంతపురం నగర తెలుగు మహిళా నాయకురాలు చరిత ఆధ్వర్యంలో 45వ డివిజన్ నందు జన్మదిన వేడుకలు నిర్వహించారు. 45వ డివిజన్ స్థానిక మహిళలు,



డ్వాక్రా మహిళలతో కలిసి కేక్ కట్ చేసి హోం మంత్రి అనితకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా తెలుగుమహిళా నాయకురాలు చరిత మాట్లాడుతూ ప్రభుత్వ ఉపాధ్యాయురాలుగా జీవిత మొదలుపెట్టి హోం మంత్రి స్థాయికి ఎదిగిన అనిత ఎంతోమంది మహిళలకు ఆదర్శంగా నిలస్తోందన్నారు. తెలుగుదేశం పార్టీ మహిళలకు ప్రాధాన్యత ఇస్తుందనడానికి హోంమంత్రి అనిత రాజకీయ జీవితమే నిదర్శనం అన్నారు. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మహిళలకు ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారని, మహిళాభివృద్ధి కోసం పాటు పడుతున్నారని తెలిపారు. తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలుగా మహిళల కోసం వంగలపూడి అనిత అనేక పోరాటాలు చేసిందన్నారు. ఈ పోరాటాల ఫలితమే అనితను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హోం మంత్రిగా చేసిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారధ్యంలో హోం మంత్రిగా అనిత మహిళా సంక్షేమం కోసం శక్తి యాప్ లాంటి అనేక చట్టాలను తీసుకువచ్చిందన్నారు. అనంతపురం నగర మహిళల తరపున హోంమంత్రి వంగలపూడి అనితకు చరిత జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

# అకాల వర్షానికి నేలకొరిగిన అరటి పంట

## చూసి చలించిపోయిన మంత్రి సవిత



పెనుకొండ, (చైతన్యరథం): యల్లనూరు మండలం గొడ్డుమర్రి గ్రామ పంచాయతీ పరిధిలోని రైతు క్రిష్ణంనాయుడు పొలంలో అకాల వర్షానికి నెలకొరిగిన అరటి పంటను మంత్రి సవిత సోమవారం పరిశీలించారు. కార్యక్రమంలో పాల్గొన్న జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, జిల్లా ఉద్యాన శాఖ అధికారి నరసింహారావు, పులివెందుల ఆర్డీఓ చెన్నయ్య, ఎపిఎంఐపి పిడి రఘునాథరెడ్డి, ఉద్యాన శాఖ అధికారి ఉమాదేవి, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# పేదల ఆరోగ్యానికే ప్రాధాన్యత : ఎమ్మెల్యే ముత్తుముల

గిద్దలూరు, (చైతన్యరథం): ఆనారోగ్య పరిస్థితులతో ఆర్థికంగా సతమతమవుతున్న పేద ప్రజలకు ముఖ్యమంత్రి సహాయ నిధి" ఒక భరోసానిస్తుందని అని గిద్దలూరు ఎమ్మెముత్తుముల అశోక్ రెడ్డి పేఎర్కొన్నారు. ఆర్థిక సమస్యలతో ఆరోగ్య చికిత్సకు ఇబ్బంది పడుతున్న పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి 4వ విడతలో సుమారు రూ. 23,89,836-00 లక్షల రూపాయలు మంజూరు చేయించారు. సోమవారం ఉదయం గిద్దలూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే అశోక్ రెడ్డి లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద ప్రజలకు ఎటువంటి ఆరోగ్య సమస్య వచ్చిన ఎన్డీయే ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.




# విద్యుత్ టవర్ల నిర్మాణానికి భూమి పూజ

## - ఎమ్మెల్యే బాలకృష్ణ ఆదేశాల అమలు



హిందూపురం,(చైతన్యరథం): ఎమ్మెల్యే, పద్మభూషణ్ నందమూరి బాలకృష్ణ ఆదేశాల మేరకు పట్టణంలో 60 అడుగుల విద్యుత్ టవర్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారని శాసన సభ్యులు బాలయ్య ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు వేగవంతం అవుతాయని మున్సిపల్ చైర్మన్ డి ఈ రమేష్ కుమార్ పేర్కొన్నారు. ఇప్పటికే రైల్వేస్టేషన్ రోడ్ లో 70 అడుగుల రోడ్డు వెడల్పు అనుగుణంగా 60 అడుగుల ఎత్తుతో టవర్లు నిర్మాణం పూర్తి చేయనున్నామని పేర్కొన్నారు. ప్రస్తుతం స్థానిక బైపాస్ రోడలో 60 అడుగుల ఎత్తు తో విద్యుత్ టవర్లు నిర్మాణానికి మున్సిపల్ కార్యాలయం ముందు బైపాస్ రోడ్డులో చైర్ పర్సన్ డిఈ రమేష్ కుమార్, సంఘం శ్రీనివాసులు, ఎలక్రికల్ డీఈ భూపతి, ఎంఎల్ఏ వ్యక్తిగత కార్యదర్శి బాలాజీ తదితరులు భూమిపూజ చేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీడీపీ అధ్యక్షులు వద్దేఅంజన్నప్ప కౌన్సిలర్లు రాఘవేంద్ర, సతీష తదితరులు పాల్గొన్నారు.

# రంజాన్ కోసం ప్రత్యేక ఏర్పాట్లు

## ఎమ్మెల్యే దగ్గుపాటి ఆదేశాలు
## డ్రైవర్స్ కాలనీలోని ఈద్గాలో అన్ని వసతులు కల్పించండి
## వేలాది మంది ముస్లిం సోదరుల ప్రార్థనలకు ఏర్పాట్లు

అనంతపురం, (చైతన్యరథ,): అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆదేశాల మేరకు పవిత్ర రంజాన్ పండుగ కోసం ఈద్గాలలో అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. డ్రైవర్స్ కాలనీలో ప్రతి రంజాన్ కు ఇక్కడ వేలాది మంది ముస్లింలు తరలివచ్చి ప్రత్యేక ప్రార్థనలు చేస్తుంటారు. ఈ నేపథ్యంలో ఈద్గా మైదానంలో అన్ని వసతులతో కూడిన ఏర్పాట్లను చేస్తున్నారు. రంజాన్ సందర్భంగా ఇప్పటికే మసీదులు, ఈద్గాలలో ఎలాంటి అసౌకర్యాలు లేకుండా చూడాలని మున్సిపల్ అధికారులను ఎమ్మెల్యే దగ్గుపాటి ఆదేశించారు. ఇప్పుడు రంజాన్ సమీపిస్తుండటంతో ఈద్గాలలో జరుగుతున్న పనులను ఆయన ఫోన్ ద్వారా పర్యవేక్షిస్తున్నారు. నీటి వసతితో పాటు అక్కడ అంబులెన్స్ ఇతర వసతులు కల్పించాలని ఆదేశించారు. ఇందులో భాగంగా టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి సరిపూటి రమణ, టీడీపి నాయకుడు మణికంఠ బాబు, జిల్లా మైనార్టీ నాయకుడు జేఎం బాషా, సైఫుద్దీన్, రజాక్, కలందర్ మాజీ మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు మున్వర్ తదితరులు ఈ ఏర్పాట్లను పరిశీలించారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ప్రత్యేక చొరవ తీసుకోవడం పట్ల వారు కృతజ్ఞతలు చెప్పారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఇక్కడ ఏర్పాట్లు చేస్తున్నారని మైనార్టీ నాయకులు తెలిపారు. తాము అడగకనే మైనార్టీల మీద అభిమానంతో ఎమ్మెల్యే దగ్గుపాటి ఇలా ఎన్నో కార్యక్రమాలు చేస్తున్నారని నాయకులు పేర్కొన్నారు.



# కాంగ్రెస్ వైపు జగన్ రెడ్డి చూపు

## రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత
## బయటపడుతున్న వైసీపీ అక్రమాలు
## చట్ట ప్రకారమే కేసులు నమోదు
## రాష్ట్రంలో క్రీడలకు ప్రాధాన్యత



పెనుకొండ, (చైతన్యరథం): జిల్లాకు సంబంధించి జగన్ ప్రభుత్వంలో జరిగిన స్కామ్‌లు, భూ కబ్జాలు బయటకు వస్తున్నాయని, తప్పు చేసిన అక్రమార్కులందరూ చట్ట ప్రకారం శిక్షకు గురికాకతప్పదని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత స్పష్టంచేశారు. రాష్ట్రంలో వైసీపీ చీటీ చిరిగిపోయిందని, కాంగ్రెస్ వైపు జగన్ చూస్తున్నారని తెలిపారు. పట్టణంలో రూ.10 లక్షలతో ఏర్పాటు చేయనున్న ఓపెన్ జిమ్‌కు మంత్రి సోమవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా తనను కలిసిన విలేకరులతో మాట్లాడారు. జగన్ హయాంలో జరిగిన అక్రమాలు, స్కామ్ లు ఒక్కొక్కటిగా వస్తున్నాయనన్నారు. అక్రమాలకు పాల్పడిన వారందరూ చట్టపరంగా శిక్షకు గురికాతప్పదన్నారు. జిల్లాలోనూ భూ కబ్జాలు, స్కామ్ లు జరిగాయని, వాటిని వెలికితీసే పనిలో ప్రభుత్వం ఉందని అన్నారు. తప్పులు చేయకుంటే భయమెందుకని, అక్రమార్కులకు పాల్పడిన వారే భయపడతారని అన్నారు. గత జగన్ ప్రభుత్వంలో తమ పార్టీ కార్యకర్తలపై అక్రమంగా కేసులు నమోదు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. తన క్రషర్ లో తానే దొంగతనం చేసినట్లు తప్పుడు కేసు పెట్టిన విషయాన్ని మంత్రి సవిత గుర్తు చేశారు. తమ ప్రభుత్వంలో అక్రమాలకు, స్కామ్ లకు పాల్పడేవారిపైనే చట్టపరంగా దర్యాప్తు నిర్వహించి, కేసులు నమోదు చేస్తున్నారన్నారని తెలిపారు.

### ఆడుదాం ఆంధ్రాలో భారీ అక్రమాలు


గత జగన్ ప్రభుత్వ హయాంలో నిర్వహించిన ఆడుదాం ఆంధ్రాలో భారీ అక్రమాలు చోటుచేసుకున్నాయని మంత్రి సవిత ఆరోపించారు. కొద్ది రోజులుగా ఆడుదాం ఆంధ్రాలో చోటు చేసుకున్న అవకతవకలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయని మంత్రి తెలిపారు.

### కాంగ్రెస్ గేటు వైపు జగన్ చూపు

రాష్ట్రంలో వైసీపీ చీటీని ప్రజలు చింపేశారని, ఇదే విషయం జగన్‌కు కూడా తెలుసని మంత్రి సవిత ఎద్దేవా చేశారు. బెంగుళూరులో ఉంటూ వారానికి రెండ్రోజులు వచ్చి, హడావుడి చేసి వెళ్లిపోతున్నారన్నారు. తన పార్టీ క్లోజ్ అయిపోయిందన్న విషయం జగన్ అర్థమైందని, కాంగ్రెస్‌లోకి పోవడానికి ఆ పార్టీ గేటు వైపు ఆశగా చూస్తున్నారని తెలిపారు.

### రాష్ట్రంలో క్రీడలకు అధిక ప్రాధాన్యం

పెనుకొండలో మూడు జిమ్ లు ఏర్పాటుకు సీఎం చంద్రబాబునాయుడు, రాష్ట్ర క్రీడల మంత్రి రాంప్రసాద్ రెడ్డి అనుమతిచ్చారని మంత్రి సవిత తెలిపారు. దీనిలో భాగంగా రూ.10 లక్షలతో ఓపెన్ జిమ్ ఏర్పాటుకు భూమి చేసినట్లు తెలిపారు. ఆరోగ్యకర సమాజంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని సీఎం చంద్రబాబునాయుడు నమ్మకమన్నారు. అందుకే రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి అధిక ప్రాధాన్యమిస్తున్నారన్నారు. అంతర్జాతీయ క్రీడల్లో రాష్ట్రం తరఫున క్రీడాకారులు రాణించాలనేది సీఎం చంద్రబాబు లక్ష్యమన్నారు. ఇటీవల ఏపీ లెజిస్లేటర్ స్పోర్ట్స్ మీట్ ఇందుకు ఉదాహరణ అని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగానూ జిల్లాలో స్పోర్ట్స్ మీట్ లు నిర్వహించాలని తమ ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.



# ఎంపీల వేతనాలు పెంపు

న్యూఢిల్లీ: పార్లమెంటు సభ్యులకు ప్రతి నెలా అందే వేతనాలు, పెన్షన్లను కేంద్రం పెంచింది. ద్రవ్యోల్బణ సూచీ ఆధారంగా ఎంపీల జీతాన్ని దాదాపు 24శాతం మేర పెంచుతూ పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ సోమవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో ఒక్కో ఎంపీ వేతనం నెలకు రూ.లక్ష నుంచి రూ.1.24లక్షలకు పెరగనుంది. అలాగే, సిట్టింగ్ సభ్యుల రోజువారీ భత్యాన్ని రూ.2వేల నుంచి 2,500కు పెంచుతున్నట్లు పేర్కొంది. మాజీ పార్లమెంటు సభ్యులకు ప్రస్తుతం ఇస్తున్న పెన్షన్‌ను రూ.25వేల నుంచి రూ.31 వేలకు పెంచుతున్నట్లు నోటిఫికేషన్లో వెల్లడించింది. పెంచిన ఈ వేతనాలను 2023, ఏప్రిల్ 1 నుంచి వర్తింపజేస్తున్నట్లు తెలిపింది.

# నాగ్‌పూర్ అల్లర్ల నిందితుడి ఇంటిపైకి బుల్డోజర్

## నివాసం, ఇతర నిర్మాణాలు కూల్చివేత



నాగ్‌పూర్: మహారాష్ట్రలోని నాగ్‌పూర్లో ఇటీవల చెలరేగిన హింసకు కారణమైన కీలక నిందితుడు ఫహీమ్ ఖాన్‌కు చెందిన అక్రమ నిర్మాణాలపై ఆ రాష్ట్ర ప్రభుత్వం బుల్డోజర్ ఆపరేషన్ చేపట్టింది. సోమవారం ఉదయం అతడి నివాసం, ఇతర నిర్మాణాలను నాగ్‌పూర్ మున్సిపల్ శాఖ అధికారులు కూల్చివేశారు. ఈ అక్రమ నిర్మాణాలపై ఇప్పటికే నోటీసులు జారీ చేశామని.. నిబంధనలకు విరుద్ధంగా నిర్మించినందువల్ల వీటిని కూల్చివేశామన్నారు. కాగా మైనారిటీ డెమోక్రటిక్ పార్టీ నగర అధ్యక్షుడిగా పనిచేస్తున్న ఫహీమ్ సామాజిక మాధ్యమం ద్వారా తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసి ఘర్షణలకు కారణమయ్యాడన్న ఆరోపణలతో పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. ఈ నెల 17న నాగ్‌పూర్ లో కొందరు మతపరమైన వ్యాఖ్యలు చేయడంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ చెలరేగింది. మతపరమైన వస్తువులు దహనం చేసినట్లు కొంతమంది సోషల్ మీడియా వేదికగా తప్పుడు వదంతులు వ్యాప్తి చేయడంతో ఈ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నట్లు అధికారులు పేర్కొన్నారు. దీనికి కారణమైన ఫహీమ్ సహా ఆరుగురిపై దేశద్రోహం కేసును నమోదు చేశారు. 50 మంది నిందితులపై సైబర్ విభాగం నమోదు చేసిన నాలుగు ఎఫ్ఐఆర్‌ల్లో వీరి పేర్లు ఉన్నాయి. ఇప్పటివరకు 200 మంది నిందితులను గుర్తించామని, మరో వెయ్యి మందిని సీసీ టీవీ కెమెరాల ద్వారా గుర్తించే పనిలో ఉన్నామని ఓ సీనియర్ పోలీసు అధికారి వెల్లడించారు. ఇలాఉంటే మహారాష్ట్రలో ఉన్న మొగల్ చక్రవర్తి ఔరంగజేబు సమాధిని తొలగించాలని డిమాండ్లు వినిపిస్తున్న నేపథ్యంలో శంభాజీనగర్ లోని 18వ శతాబ్దానికి చెందిన ఆయన స్మారకానికి ఇరువైపుల భారత పురావస్తుశాఖ (ఏఎస్ఐ) ఇనుప రేకులను, కంచెను ఏర్పాటుచేసింది.

## సుంకాలపై ఆందోళన వేళ..

# భారత్‌కు అమెరికా వాణిజ్య ప్రతినిధి



న్యూఢిల్లీ: సుంకాలపై ఆందోళన చెలరేగుతున్న సమయంలో అమెరికా వాణిజ్య ప్రతినిధి బ్రెండన్ లించ్ భారత్ పర్యటనకు వస్తున్నారు. బ్రెండన్ లించ్ ఈ నెల 25 నుంచి 29వ తేదీ వరకు భారత్‌లో పర్యటించనున్నట్లు విదేశాంగ శాఖ అధికారులు పేర్కొన్నారు. భారత్ అధిక సుంకాలు విధిస్తోందని, ఏప్రిల్ 2 నుంచి ప్రతీకార సుంకాలు తప్పవంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరిస్తున్న విషయం తెలిసిందే. ఇతర దేశాలతో ట్రంప్ వాణిజ్య యుద్ధాలను కొనసాగిస్తున్న వేళ ఆ దేశానికి చెందిన వాణిజ్య ప్రతినిధి భారత్‌లో పర్యటించడం ప్రాధాన్యత సంతరించుకుంది. దక్షిణ, మధ్య ఆసియాకు అమెరికా సహాయ వాణిజ్య ప్రతినిధిగా ఉన్న బ్రెండన్ లించ్, అమెరికా అదికారుల బృందంతో కలిసి భారత్ రానున్నారని.. ఐదు రోజుల పర్యటనలో భాగంగా ఇరుదేశాల మధ్య వాణిజ్యం, సుంకాల అమలు, మొదలైన విషయాల గురించి కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ సహా ఇతర భారత అధికారులతో చర్చలు జరపనున్నారని అధికారిక వర్గాలు పేర్కొంటున్నాయి. లెవీలు, మార్కెట్ యాక్సెస్‌కు సంబంధించిన సమస్యలను పరిష్కరించే పలు ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాల గురించి కూడా మాట్లాడుకోనున్నట్లు వెల్లడించాయి.

భారతదేశంతో పెట్టుబడి, వాణిజ్య సంబంధాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడానికి నిబద్ధతతో ఉన్నామని.. త్వరలో భారత అధికారులతో చర్చలు జరపడానికి ఎదురు చూస్తున్నామని బ్రెండన్ లించ్ పేర్కొన్నట్లు అంతర్జాతీయ మీడియా వర్గాలు వెల్లడించాయి. ట్రంప్ సుంకాల విధింపునకు మరికొద్ది రోజులే గడువున్న నేపథ్యంలో సుంకాలు సంబంధిత సమస్యల పరిష్కారానికి ప్రయత్నాలు చేస్తున్నామని భారత్ పేర్కొంది. ఇరువురికీ ప్రయోజనకరమైన వాణిజ్య ఒప్పందం కోసం ఓ ఫ్రేమ్ వర్క్ రూపకల్పనకు అమెరికాతో సంప్రదింపులు చేస్తున్నామని తెలిపింది. దీనిపై విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ మాట్లాడుతూ.. పరస్పరం ప్రయోజనం చేకూరే వాణిజ్య ఒప్పందం కోసం అమెరికా యంత్రాంగంతో వివిధ స్థాయిల్లో సంప్రదింపులు జరుపుతున్నాం. వీటిని ముందుకు తీసుకెళ్లే ప్రక్రియలో ఇరు దేశాలు నిమగ్నమై ఉన్నాయి. వాణిజ్యాన్ని విస్తరించడం, మార్కెట్ యాక్సెస్, సుంకాల తగ్గింపు, సప్లయి-చైన్ సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ఇవి కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

# విద్యార్థుల ఆత్మహత్యల నివారణకు నేషనల్ టాస్క్ ఫోర్స్

## - సుప్రీంకోర్టు ఆదేశం



న్యూఢిల్లీ: విద్యాసంస్థల్లో విద్యార్థుల ఆత్మహత్యలపై సుప్రీం కోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఇటీవల ఐఐటీ-ఢిల్లీలో ఇద్దరు విద్యార్థులు ఆత్మహత్య చేసుకోవడబానికి గల కారణాలపై విచారణ చేపట్టాలని పోలీసులను జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ ఆర్ మహదేవన్లతో కూడిన ధర్మాసనం ఆదేశించింది. ఉన్నత విద్యాసంస్థల్లో విద్యార్థుల మానసిక ఆరోగ్య సమస్యలను పరిష్కరించేందుకు, ఆత్మహత్యలను నివారించేందుకు 'నేషనల్ టాస్క్ ఫోర్స్ 'ను ఏర్పాటు చేయాలని అధికారులకు న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది.

విద్యార్థుల భద్రత, శ్రేయస్సు కోసం చర్యలు తీసుకునే బాధ్యత ప్రతి విద్యాసంస్థపై ఉంది. క్యాంపస్ పరిధిలో ఆత్మహత్య వంటి ఏదైనా దురదృష్టకర సంఘటన జరిగినప్పుడు యాజమాన్యం వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చి.. ఎఫ్ఐఆర్ నమోదు చేయాలి. అది వారి ప్రాథమిక విధి. దీనికి పోలీసులు కూడా సరైన సమయంలో స్పందించి వేగంగా చర్యలు తీసుకోవాలని ధర్మాసనం పేర్కొంది. విద్యార్థులు మానసిక కుంగుబాటు, ఒత్తిడికి లోనవ్వకుండా వివిధ కార్యక్రమాలు నిర్వహించడం, సామాజిక సంస్థలతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం మొదలైన చర్యలు చేపట్టాలని సూచించింది. ఇటీవల కాలంలో విద్యార్థుల్లో తీవ్రమవుతున్న ఒత్తిడి, మానసిక సమస్యలను వారు ఎవరికీ చెప్పుకోలేని పరిస్థితుల్లో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని కోర్టు పేర్కొంది. వాటికి దారితీసే అంతర్గత కారణాలను నివారించడానికి సరైన మార్గదర్శకాలను రూపొందించాల్సిన సమయం వచ్చిందని అభిప్రాయం వ్యక్తం చేసింది. విద్యార్థుల మానసిక ఆరోగ్య సమస్యలను పరిష్కరించడానికి, ఉన్నత విద్యా సంస్థల్లో ఆత్మహత్యలను నివారించడానికి జాతీయ టాస్క్ ఫోర్సు ఏర్పాటు చేయాలని ఆదేశించింది. ఈ విభాగానికి సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఎస్ రవీంద్ర భట్ నాయకత్వం వహిస్తారని పేర్కొంది. అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలోని విద్యశాఖ ఉన్నతాధికారులను ఇందులో భాగం చేయాలని అధికారులను ఆదేశించింది.

# నిశిరాత్రిలో..ప్రకృతి ఒడిలో!

## కుక్రైల్ నైట్ సఫారీ ఏర్పాటుకు యూపీ సర్కార్ సన్నాహాలు

లక్నో: చిమ్మచీకటిలో ప్రకృతిలో ప్రయాణిస్తూ.. రాత్రివేళల్లో వన్యప్రాణులు, ముఖ్యంగా నిశాచర జీవులను వాటి సహజ ఆవాసంలో తిలకించే అనుభూతే వేరు. సరిగ్గా ఇలాంటి అనుభూతినే పర్యాటకులకు అందించేందుకు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం సిద్ధమవుతోంది. కుక్రైల్ నైట్ సఫారీ, అడ్వెంచర్ పార్క్ పేరిట దేశంలోనే తొలిసారి ఈ తరహా పార్క్ ఏర్పాటుకు ముందుకొచ్చింది. పర్యటక అభివృద్ధితోపాటు పచ్చదనం పెంపు, వన్యప్రాణుల సంరక్షణే లక్ష్యంగా రూ.1500 కోట్లతో రెండు దశల్లో దీన్ని అభివృద్ధి చేయనుంది. వచ్చే నెలలో పనులు ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తోంది.

ప్రఖ్యాత సింగపూర్ నైట్ సఫారీ స్ఫూర్తితో యూపీ ప్రభుత్వం 850కు పైగా ఎకరాల్లో ఈ ప్రాజెక్టు చేపడుతోంది. లక్నోలో కుక్రైల్ రక్షిత అటవీ ప్రాంతం సమీపంలో దీన్ని అభివృద్ధి చేయనుంది. జీవవైవిధ్యానికి పేరుపొందిన ఈ ప్రాంతం.. వివిధ రకాల వృక్ష జీవజాలానికి నిలయంగా ఉంది. రూ.631 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న తొలి దశ పనుల్లో భాగంగా నైట్ సఫారీ, అడ్వెంచర్ పార్కుకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, ఎన్‌క్లోజర్ల ఏర్పాటు, పర్యాటకులకు సౌకర్యాలు వంటివాటిపై దృష్టి సారించనున్నారు. 24 నెలల్లో పనులు పూర్తవుతాయని భావిస్తున్నారు.

# అలహాబాద్ హైకోర్టుకు జస్టిస్ వర్మ బదిలీ

## - సుప్రీంకోర్టు కొలీజియం నిర్ణయం



న్యూఢిల్లీ: ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ అధికారిక నివాసంలో భారీఎత్తున నోట్ల కట్టలు బయటపడినట్లు వచ్చిన వార్తలు సంచలనం సృష్టించిన నేపథ్యంలో జస్టిస్ వర్మ వ్యవహారంలో సుప్రీంకోర్టు కొలీజియం సోమవారం కీలక నిర్ణయం తీసుకుంది. ఆయనను అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేయాలని సిఫారసు చేసింది. దీనిపై కేంద్రం ఆమోదం లభించాక తుది ప్రకటన వెలువడనుంది. ఇటీవల న్యాయమూర్తి అధికార నివాసంలో అగ్నిప్రమాదం జరగడంతో.. ఆర్పేందుకు వెళ్లిన సిబ్బందికి అనుకోకుండా అక్కడ భారీగా నోట్ల కట్టలు దర్శనమిచ్చినట్లు వార్తలు రావడంతో సుప్రీంకోర్టు కొలీజియం ఈ అంశంపై అత్యవసరంగా విచారణ ప్రారంభించింది. జస్టిస్ యశ్వంత్ వర్మను అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేసే ప్రక్రియను ప్రారంభించినట్లు ఇదివరకే పేర్కొంది. అయితే ఆ నిర్ణయంపై కొలిజియంలోని కొందరు సభ్యుల నుంచి వ్యతిరేకత వ్యక్తమైంది. జస్టిస్ యశ్వంత్ వర్మ ఇంట్లో అగ్నిప్రమాదం సందర్భంగా పోలీసులు తీసిన వీడియోలో కాలిన నోట్ల కట్టలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఆ వీడియోను పోలీస్ కమిషనర్ .. ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దేవేంద్రకుమార్ ఉపాధ్యాయకు సమర్పించగా, ఆయన దానిని తన నివేదికలో పొందుపరిచి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నాకు అందించారు. దీనిపై సుప్రీంకోర్టు అసాధారణ నిర్ణయం తీసుకుంది. శనివారం రాత్రి నివేదిక మొత్తాన్ని ఫొటోలు, వీడియోలతో సహా తన వెబ్‌సైట్లో పెట్టింది. వెబ్‌సైట్లో పెట్టిన ఆ వీడియోలో కాలిన నోట్ల కట్టలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. శనివారమే ఈ వ్యవహారంపై ముగ్గురు న్యాయమూర్తులతో విచారణ కమిటీని సీజేఐ ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఆ కమిటీ విచారణ సాధ్యమైనంత త్వరలో ప్రారంభం కానుంది. అయితే ఈ కమిటీకి నిర్ణీత గడువేమీ విధించలేదు.

ఇదిలా ఉంటే.. సోమవారం ఢిల్లీ హైకోర్టు రిజిస్ట్రీ కీలక ప్రకటన చేసింది. ఆయనను న్యాయపరమైన విధులకు దూరంగా ఉంచుతూ నిర్ణయం తీసుకుంది. తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు అది అమల్లో ఉంటుందని తెలిపింది. కానీ ఇంతలోనే కొలీజియం ఆయనను అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేస్తూ నిర్ణయం తీసుకుంది.

జస్టిస్ వర్మ మాత్రం తనపై వచ్చిన ఆరోపణలను ఖండించారు. ఢిల్లీ హైకోర్టు సీజేకు ఇచ్చిన సమాధానంలో ఆయన ఈ మేరకు స్పష్టం చేశారు. తాను గానీ, తన బంధువులు గానీ ఎటువంటి నోట్ల కట్టలను గదిలో ఉంచలేదని తెలిపారు. తన ప్రతిష్టను దెబ్బతీసేందుకు జరిగిన కుట్రగా దీనిని పేర్కొన్నారు. తమ నగదు ఉపసంహరణలు బ్యాంకుల ద్వారానే జరుగుతాయని, తాము యూపీఐ యాప్‌లను వాడతామని, కార్డులతో లావాదేవీలు జరుపుతామని వివరించారు. తాము ఆ గదిని.. సాధారణంగా ఉపయోగంలో లేని ఫర్నిచర్, సీసాలు, క్రాకరీ, పరుపులు, కార్పెట్లు, పాత స్పీకర్లు, గార్డెనింగ్ వస్తువులను ఉంచడానికి వాడతామని తెలిపారు. జస్టిస్ వర్మపై వచ్చిన ఆరోపణలను సుప్రీంకోర్టు మాజీ జడ్జి జస్టిస్ మార్కండేయ కట్జు తోసిపుచ్చారు. మూడు తరాలుగా ఆయన కుటుంబం గురించి తనకు తెలుసని పేర్కొన్నారు.

# ఎఫ్-1 వీసాలకు భారీ కత్తెర

## - దశాబ్దకాలంలో దాదాపు రెట్టింపు కోత




అమెరికా వెళ్లి చదువుకోవాలన్న కలలు కల్లలుగానే మిగిలిపోయే రోజులు వస్తున్నాయా? చాలా దేశాలనుంచి ఏటా ఎంతోమంది విద్యార్థులు చదువుకోసం అగ్రరాజ్యానికి వెళ్తున్నట్టు.. భవిష్యత్‌లో వెళ్లే అవకాశాలు ఉండవా? విద్యార్థి వీసాల సంఖ్యకు అమెరికా సర్కారు వేస్తోన్న భారీ కత్తెర చూస్తుంటే -ఔననే చెప్పాల్సి వస్తోంది. గడచిన ఏడాదిలో ఏకంగా 41శాతం వీసా దరఖాస్తులను తిరస్కరించింది అమెరికా. దశాబ్దం క్రితంతో పోలిస్తే ఎఫ్-1 వీసాల తిరస్కరణ దాదాపు రెట్టింపైంది. అమెరికా విదేశాంగ శాఖ గణాంకాల ప్రకారం.. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఎఫ్-1 వీసాల కోసం 6.79 లక్షల దరఖాస్తులు రాగా.. ఇందులో 2.79 లక్షల దరఖాస్తులను అధికారులు తిరస్కరించారు.

అంతకుముందు 2022-23 ఆర్థిక సంవత్సరంలో 6.99 లక్షల దరఖాస్తుల్లో 2.53 లక్షల (36శాతం) అప్లికేషన్లకు అధికారులు ఆమోదం తెలపలేదు. 2013-14 ఆర్థిక సంవత్సరంలో 7.69 లక్షలమంది విద్యార్థి వీసాల కోసం దరఖాస్తు చేసుకోగా.. 1.73లక్షల (23శాతం) అప్లికేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. నాటితో పోలిస్తే గతేడాది సంఖ్య దాదాపు రెట్టింపు. అయితే, దేశాలవారీగా తిరస్కరణకు గురైన వారి సంఖ్యను అమెరికా వెల్లడించలేదు. కానీ, గతేడాది డిసెంబరు 9 నాటి వరకు ఉన్న గణాంకాల ప్రకారం.. 2024 సంవత్సరం తొలి 9 నెలల్లో భారతీయ విద్యార్థులకు ఎఫ్-1 వీసాలు 38శాతం తగ్గినట్టు తెలిసింది. కొవిడ్ తర్వాత భారతీయ విద్యార్థులకు వీసాలు ఈ స్థాయిలో తగ్గడం ఇదే తొలిసారి. బ్యూరో ఆఫ్ కాన్సులర్ అఫైర్స్ నెలవారీ నివేదికల డేటా ప్రకారం.. 2024 జనవరినుంచి సెప్టెంబరు మధ్య 64 వేలమంది భారతీయ విద్యార్థులకు ఎఫ్-1 వీసాలను జారీ చేశారు. అంతకుముందు 2023 ఇదే సమయంలో ఈ సంఖ్య 1.03 లక్షలుగా ఉండటం గమనార్హం.

### ఏంటీ ఎఫ్-1 వీసా?

ఎఫ్-1 వీసా అనేది నాన్- ఇమిగ్రెంట్ వీసా. ప్రపంచవ్యాప్తంగా ఉన్న విద్యార్థులు అమెరికాలో ఫుల్ టైమ్ విద్యను అభ్యసించేందుకు ఈ వీసా అనుమతినిస్తుంది. అగ్రరాజ్యంలోని విద్యా సంస్థలు ఏటా రెండుసార్లు ప్రవేశాలను అనుమతిస్తాయి. ఆగస్టు- డిసెంబర్ సెమిస్టర్ సమయంలోనే మన విద్యార్థులు అధికంగా వెళ్తుంటారు.

# అది.. పరమ చెత్త చిత్రం

## ఆర్టిస్టు ముసలిదైందంటూ ట్రంప్ సెటైర్



అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆహార్యం విషయంలో చాలా శ్రద్ధ చూపిస్తారు. ఇటీవల ఆయనకు ఓ చిత్రం ఆగ్రహం తెప్పించింది. పైగా దానిని రాష్ట్ర గవర్నర్ చట్టసభలో అలంకరించడాన్ని ఆయన తట్టుకోలేక పోయారు. సోషల్ మీడియా వేదికగా ఆ చిత్రాన్ని తొలగించాలని సూచించారు. అంతేకాదు.. సదరు గవర్నర్ ఉద్దేశపూర్వ కంగా అలాంటి దానిని అక్కడ ఏర్పాటుచేశారని ఆరోపించారు. ఈమేరకు ఆయన ట్రూత్ సోషల్ పోస్టు చేశారు. "ఎవరూ తమ చెత్త ఫొటోలు, చిత్రాలను ఇష్టపడరు. కానీ, కొలరాడో స్టేట్ క్యాపిటల్ భవనంలో మిగిలిన అధ్యక్షుల చిత్రాలతోపాటు నాది అలాంటిది ఏర్పాటుచేశారు. నా భవిష్యత్తులో కూడా అంత చెత్త చిత్రాన్ని చూడనేమో. దానిని ఉద్దేశపూర్వకంగానే ఏర్పాటుచేశారు. అదే ఆర్టిస్ట్ అధ్యక్షుడు ఒబామా చిత్రాన్నీ అద్భుతంగా గీసింది. కానీ నా చిత్రం అత్యంత చెత్తగా ఉంది. బహుశ, ఆమె వృద్ధురాలు కావడంతో.. తన ప్రతిభను కోల్పోయినట్లుంది. అక్కడ జరిగే ఏ కార్యక్రమంలో అయినా నా ఫొటో లేకపోయినా ఏమీ అనుకోను కానీ.. ఇలాంటిది మాత్రం ఉంచటాన్ని ఇష్టపడను. కొలరాడో నుంచి చాలామంది ఫోన్లు చేసి ఫిర్యాదు చేస్తున్నారు" అని మండిపడ్డారు. అంతేకాదు.. ఆ రాష్ట్ర ర్యాడికల్ లెఫ్ట్ గవర్నర్ జారెడ్ పోలిస్‌కు క్రైంను అదుపుచేయడం రాదని ఎద్దేవా చేశారు. ముఖ్యంగా మాదక ద్రవ్యాల గ్యాంగులను ఆయన అదుపు చేయలేకపోతున్నారని విమర్శించారు. అయితే తాము వారి బారినుంచి కాపాడతామని ట్రంప్ పేర్కొన్నారు. ఆ చిత్రాన్ని తొలగించాలని కోరారు. వాస్తవానికి ఆ చిత్రాన్ని 2019లో తొలిసారి ఆవిష్కరించినట్లు డెయిలీ మెయిల్ పత్రిక పేర్కొంది. దీనిని సారా బోర్డ్మన్ అనే ఆర్టిస్టు గీసింది. ఆమె 2012లో అధ్యక్షుడు జార్జి డబ్ల్యూ బుష్ చిత్రాన్ని కూడా గీసింది. ఇక శ్వేతసౌధంలో ట్రంప్ చాలా మార్పులు చేస్తున్న సంగతి తెలిసిందే. ఈసందర్భంగా ఆయన ఫొటోలను బంగారం ఫ్రేములతో ఏర్పాటు చేయించారు. ఇక తన మగ్‌షాట్‌కు కూడా అక్కడ ఉంచారు.

# ఆగని మరణమృదంగం!



గాజాలో మరణ మృదంగం మోగుతూనే ఉంది. శనివారం రాత్రినుంచి ఇజ్రాయెల్ నిర్వహిస్తున్న దాడుల్లో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. దీంతో ఇజ్రాయెల్-హమాస్ యుద్ధంలో ఇప్పటివరకు 50,021 మంది పాలస్తీనియన్ల ప్రాణాలు కోల్పోయినట్టు గాజా ఆరోగ్యశాఖ వెల్లడించింది. 1.13 లక్షలమంది గాయపడినట్లు తెలిపింది. 2023 అక్టోబరు 7న హమాస్- ఇజ్రాయెల్ మధ్య యుద్ధం ప్రారంభమైన సంగతి తెలిసిందే. ఖాన్ యూనిస్ నగరంపై ఆదివారం ఇజ్రాయెల్ నిర్వహించిన దాడిలో హమాస్ కీలక నేత సలాహ్ అల్ బర్దావీల్ (66) మృతి చెందారు. ఆయన భార్య కూడా ఈ దాడిలో ప్రాణాలు కోల్పోయారు. ఖాన్ యూనిస్ శరణార్థి శిబిరంలో జన్మించిన బర్దావీల్.. హమాస్ సీనియర్ నేత యాహ్యా సిన్వర్‌కు సన్నిహితుడు. హమాస్ రాజకీయ విభాగానికి నాయకుడు కూడా. ఇజ్రాయెల్ దాడుల్లో సిన్వర్, ముస్తాహాలు చనిపోయినప్పటి నుంచి బర్దావీలే హమాస్‌లో కీలకనేతగా వ్యవహరిస్తున్నారు.

గాజానుంచి పాలస్తీనియన్లను తరలించేందుకు కొత్త డైరెక్టరేట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ఇజ్రాయెల్ ప్రకటించింది. దీనికి ఆ దేశ మంత్రిమండలి శనివారం ఆమోదం తెలిపింది. గాజానుంచి పాలస్తీనియన్లు జోర్డాన్, ఈజిప్టు తదితర దేశాలకు శాశ్వతంగా తరలివెళ్లాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల ప్రతిపాదించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇజ్రాయెల్.. ఇందుకోసం ఒక డైరెక్టరేట్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించడం గమనార్హం.

# అమెరికాది దుందుడుకు చర్య

## - ఉషా వాన్స్ పర్యటనపై గ్రీన్‌ల్యాండ్ ప్రధాని



అమెరికా అధ్యక్ష కార్యవర్గంలోని కీలక అధికారులు, సెకండ్ లేడీ ఉషా వాన్స్ తమ దేశంలో అనధికారిక పర్యటనకు రానుండటాన్ని గ్రీన్‌ల్యాండ్ తప్పుబట్టింది. దానిని ఓ దుందుడుకు చర్యగా అభివర్ణించింది. ఈమేరకు ప్రధాని మూట్ బి ఎగీడ్ ఓ ఇంటర్వ్యూలో కీలక వ్యాఖ్యలు చేశారు. ఇక అమెరికా జాతీయ భద్రతా సలహాదారు వాల్ట్ పర్యటనపై కూడా ఆయన అభ్యంతరం వ్యక్తంచేశారు. "అమెరికా భద్రతా సలహాదారు గ్రీన్ ల్యాండ్‌లో ఏం చేస్తున్నారు. మాపై శక్తి ప్రదర్శనకే వస్తున్నారు. ఆ పర్యటనతో ట్రంప్ ప్రణాళికలపై అమెరికన్లకు నమ్మకం పెరుగుతుంది" అని వ్యాఖ్యానించారు. మరోవైపు ఇటీవల ఎన్నికల్లో విజయం సాధించిన నేత ఫ్రెడ్రిక్ నీల్సన్ మాట్లాడుతూ తమ దేశమంటే చిన్నచూపును అమెరికన్ల పర్యటన తెలియజేస్తోందన్నారు. ఇక డెన్మార్క్ ప్రధాని ఫ్రెడ్రిక్సన్ ఓ వార్తా సంస్థకు తన స్పందన తెలియజేశారు. అమెరికా ప్రతినిధి బృందం పర్యటనను కొంత తీవ్రంగానే తీసుకోవాల్సి ఉంటుందన్నారు. గ్రీన్‌ల్యాండ్‌లో జరిగే సంప్రదాయ డాగ్డ్ రేస్‌ను వీక్షించేందుకు ఉషావాన్స్ పర్యటించనున్నట్టు శ్వేతసౌధం వెల్లడించింది. అంతేకాదు.. ఉషతోపాటు ఆమె కుమారుడు, అమెరికా ప్రతినిధుల బృందం ఉంటుందని పేర్కొంది. గ్రీన్‌ల్యాండ్ సంప్రదాయాలను ఆమె తెలుసుకొంటారని వెల్లడించింది. 1953 వరకు డెన్మార్క్ గ్రీన్‌ల్యాండ్ కాలనీగానే కొనసాగింది. ఆ తర్వాత దానికి స్వయంపాలనకు సంబంధించిన అవకాశాలు వచ్చాయి. 2009లో తమ భూభాగంపై ఖనిజాలు, శాంతిభద్రతలు, కోర్టులు-చట్టాలపై అధికారాలు సంక్రమించాయి. ఇప్పటికే డెన్మార్మ్ చేతిలో భద్రత, విదేశాంగ విధానం, ద్రవ్య పరపతి విధానం ఉన్నాయి.

ట్రంప్ కార్యవర్గం గ్రీన్‌ల్యాండ్‌పై దృష్టిపెట్టడానికి పలు కారణాలున్నాయి. రెండో ప్రపంచ యుద్ధకాలం నుంచే అక్కడ అమెరికా వైమానిక స్థావరం ఉంది. ప్రచ్ఛన్న యుద్ధకాలంలో సోవియట్ నుంచి, తరవాత ఉక్రెయిన్ యుద్ధంలో రష్యా నుంచి ముప్పును ఎదుర్కోవడానికి నాటో సైనిక కూటమి తరపున అమెరికా ఆ స్థావరాన్ని నిర్వహిస్తోంది. గ్రీన్‌ల్యాండ్, కెనడా, అలాస్కా, నార్వే, స్వీడన్, ఫిన్లాండ్, డెన్మార్క్, రష్యాలు అతిశీతల ఆర్కిటిక్ మహాసముద్ర ప్రాంతంలో ఉన్నాయి. ఇప్పుడు వేసవిలో ఆర్కిటిక్ మహాసముద్ర మంచు దశాబ్దానికి 12.2శాతం చొప్పున కరిగిపోతోంది. మంచులేని ఆర్కిటిక్ ప్రాంతంలో రవాణా నౌకల సంచారం పెరిగిపోతుంది. అక్కడి అపార చమురు, గ్యాస్ నిక్షేపాలు, అరుదైన లోహాలను తవ్వితీయడానికి పోటీ ముమ్మరమవుతుంది. భూగోళంపై అరుదైన లోహ నిక్షేపాల్లో 25శాతం గ్రీన్‌ల్యాండ్‌లో పోగుపడ్డాయి. ఆర్కిటిక్ మంచు కరిగి ఉత్తర సముద్రమార్గం అందుబాటులోకి వస్తే చైనా, జపాన్లనుంచి సరకులను ఆ మార్గంలోనే అమెరికా, ఐరోపాలకు పంపవచ్చు.



**ఉత్తర కరోలినాలో...**

అమెరికాలోని నార్త్ కరోలినా రాష్ట్రంలో కార్చిచ్చులు వ్యాపిస్తున్నాయి. దీంతో పశ్చిమ ప్రాంతంలో ఉన్న పోక్ కౌంటీ నుంచి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. పోక్ కౌంటీకి సమీపంలో 1,100 నుంచి 1,240 ఎకరాల విస్తీర్ణంలో రెండు, బుర్కె, మాడిసన్ కౌంటీల వద్ద రెండు, స్టోక్స్ కౌంటీ వద్ద ఒక కార్చిచ్చు వేగంగా వ్యాపిస్తున్నాయి. మరోవైపు కార్చిచ్చులను అదుపు చేయడానికి సహాయక సిబ్బంది తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఇటీవలే హరికేన్‌తో తీవ్రంగా దెబ్బతిన్న ప్రాంతాల్లోనే కార్చిచ్చులు చెలరేగడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.



***పశ్చిమ జపాన్‌లో...***

*పశ్చిమ జపాన్‌లో రెండు కార్చిచ్చులు బీభత్సం సృష్టిస్తున్నాయి. దావానలం కారణంగా పదుల సంఖ్యలో ఇళ్లు, వేల సంఖ్యలో చెట్లు బూడిదయ్యాయి. వందల మంది ఇళ్లను వదిలి సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లారు. ఇవాహరి నగరంలోని ఎహిమ్ ప్రిఫెక్చర్లోని కొండవాలుపై ఉన్న చెట్లు.. ఓ కార్చిచ్చు కారణంగా కాలిపోతున్నాయి. హెలికాప్టర్ల ద్వారా మంటలను అదుపులోకి తెచ్చేందుకు అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా యత్నిస్తున్నారు. మరోవైపు ఒకాయమా నగరంలో ఆదివారం చెలరేగిన మంటలతో పలు ఇళ్లు కాలి బూడిదయ్యాయి. ప్రభావిత ప్రాంతాల్లోని నివాసితులను అధికారులు ఖాళీ చేయించారు.*



## ఆ ఒక్క కారణంతోనే ఐపీఎల్ ఆడుతున్నా: ధోనీ

అభిమానుల కోసమే 43 ఏళ్ల వయసులో ఐపీఎల్ ఆడుతున్నానని చెన్నై సూపర్ కింగ్స్(సీఎస్కే) మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ తెలిపాడు. అభిమానుల ప్రేమకు కృతజ్ఞత చెప్పేందుకు తనకు ఉన్న ఏకైక మార్గం ఇదేనని చెప్పాడు. ఐపీఎల్ 2025 సీజన్‌లో అనామక ప్లేయర్‌గా బరిలోకి దిగిన మహేంద్ర సింగ్ ధోనీ తొలి మ్యాచ్‌లోనే అసాధారణ ప్రదర్శన కనబర్చాడు. ముంబై ఇండియన్స్‌తో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో కళ్లు చెదిరే స్టంపింగ్‌తో ఆకట్టుకున్నాడు. ఈ మ్యాచ్‌లో సీఎస్కే 4 వికెట్ల తేడాతో గెలుపొందింది.

అయితే ఐపీఎల్ 2025 సీజన్ నేపథ్యంలో అధికార బ్రాడ్‌కాస్టర్ జియో హాట్‌స్టార్‌కు ధోనీ స్పెషల్ ఇంటర్వ్యూ ఇచ్చాడు. ఈ ఇంటర్వ్యూలో ఆసక్తికర విషయాలు పంచుకున్నాడు. 'నేను ఎప్పుడూ చెప్పేది ఇదే. అభిమానుల ప్రేమకు కృతజ్ఞత తెలిపేందుకే ఐపీఎల్ ఆడుతున్నాను. నేను చాలా ఏళ్లుగా ఐపీఎల్‌లో కొనసాగుతున్నా. ఇంకెన్నాళ్లు ఆడుతానో తెలియదు. కానీ అభిమానులు నాపై చూపించే ప్రేమ, ఇచ్చే మద్దతు మాత్రం అద్భుతం. ఒక అథ్లెట్ కోరుకునేది అభిమానుల ప్రశంసలు మాత్రమే.

ప్రస్తుతం నేను అంతర్జాతీయ క్రికెట్ ఆడటం లేదు కాబట్టి నాకు ఉన్న ఏకైక ఆప్షన్ ఐపీఎల్. ఇతర ఫ్రాంచైజీల ఫ్యాన్స్ కూడా నా కోసం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తారు. నేను బాగా రాణించాలని కోరుకుంటారు. వారి అభిమాన జట్టుతో ఆడుతున్నప్పటికీ నేను బాగా ఆడాలని కోరుకుంటారు. ఇది నాకు చాలా సంతోషాన్నిస్తుంది.

నేను బ్యాటింగ్ వెళ్లినప్పుడు స్కోర్ బోర్డును చూస్తాను. జట్టు నా నుంచి ఏం ఆశిస్తుందో నాకు తెలిసిపోతుంది. కొన్ని బంతులు మాత్రమే మిగిలి ఉంటే భారీ షాట్స్ ఆడుతాను. అదే విధంగా ఫీల్డింగ్‌లో బౌలర్లకు కొన్ని సూచనలు చేస్తాను. ఒక ఓవర్‌లో నాలుగు బౌండరీలు ఇచ్చినా.. చివరి రెండు బంతులు డాట్ చేస్తే మనకు విజయం దక్కుతుందని చెబుతాను. ఆత్మవిశ్వాసం కోల్పోవద్దని సూచిస్తాను. మా జట్టులో 99 శాతం తీసుకునే నిర్ణయాలు రుతురాజ్‌వే. నేను వెనకుండి ఏమీ చేయను. కేవలం ఏమైనా సాయం చేయమంటేనే ఆ సమయానికి చేస్తాను. జట్టును అతను అద్భుతంగా నడిపిస్తున్నాడు.'అని ధోనీ చెప్పుకొచ్చాడు.

### కొంపముంచిన పంత్.. గెలిచే మ్యాచ్‌లో ఓడిన లక్నో!

# ఢిల్లీ క్యాపిటల్స్ విజయం





ఐపీఎల్ 2025 సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ అదిరిపోయే ఆరంభాన్ని అందుకుంది. లక్నో సూపర్ జెయింట్స్‌తో సోమవారం వైజాగ్ వేదికగా ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ ఒక్క వికెట్ తేడాతో గెలుపొందింది. అషుతోష్ శర్మ(31 బంతుల్లో 5 ఫోర్లు, 5 సిక్స్‌లతో 66 నాటౌట్) సంచలన బ్యాటింగ్‌తో ఓడిపోయే మ్యాచ్‌లో ఢిల్లీకి విజయాన్నందించాడు. గత సీజన్ తరహాలోనే అషుతోష్ శర్మ అసాధారణ బ్యాటింగ్ ప్రదర్శన కనబర్చాడు.

ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన లక్నో సూపర్ జెయింట్స్ నిర్ణీత 20 ఓవర్లల్లో 8 వికెట్లకు 209 పరుగుల భారీ స్కోర్ చేసింది. మిచెల్ మార్ష్(36 బంతుల్లో 6 ఫోర్లు, 6 సిక్స్‌లతో 72), నికోలస్ పూరన్(30 బంతుల్లో 6 ఫోర్లు, 7 సిక్స్‌లతో 75) విధ్వంసకర బ్యాటింగ్‌తో రాణించారు. ఢిల్లీ క్యాపిటల్స్ బౌలర్లలో మిచెల్ స్టార్క్(3/42) మూడు వికెట్లు తీయగా.. కుల్దీప్ యాదవ్(2/20) రెండు వికెట్లు పడగొట్టాడు. ముఖేష్ కుమార్, విప్రాజ్ నిగమ్, మిచెల్ స్టార్క్ తలో వికెట్ తీసారు.

అనంతరం ఢిల్లీ క్యాపిటల్స్ నిర్ణీత 19.3 ఓవర్లలో 9 వికెట్లకు 211 పరుగులు చేసి గెలుపొందింది. అషుతోష్ శర్మ అజేయ హాఫ్ సెంచరీతో రాణించగా.. విప్రజ్ నిగమ్(15 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లతో 39), ట్రిస్టన్ స్టబ్స్(22 బంతుల్లో ఫోర్, 3 సిక్స్‌లతో 34) కీలక ఇన్నింగ్స్ ఆడారు. లక్నో సూపర్ జెయింట్స్ బౌలర్లలో శార్దూల్ ఠాకూర్(2/19), మనిమరణ్ సిద్దార్థ్(2/39), దిగ్వేష్ రతి(2/31), రవి బిష్ణోయ్(2/53) రెండేసి వికెట్లు తీసారు.

ఆఖరి ఓవర్‌లో మోహిత్ శర్మను స్టంపౌట్ చేసే అవకాశాన్ని రిషభ్ పంత్ చేజార్చాడు. దాంతో గెలవాల్సిన మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్ ఓటమిపాలైంది. ఈ స్టంపౌట్ చేసి ఉంటే ఢిల్లీ ఆలౌటై.. లక్నో గెలిచేది. మరోవైపు అషుతోష్ శర్మ అసాధారణ బ్యాటింగ్‌తో ఢిల్లీ క్యాపిటల్స్‌కు సంచలన విజయాన్నందించాడు.

### తండ్రైన కేఎల్ రాహుల్..

# పండంటి ఆడ బిడ్డకు జన్మనిచ్చిన అతియా శెట్టి!




టీమిండియా స్టార్ బ్యాటర్ కేఎల్ రాహుల్ తండ్రయ్యాడు. అతని సతీమణి, బాలీవుడ్ హీరోయిన్ అతియా శెట్టి సోమవారం పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఈ విషయాన్ని కేఎల్ రాహులే సోషల్ మీడియా వేదికగా ప్రకటించాడు. కూతురు పుట్టిందని ట్వీట్ చేశాడు.


అతియా శెట్టిని కేఎల్ రాహుల్ ప్రేమించి పెళ్లి చేసుకున్న విషయం తెలిసిందే. సీక్రెట్‌గా లవ్ ఎఫైర్ నడిపించిన ఈ ఇద్దరూ.. 2021లో తమ ప్రేమను అధికారికంగా ప్రకటించారు. కుటుంబ సభ్యులను ఒప్పించి 2023, జనవరి 23న వివాహం చేసుకున్నారు.

అతియా ప్రసవం కోసమే కేఎల్ రాహుల్.. ఐపీఎల్ 2025 సీజన్ తొలి మ్యాచ్‌కు దూరమైన విషయం తెలిసిందే. ఈ సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌కు ఎంపికైన రాహుల్.. లక్నో సూపర్ జెయింట్స్‌తో వైజాగ్ వేదికగా జరుగుతున్న మ్యాచ్‌కు దూరంగా ఉన్నాడు.

ఈ మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. డ్యూ ప్రభావం నేపథ్యంలోనే ఈ నిర్ణయం తీసుకున్నానని ఢిల్లీ క్యాపిటల్స్ అక్షర్ పటేల్ తెలిపాడు. 'మేం ముందుగా బౌలింగ్ చేస్తాం. డ్యూ నేపథ్యంలో మేం ఎలాంటి రిస్క్ తీసుకోవాలనుకోవడం లేదు. అందుకే ముందుగా బౌలింగ్ చేస్తున్నాం. గతంలో నేను పంత్‌తో కలిసి ఆడాను. నా గురించి అతనికి.. పంత్ గురించి నాకు బాగా తెలుసు. మా వ్యూహాలు ఎలాంటి ఉంటాయో ఇద్దరికి తెలుసు.

ఢిల్లీ క్యాపిటల్స్ తరఫున చాలా మ్యాచ్‌లు ఆడాను. మా జట్టు సమతూకంగా ఉంది. ఇక్కడ కొన్నిసార్లు డ్యూ వచ్చింది. గత మూడేళ్లుగా నేను ఢిల్లీ తరఫున ఆడుతున్నాను. లీడర్‌షిప్ గ్రూప్‌లో ఒకడిగా ఉన్నాను. అందుకు తగ్గట్లే నేను పనిచేయాల్సి ఉంది. ఓ లీడర్‌లా ఆలోచించాలి. ఫాఫ్ డుప్లెసిస్, స్టబ్స్, స్టార్క్, ఫ్రెజర్ మెక్‌గర్క్ మా ఓవర్‌సీస్ ఆటగాళ్లు.'అని అక్షర్ పటేల్ తెలిపాడు.

# ఆ రికార్డే నా టార్గెట్: ఇషాన్ కిషన్



తొలి మ్యాచ్‌లోనే సన్‌రైజర్స్ హైదరాబాద్ గత రికార్డును బద్దలు కొట్టాలని భావించింది. మ్యాచ్ ముగిసిన తర్వాత ఈ విషయాన్ని సెంచరీ హీరో ఇషాన్ కిషన్ స్వయంగా వెల్లడించాడు. "మ్యాచ్ మధ్యలో వాటర్ బాటిల్‌తో ఒకరు మైదానంలోకి వచ్చారు.

'ఈసారి మనం రికార్డు స్కోర్ (287)ను దాటాలి' అని అన్నారు. వారు దానిని లక్ష్యంగా పెట్టుకొన్నారా..? ఇంకేమైనానా అన్న విషయం తెలియదు. కానీ, మనం ఏదైనా లక్ష్యాన్ని సాధించలేనప్పుడు.. దానికోసం మరోసారి ప్రయత్నం చేయాలనిపిస్తుంది.

ఆ లక్ష్యాన్ని మేము రాజస్థాన్‌లో జరిగిన మ్యాచ్‌లో సాధించలేదు. రానున్న రోజుల్లో మేం పుంజుకోవడానికి అదే గోల్ అవుతుంది. మాకు మంచి ఆరంభం వచ్చినప్పుడు రికార్డు స్కోర్ సాధించడానికి యత్నిస్తాం" అని పేర్కొన్నాడు.

**నాడు మొదటి కాల్ అభిషేక్ శర్మకే..**

వేలంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ కొనుగోలు చేయగానే.. తొలుత మొబైల్ తీసి అభిషేక్ శర్మకు ఫోన్ చేసినట్లు ఇషాన్ కిషన్ వెల్లడించాడు. "నాడు ఫోన్ చేసిన వెంటనే.. మీరు నా నుంచి ఏం ఆశిస్తున్నారు. నేనొచ్చి ప్రతి బంతిని బాదాలనా..? అని ప్రశ్నించాను. దానికి అభిషేక్ స్పందిస్తూ.. 'అవును. అదే నీ పని నువ్వు ఇక్కడికి రావడం.. ప్రతిబంతిని చితక్కొట్టడం. ఈ జట్టులో నువ్వు ఎంజాయ్ చేస్తావని అభిషేక్ చెప్పాడు. నేను ఈ మ్యాచ్‌కు ముందే దానిని ఫీల్ అయ్యాను. నాకు అందిన మెసేజ్ చాలా స్పష్టంగా ఉంది. బంతి కనిపిస్తే.. వీరబాదుడు బాదడమే. మ్యాచ్‌లో ప్రతిక్షణం ఆస్వాదించడం. ఈ టోర్నీ మొత్తం మేము అలానే ఆడనున్నాం. మేము చాలా పటిష్ఠమైన స్థితిలో ఉన్నా సరే.. ప్రతి మ్యాచ్‌లో అలానే ఆడతాము" అని ఇషాన్ వెల్లడించాడు.

**బీసీసీఐ కాంట్రాక్టుపై..**

ఈసందర్భంగా బీసీసీఐ కాంట్రాక్టు నుంచి తొలగించడంపై ఇషాన్ను ప్రశ్నించగా.. సానుకూల దృక్పథంతో స్పందించాడు. "పరిస్థితి ఏదైనా సరే.. చెడు గురించి ఆలోచించే వ్యక్తిని కాదు. వర్తమానంలో జీవిస్తాను. బాగా ఆడటం ముఖ్యం.. అది నాకు కూడా మంచిది. నేను ఏం చేస్తానో చివరికి అదే నాకు ఉపయోగపడుతుంది. ప్రతికూల ఆలోచనలు మొత్తం పక్కన పెట్టాలని నిర్ణయించుకొన్నాను. భవిష్యత్తు పైనే దృష్టిపెట్టాను" అని చెప్పాడు.

హైదరాబాద్ జట్టు నుంచి అత్యంత వేగవంతమైన మూడో శతకం చేసిన బ్యాటర్‌గా ఇషాన్ నిలిచాడు. గతంలో ట్రావిస్ హెడ్, డేవిడ్ వార్నర్లు ఈ జాబితాలో ఉన్నారు. ఆదివారం మ్యాచ్‌లో ఇషాన్ 47 బంతుల్లో 106 పరుగులు సాధించాడు.

# అలా.. ఛాన్సులు మిస్సయ్యా



'చాలామంది దర్శక నిర్మాతలు నాకు పొగరనుకున్నారు. దాని ఫలితంగా ఎన్నో మంచి అవకాశాలు మిస్సైపోయాను' అంటున్నారు కన్నడ స్టార్ హీరో యశ్. 'మనద కదలు' ట్రైలర్ రిలీజ్ కార్యక్రమంలో -కెరీర్ ఆరంభంనాటి ముచ్చట్లు వెల్లడించారు యశ్. "ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన టైంలో వచ్చిన ప్రతి అవకాశానికీ ఓకే చెప్పేసేవాడిని. నన్ను నేను ప్రూవ్ చేసుకోవాలన్న కసి. ఆ క్రమంలోనే ఏదైనా ప్రాజెక్ట్ కోసం నన్ను సంప్రదించిన దర్శకులను పూర్తి స్క్రిప్ట్ అడిగేవాడిని. దాంతో నాకు పొగరనే ముద్ర వేశారు. వాళ్లందరికీ నా ప్రశ్న ఒక్కటే.. 'స్క్రిప్ట్ చదవకుండా.. నేను ఏవిధంగా ఒక కథను నమ్మి సినిమా చేయగలను?' ఈ కారణంతోనే నేను ఎన్నో అవకాశాలు కోల్పోయా. అలాంటి సమయంలో నిర్మాత కృష్ణప్ప నాకెంతో సపోర్ట్‌గా నిలిచారు. నాపై నమ్మకం ఉంచారు. దర్శకుడు శశాంక్ నాకు పూర్తి స్క్రిప్ట్ వివరించడంతో 'మొగ్గిన మనసు' కోసం వర్క్ చేశా. ఇప్పటికీ ఆ బృందం అంటే నాకెంతో గౌరవం' అన్నారు యశ్. మధ్య తరగతి కుటుంబానికి చెందిన యశ్ చిన్నతనం నుంచే నటుడు కావాలని కలలు కన్నారు. 16 ఏళ్ల వయసులో బెంగళూరుకు వచ్చిన ఆయన ఎన్నో సవాళ్లు ఎదుర్కొన్నారు. నాటకాల్లో నటించారు. సీరియల్ నటుడిగా కెరీర్ ప్రారంభించారు. అనంతరం ఆయన పలు చిత్రాల్లో సహాయ నటుడిగా కనిపించారు. యశ్ హీరోగా నటించిన తొలి చిత్రం 'మొగ్గిన మనసు'. ఆయన సతీమణి రాధిక ఇందులో కథానాయిక. 2018లో విడుదలైన 'కేజీఎఫ్' ఆయన కెరీర్‌నే మార్చేసింది. ఆ సినిమా తర్వాత యశ్ స్టార్ హీరో అయ్యారు. ప్రస్తుతం ఆయన 'టాక్సిక్' కోసం వర్క్ చేస్తున్నారు. దీనితోపాటు నితీశ్ తివారీ రూపొందిస్తోన్న 'రామాయణ' చిత్రాన్ని నిర్మిస్తూ.. నటిస్తున్నారు.

## బ్లో అప్



ప్రీతి ముకుందన్

## కమర్షియల్ నాకు సూటవ్వదు

సుహాస్, మాళవిక మనోజ్ జోడీగా రామ్ గోదల తెరకెక్కిస్తున్న చిత్రం 'ఓ భామ అయ్యో రామ'. హరీశ్ నల్ల నిర్మాత. తాజాగా సినిమా టీజర్ లాంచ్ చేసిన సందర్భంలో మూవీ యూనిట్ చిట్ చాట్ నిర్వహించింది. చిట్‌చాట్‌లో సుహాస్ మాట్లాడుతూ 'ఈ సినిమా ఎంచుకోవడానికి కారణం స్టోరీ. సెకండ్ హాఫ్‌లో ట్విస్ట్ చాలా బావుంటుంది. ఈ స్టోరీలో ఎమోషన్స్‌కి అంతా కనెక్టవుతారని నమ్మకం. ఇక చాలామంది అడుగుతున్నట్టు -నా సినిమాకు బాక్సాఫీస్ నంబర్లు రాకపోవడంపైనే నేనూ ఆలోచిస్తున్నాను. సినిమా బాగుంది అంటున్నారు కానీ, కలెక్షన్లు రావట్లేదు. బహుశ, కమర్షియల్ సినిమాలు చేయకపోవడం వల్ల కావొచ్చు. కాని, కమర్షియల్ ప్రాజెక్టులు నాకు సెట్టవ్వవు. అందుకే చేయట్లేదు. హీరోగా నటిస్తూనే క్యారెక్టర్ ఆర్టిస్టుగా చేస్తా. తమిళంలో త్వరలోనే ఓ సినిమా చేయబోతున్నా అన్నారు. దర్శకుడు రామ్ మాట్లాడుతూ -ఇందులో హీరో పేరు రామ్.. హీరోయిన్ పేరు సత్య. ఓ భామ అంటే ఒక అమ్మాయి..అయ్యో రామ అంటే తనపరిస్థితులు.. ఇంతకు మించి చెప్పలేను. సినిమా చూశాక ఇంకా మీకు క్లారిటీ వస్తుంది. నా రియల్ లైఫ్‌లో రిగిన కొన్ని సంఘటనలు సినిమాలో మీరు చూస్తారు. ఇక, కథ రాసుకునేటప్పుడే సుహాస్ హీరో అయితే బాగుందని అనుకున్నాను. ఈ పాత్రకు ఆయన సరిపోతారు. కథ బాగుంటే తెలుగు ఆడియన్స్ ఆదరిస్తారన్నది అనేకసార్లు రుజువైంది. ఈసినిమాతోనూ మళ్లీ రుజువవుతుంది.



'నా పాత్ర పేరు సత్యభామ. ఇలాంటి సినిమాలో ఇప్పటి వరకూ నటించలేదు. టాలీవుడ్ ఇండస్ట్రీ చాలా పెద్దది. గొప్ప సినిమాలు ఇక్కడినుంచే వస్తున్నాయి' అన్నారు హీరోయిన్ మాళవిక మనోజ్. కథ డిమాండ్‌ను బట్టి ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా ప్రాజెక్టు తెరకెక్కించామన్నారు నిర్మాత హరీశ్.

## మాదొక.. లవ్ ఎంటర్‌టైనర్

యాంకర్‌గా తెలుగు ప్రేక్షకుల్లో మంచి ఫ్యాన్ ఫాలోయింగ్, పాపులారిటీ తెచ్చుకున్న ప్రదీప్ మాచిరాజు హీరోగా నటిస్తోన్న చిత్రం 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి'. దీపిక కథానాయిక. నితిన్, భరత్ దర్శకత్వం వహిస్తున్నారు. చిత్ర ప్రమోషన్‌లో భాగంగా విశాఖలో మీడియాతో హీరో ప్రదీప్ మాట్లాడుతూ.. లవ్, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న సినిమా నుంచి తొలి సాంగ్ విడుదలైందన్నారు. 'ఎవ్వడో ఈడి కొచ్చినాడు సూడు' అంటూ సాగే పాటను ఉదిత్ నారాయణ ఆలపించారని.. మనసుని హత్తుకునే మెలొడీకి శ్రీధర్ లిరిక్స్ అందించారన్నారు. ఏప్రిల్ 11న థియేటర్లకు వస్తున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ను ఆదరించాలని కోరారు. హీరోయిన్ దీపిక పిల్లి మాట్లాడుతూ తన క్యారెక్టర్ పైనే కథంతా నడుస్తుందని, హీరో ప్రదీప్‌తో నటించడం హ్యాపీగా ఉందన్నారు. కచ్చితంగా సినిమా బ్లాక్ బస్టర్ హిట్టు కొడుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు.



## గొప్ప కథలొచ్చినా.. ఆస్కార్లే లేవు

మన దేశంలో ఎంతోమంది టాలెంటెడ్ నటీనటులు ఉన్నారని నటి దీపికా పదుకొణె అన్నారు. తాజాగా దీపికా తన ఇన్స్టాలో ఓ వీడియోను పంచుకున్నారు. అందులో ఆస్కార్ గురించి తన వ్యక్తిగత అభిప్రాయాన్ని పంచుకుంటూ ఈ మాట అన్నారు. 'చాలాసార్లు మనకు రావాల్సిన ఆస్కార్లను లాగేసుకున్నారు. భారతదేశ సినీ చరిత్రలో ఎన్నో గొప్ప కథలు తెరకెక్కాయి. కానీ ఆ సినిమాలకు, ఆ కథలకు, నటీనటుల ప్రతిభకు గుర్తింపు రాలేదు. 'ఆర్ఆర్ఆర్'లోని పాటకు ఆస్కార్ ప్రకటించినప్పుడు నేను ప్రేక్షకుల్లో కూర్చొని ఉన్నాను. ఆ సమయంలో ఎంతో భావోద్వేగానికి గురయ్యాను. నిజానికి ఆ సినిమాతో నాకు ఎలాంటి సంబంధం లేదు. నేను ఆ సినిమాలో భాగం కూడా కాదు. కేవలం ఒక భారతీయురాలి గా ఆ క్షణంలో వ్యక్తిగతంగా ఎంతో ఆనందం వేసింది. ఆ క్షణాలను ఎప్పటికీ మర్చిపోలేను. 'ది బ్రూటలిస్ట్' చిత్రానికిగాను ఈ ఏడాది అడ్రియన్ బ్రాడీ ఉత్తమ నటుడిగా ఆస్కార్ గెలిచినందుకు నేను సంతోషించాను" అని చెప్పారు. ఇక 2023లో జరిగిన ఆస్కార్ ప్రదానోత్సవంలో దీపిక 'ఆర్ఆర్ఆర్' చిత్రంలోని నాటునాటుని ఆడియన్స్‌కు పరిచయం చేసిన సంగతి తెలిసిందే. 'డు యూ నో నాటు?' తెలియకపోతే ఇప్పుడు తెలుసుకుంటారు. 'ఆర్ఆర్ఆర్' చిత్రంనుంచి 'నాటు నాటు ఇదే..' అంటూ దీపిక ఈ పాటను పరిచయం చేయడంతో వేదిక మొత్తం చప్పట్లతో మారుమోగింది.



## వరుణ్‌కి హిట్టు పడేనా..!

సక్సెస్ కోసం ఎదురుచూస్తున్న నటుడు వరుణ్ తేజ్. ఈ క్రమంలోనే ఆయన మేర్లపాక గాంధీ దర్శకత్వంలో విభిన్నమైన కాన్సెప్ట్ చిత్రానికి సంతకం చేసిన విషయం తెలిసిందే. తాజాగా సినిమా పూజా కార్యక్రమం హైదరాబాద్‌లో జరిగింది. చిత్రబృందం దంతోపాటు దర్శకుడు క్రిష్, వరుణ్ సతీమణి లావణ్య త్రిపాఠి, సోదరి నిహారిక పాల్గొన్నారు. చిత్రబృందానికి ఆల్ ది బెస్ట్ చెప్పారు. ఇండో - కొరియన్ హారర్ కామెడీ ఫిల్మ్‌గా ఇది సిద్ధం కానుంది. యూవీ క్రియేషన్స్,ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్టైన్మెంట్స్ సంయుక్తంగా దీనిని నిర్మిస్తున్నాయి. తమన్ స్వరాలు అందించనున్నారు.వరుణ్‌తేజ్ 15వ చిత్రంగా తెరకెక్కనుంది.ఇందులో ఆయనకు జంటగా రితికా నాయక్ నటించనున్నారు.'ఎక్స్‌ప్రెస్ రాజా', 'వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్', 'ఏక్ మినీ కథ' వంటి చిత్రాలను మేర్లపాక గాంధీ తెరకెక్కించిన విషయంతెలిసిందే.

## మళ్లీ.. మొదలెట్టిన మాళవిక?

కమర్షియల్ డైరెక్టర్ మారుతి.. ప్రభాస్‌తో 'ది రాజా సాబ్' ప్రాజెక్టు తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాలో మాళవిక మోహనన్ హీరోయిన్‌గా నటిస్తోంది. అయితే, గతంలో ఈ భామ ప్రభాస్ గురించి, ప్రభాస్ మంచితనం గురించి, ముఖ్యంగా ప్రభాస్ తన కోసం షూటింగ్‌కు పంపించే ఫుడ్ గురించి చాలా పాజిటివ్ కామెంట్స్ చేసింది. తాజాగా మాళవిక మోహనన్ మళ్లీ ప్రభాస్ గురించి మాట్లాడుతూ క్రేజీ కామెంట్స్ చేసింది. 'ప్రభాస్‌తో కలిసి నటించడం నా అదృష్టం. ఒకవిధంగా నా జీవితంలోనే ప్రభాస్‌తో కలిసి సినిమా చేయడం నాకు ఓ మైలు రాయి' అంటూ మాళవిక మోహనన్ తన ఆనందాన్ని వ్యక్తం చేసింది. ప్రస్తుతం ఈ బ్యూటీ కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. మాళవిక మోహనన్ తమిళంలో వరుసగా సినిమాలు చేసింది. రజినీకాంత్, దళపతి విజయ్, ధనుష్‌లాంటి స్టార్ హీరోల సినిమాల్లో నటించి మెప్పించింది. ఇప్పుడు ప్రభాస్ నటిస్తున్న రాజా సాబ్ సినిమాతో తెలుగులోకి అడుగుపెట్టనుంది.